తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 18.05.2026 | సంపుటి : 12 సంచిక : 298 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి



## పోక్సో కేసులో కుమారుడిని దాచిపెట్టాడు
## నిందితుడికి సహకరించడం నేరమే

- పదవి తొలగించకపోతే కేసులో విచారణ సరిగా జరగదు
- ఆయన కేంద్రమంత్రిగా కొనసాగడం దేశానికే అవమానం
- ప్రధాని మోదీ చెబుతున్న 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితమైంది : కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్– నా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టైన నేపథ్యంలో కేటీఆర్ ఈ విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం


మిగతా 2లో..

దేశ చరిత్రలో బహుశా మొదటిసారి ఓ కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ సర్క్యులర్ ఇచ్చే పరిస్థితి వచ్చింది. ప్రధాని మోదీ చెబుతున్న 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితమైంది.బండి సంజయ్‌ని మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసులో విచారణ సరిగా జరగదు. తప్పు చేసిన వ్యక్తిని దాదాపు తొమ్మిది రోజులపాటు దాచిపెట్టింది కేంద్రమంత్రే.. - కేటీఆర్

# ఎబోలా డేంజర్‌బెల్స్

## కాంగోలో విస్తృతంగా వ్యాపించిన వైరస్
## ఇప్పటికే 88మంది ప్రాణాలు కోల్పోగా మరో 300మంది సోకిన మహమ్మారి

- హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యూహెచ్‌వో
- పొరుగు దేశమైన ఉగాండాలోనూ వైరస్ ఆనవాళ్లు





బ్రాజవిల్లె(జనంసాక్షి): ప్రాణాంతక ఎబోలా వైరస్‌తో ఆఫ్రికా ఖండంలోని కాంగోలో 88మంది ప్రాణాలు కోల్పోగా మరో 300మంది ఈ వైరస్ బారిన పడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. కాంగో పొరుగు దేశమైన ఉగాండాలో కూడా వైరస్ ఆనవాళ్లు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. దీనివల్ల ప్రపంచ దేశాలకు తక్షణ ముప్పు లేకపోయినా.. కాంగో పొరుగు దేశాల్లో వేగంగా వ్యాపించే ప్రమాదముందని హెచ్చరించింది. ఇతర దేశాల్లో ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు తెలిపింది. 1976లో కాంగోలో ఎబోలాను తొలిసారిగా గుర్తించినప్పటి నుంచి ఇది 17వ సారి వ్యాప్తి చెందడమని వెల్లడించింది. ప్రాథమిక నమూనాలలో అధిక పాజిటివిటీ రేటు.. వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళనకరంగా మారిందని పేర్కొంది. ఈ వైరస్‌కు ప్రత్యేకంగా అమోదించిన చికిత్సలు, వ్యాక్సిన్‌లు లేకపోవడం వల్ల దీనిని వెంటనే అరికట్టడం కూడా అసాధ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. జాతీయ విపత్తు అత్యవసర నిర్వహణ యంత్రాంగాలను క్రియాశీలం చేయాలని, సరిహద్దుల వెంబడి స్క్రీనింగ్ చేపట్టాలని ప్రపంచ దేశాలకు సూచించింది.

మిగతా 2లో..

## ధాన్యం కొనుగోళ్లు ఎందుకు జరగడంలేదు?

- ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది :కిషన్‌రెడ్డి
- ప్రభుత్వం సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదని విమర్శ



హైదరాబాద్(జనంసాక్షి):ధాన్యం కొనుగోళ్లకు ప్రతి పైసా కేంద్రమే ఇస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్రం డబ్బులిస్తున్నా.. రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం ఎందుకు కొనడం

మిగతా 2లో..



ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానించిన మంత్రి కొండా సురేఖ. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, దేవస్థానం ఈవో మహేష్, ఆలయ అర్చకులు

## తెలంగాణలో ఎప్‌సెట్ ఫలితాలు

విడుదల చేసిన ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు



# మరోసారి ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



## క్లిష్ట పరిస్థితులు తప్పవు

- తుపాను వచ్చే ముందు ప్రశాంతంగానే ఉంటుంది
- ఏఐ ఫొటోతో ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్
- టెహ్రాన్ త్వరగా ఒక ఒప్పందానికి రావాలని లేదంటే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరిక

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో 'తుపాను వచ్చే ముందు ప్రశాంతంగానే ఉంటుంది' అంటూ ఓ ఏఐ ఫొటోతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌పై వైమానిక దాడులను పునఃప్రారంభించడంపై ట్రంప్ తన యంత్రాంగంతో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన హెచ్చరికలు చేయడం గమనార్హం. ఏఐతో రూపొందించిన ఫొటోను ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. ఆ ఫొటోలో అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలో యుద్ధనౌకలు ప్రయాణిస్తున్నాయి. అక్కడే ట్రంప్, ఆయన పక్కన ఒక యూఎస్ నేవీ అడ్మిరల్ నిలబడి ఉన్నారు. ఆ సముద్రంలో ఉన్న నౌకలపై ఇరాన్ జెండాలు ఉండటం గమనార్హం. దీనికి తుపానకు ముందు ప్రశాంతంగానే ఉంటుందని అర్థం వచ్చేలా క్యాప్షన్ పెట్టారు. అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. హార్మూజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలో దాడులు పునఃప్రారంభించడంపై ఆయన చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తుండగా.. ఆయన ఈ ఫొటో పంచుకోవడం ఆందోళనలను పెంచుతోంది.

మిగతా 2లో..

## నేడు కొలువుదీరనున్న సతీశన్ సర్కారు

- ప్రమాణ స్వీకారానికి ముందే మంత్రివర్గం ఖరారు
- కార్యక్రమానికి హాజరుకానున్న ఖర్గే, రాహుల్, ప్రియాంక, ఇతర సీనియర్ నేతలు
- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు కూడా హాజరయ్యే అవకాశం

తిరువనంతపురం(జనంసాక్షి): కేరళలో సోమవారం వీడీ సతీశన్ సారథ్యంలో యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్–యూడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరేందుకు రంగంసిద్ధమైంది. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో వీడీ సతీశన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

మిగతా 2లో..





11శతాబ్దం నాటి చోళ వారసత్వ సంపద

## తిరిగి భారత్‌కు

ప్రధాని మోదీకి అప్పగించిన నెదర్లాండ్స్

అమ్‌స్టర్‌డ్యాం(జనంసాక్షి):భారతదేశం అద్భుత దౌత్య, సాంస్కృతిక విజయాన్ని సాధించింది. 11వ శతాబ్దానికి చెందిన చారిత్రక 'చోళ రాగి ఫలకాలను' నెదర్లాండ్స్ నుంచి భారత్‌కు విజయవంతంగా తిరిగి తీసుకురానుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, డచ్ ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో శనివారం జరిగిన ఒక ఉన్నత స్థాయి కార్యక్రమంలో ఈ కళాఖండాలను అధికారికంగా తిరిగి అప్పగించారు. ఈ క్రమంలోనే నెదర్లాండ్స్ ప్రభుత్వానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. 19వ శతాబ్దం మధ్యకాలం నుంచి


మిగతా 2లో..

## గురుకులాలు, వసతి గృహ పాఠశాలలకు నెలవారీ చెల్లింపుల విధానం

2లో..

- ఇకపై ఇదే పద్ధతిన 'భవన అద్దె' 'డైట్', 'కాస్మెటిక్స్' నిధుల విడుదల
- రూ. 221.24 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

## ముందుంది మండేకాలం



తెలంగాణకు హీట్‌వేవ్ అలర్ట్

- రానున్న 5 రోజులు నిప్పుల కొలిమిలా రాష్ట్రం
- అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి: ఐఎండీ
- పలు జిల్లాలకు రెడ్ ఆరెంజ్ అలర్ట్ జారీ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. కాగా రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు

మిగతా 2లో..



## మరోసారి ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

ఇక ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ నేరుగా ఇరాన్‌ను హెచ్చరించారు. టెహ్రాన్ త్వరగా ఒక ఒప్పందానికి రావాలని లేదంటే.. క్లిష్ట పరిస్థితులు తప్పవన్నారు. ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదురుతుందా లేదా అనే విషయాన్ని తాను ఇప్పుడే చెప్పలేనని పేర్కొన్నారు. తమతో డీల్ కుదుర్చుకునేందుకు వారు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు.

## రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల వర్షం

### దాడిలో భారతీయ కార్మికుడితో సహా నలుగురు మృతి





మాస్కో(జనంసాక్షి):రష్యా రాజధాని మాస్కోలో జరిగిన డ్రోన్ దాడిలో ఓ భారతీయ కార్మికుడు మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ మేరకు రష్యాలోని భారత రాయబార కార్యాలయం ఓ ప్రకటన చేసింది. ఘటనాస్థలిని సందర్శించిన ఎంబసీ అధికారులు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. భారతీయుడి మృతి పట్ల భారత ఎంబసీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. కార్మికులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు సంబంధిత కంపెనీ యాజమాన్యం, స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది.రష్యాపై ఉక్రెయిన్ మరోసారి డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. మాస్కో సహా అనేక ప్రాంతాల్లో గడిచిన 24 గంటల్లో వందలాది డ్రోన్లను ప్రయోగించింది. అయితే, వీటిలో 556 డ్రోన్‌లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. మరోవైపు, ఈ దాడులను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమర్థించుకున్నారు. మాస్కో ఇటీవల జరిపిన దాడులకు ప్రతీకారంగానే ఈ విధంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

## యూఏఈ అణువిద్యుత్ కేంద్రం లక్ష్యంగా డ్రోన్ దాడి



అబుదాబి (జనంసాక్షి):యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని బరాకా అణువిద్యుత్ కేంద్రం లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగింది. దీంతో అక్కడున్న విద్యుత్ జనరేటర్ వద్ద మంటలు చెలరేగాయి. ఈ దాడుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అబుదాబి అధికారులు వెల్లడించారు. రేడియేషన్ సమస్య కూడా తలెత్తలేదన్నారు. మరోవైపు ఈ దాడులకు తామే బాధ్యులమని ఇప్పటివరకు ఎవరూ ప్రకటించుకోలేదు.ఇటీవల యుద్ధ సమయంలో ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థలకు, సైనిక దళాలకు యూఏఈ ఆతిథ్యం ఇచ్చింది. దీనిపై తీవ్ర ఆగ్రహంగా ఉన్న ఇరాన్.. తాజా దాడులకు పాల్పడవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతకుముందు అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేసిన విషయం తెలిసిందే. అమెరికా– ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణపై చర్చలు ముందుకు సాగకపోవడం, ప్రతిస్పందనగా ఇరాన్ ఓడరేవులను అమెరికా దిగ్బంధిస్తున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది.

## 61 మంది మహిళలపై లైంగిక వేధింపులు..

### భారతీయుడికి 13ఏళ్ల జైలు

సిడ్నీ(జనంసాక్షి):లైంగిక వేధింపుల కేసులో ఆస్ట్రేలియాలో భారత సంతతికి చెందిన ఓ వ్యక్తికి 13 ఏళ్ల జైలు శిక్ష విధించారు. అంతర్జాతీయ మీడియా సంస్థల కథనాల ప్రకారం.. భారత సంతతికి చెందిన 39 ఏళ్ల సుమిత్ సతీష్ రస్తోగి అనే వ్యక్తి 2011లో దిల్లీ నుంచి ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. అక్కడ అడిలైడ్‌లో మసాజ్ థెరపిస్ట్‌గా విధులు నిర్వహించేవాడు. మసాజ్ కేంద్రంలో 2021 అక్టోబర్ నుంచి 2022 జులై మధ్య అతడి మసాజ్ సెంటర్‌కు వచ్చిన 61మంది మహిళలను లైంగికంగా వేధించాడు. 55మంది మహిళల ప్రైవేటు వీడియోలు రహస్యంగా రికార్డ్ చేశాడు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.సరైన పత్రాలు లేకుండానే సుమిత్ మసాజ్ సెంటర్‌ను నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నాటి నుంచి ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది. నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో తాజాగా దక్షిణ ఆస్ట్రేలియా జిల్లా కోర్టు అతడికి 13ఏళ్ల 10 నెలలు జైలు శిక్ష విధించింది. ఇదీ చదవండి: ఎబోలా వ్యాప్తి.. హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన చిఊూ

## 8 మంది మావోయిస్టుల అరెస్ట్

చర్ల(జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో కొనసాగుతున్న ఆపరేషన్‌లో భాగంగా గడ్చిరోలి పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా నిర్వహించిన గాలింపు చర్యల్లో 8 మంది మావోయిస్టులు అరెస్టయ్యారు. వారి నుంచి రూ.63 లక్షలకు పైగా నగదుతో పాటు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. సరిహద్దు అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందుకున్న భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టి అరెస్ట్ చేశాయి.




# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి

జరిగితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మిన్నకుండిపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయని కేటీఆర్ విమర్శించారు. కానీ ఆ బాలికకు న్యాయం జరిగేలా బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమే పోరాడిందని తెలిపారు. గత రెండున్నరేళు ్లగా తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. ప్రధాని మోదీ చెబుతున్న 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు. దేశ చరిత్రలో బహుశా మొదటిసారి ఓ కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ సర్క్యులర్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు.బండి సంజయ్‌ని మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసులో విచారణ సరిగా జరగదని కేటీఆర్ అనుమానం వ్యక్తంచేశారు. తప్పు చేసిన వ్యక్తిని దాదాపు తొమ్మిది రోజులపాటు దాచిపెట్టింది కేంద్రమంత్రేనని ఆరోపించారు. బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేసి కేసును నీరుగార్చాలని



చూశారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఉన్నతమైన పదవుల్లో కొనసాగడం తెలంగాణ రాష్ట్రానికేగాక దేశానికే అవమానమని మండిపడ్డారు.ఇదిలా ఉంటే సాయి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేయలేదని.. బండి సంజయ్ ఆదేశాల మేరకు లొంగిపోయాడని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. ప్రెస్ మీట్‌లో ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు కిషన్ రెడ్డి బదులిస్తూ.. బండి సాయి భగీరథ్ సరెండర్ అయిపోయాడు కదా.. ఇంకా ఇష్యూ ఏముంది అని అన్నారు కిషన్ రెడ్డి. ఈ కామెంట్స్‌తో పోలీసుల వాదన వాస్తవం కాదని తేటతెల్లమైందనడంలో ఎలాంటి సందేహం లేదు.కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. స్టేట్ గవర్నమెంట్ పోలీస్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పోలీస్ కానీ వ్యవస్థ కానీ వేరుగా ఉంటుంది. పశ్చిమ బెంగాల్‌లో మా అమిత్ షా విమానం దిగుతుంటే రాష్ట్ర పోలీసులు అనుమతి ఇవ్వలేదు. యూపీ సీఎం విమానం దిగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీసులు అనుమతివ్వకపోతే పక్కనున్నట్వంటి ఒడిశా రాష్ట్రంలో దిగి.. అక్కడి నుంచి రోడ్డు వెంట వెళ్లాల్సి వచ్చింది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వ పోలీసులకు సంబంధించిన అంశం.. రాష్ట్ర పోలీసులకు పూర్తి అధికారం ఉంటుంది. దర్యాప్తు చేసి ఏ విషయమైనా చర్యలు తీసుకునే అధికారం ఉంటుంది. కేంద్రప్రభుత్వానికి ఇందులో ఏం ప్రమేయం ఉండదన్నారు.

## ఎబోలా డెంజర్‌బెల్స్

అదే సమయంలో వైరస్ భయంతో సరిహద్దులను మూసివేయవద్దని.. ప్రయాణ, వాణిజ్య ఆంక్షలు విధించవద్దని కోరింది. వైరస్ లక్షణాలు ఉన్నవారు ఇతర దేశాలకు వెళ్లొద్దని పేర్కొంది. వ్యాధి నిర్ధరణ అయిన వారిని వెంటనే క్వారంటైన్ చేసి.. వారితో సంబంధం ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని కాంగో ప్రభుత్వానికి సూచించింది.

## ధాన్యం కొనుగోళ్లు ఎందుకు జరగడంలేదు?

లేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. "ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చడం లేదు. సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదు. ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారు. ప్రభుత్వమే వారికి సమాధానం చెప్పాలి. మంత్రులు జిల్లాలకు వెళ్లి, ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలి" అని కిషన్‌రెడ్డి మీడియా సమావేశంలో అన్నారు.

## తెలంగాణలో ఎప్‌సెట్ ఫలితాలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో ఎప్‌సెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, జేఎన్‌టీయూ వీసీ టి.కిషన్ కుమార్ రెడ్డితో కలిసి విడుదల చేశారు. గతేడాది కంటే ఇంజినీరింగ్‌లో ఈసారి 0.1 శాతం ఉత్తీర్ణత పెరిగిందని అధికారులు తెలిపారు. కాగా వారం రోజుల్లో కౌన్సెలింగ్‌కి షెడ్యూల్ ప్రకటిస్తామని జేఎన్‌టీయూ అధికారులు వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగంలో 1,97,241 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1,44,704 మంది మంది విద్యార్థులు అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 84,954 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే, 73,294 మంది అర్హత సాధించారు.పరీక్ష పూర్తయిన ఆరో రోజే ఫలితాలు విడుదల : ఎప్‌సెట్ పరీక్ష పూర్తయిన ఆరో రోజే ఫలితాలు వెలువడటం విశేషం. ఇంజినీరింగ్‌లో టాప్–10 ర్యాంకర్ల వివరాల్ని విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ యోగితా రాణా వివరించారు. ఫలితాల లాగిన్ విండోలో అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి ర్యాంక్ కార్డును సులభంగా డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అగ్రికల్చర్, ఫార్మాలో టాపర్స్‌గా నిలిచిన వారి వివరాల్ని సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగంలో 3వ, 4వ ర్యాంకులో నిలిచిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు.

# ప్రపంచానికి ట్రంప్ మరో షాక్

- రష్యా చమురుపై మినహాయింపు తొలగించిన అమెరికా అధ్యక్షుడు
- ఈ నిర్ణయంతో భారత్‌లో మరోసారి పెట్రో ధరలు పెరిగే అవకాశం

న్యూఢిల్లీ:ఇప్పటికే చమురు ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న ప్రపంచానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో షాకిచ్చారు. ఇటీవల రష్యా చమురు కొనుగోలుపై విధించిన మినహాయింపును రద్దు చేశారు. ఇరాన్ యుద్ధం, హార్ముజ్ మూసివేత నేపథ్యంలో ఇండియా సహా వివిధ దేశాలకు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు ట్రంప్ తాత్కాలికంగా అనుమతించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ మినహాయింపుపై విధించిన గడువు పూర్తైంది. అంటే, రష్యా చమురు కొనుగోలుపై ఆంక్షలు అమలవుతాయి. ఈ మినహాయింపును పొడిగించేందుకు ట్రంప్ సర్కార్ నిరాకరించింది. ఈ నిర్ణయం వల్ల అందరికంటే ఎక్కువగా ఇబ్బంది పడే దేశం ఇండియానే. ఎందుకంటే రష్యా నుంచి ఇండియా ఎక్కువగా చమురు కొనుగోలు చేస్తుంది. అందులోనూ హార్ముజ్ జలసంధి నుంచి చమురు రవాణా భారీగా తగ్గిపోవడం, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరిగిపోయిన పరిస్థితుల్లో ఇండియాకు రష్యా చమురు ఎంతగానో ఉపయోగపడింది. కొద్ది రోజులుగా భారీ స్థాయిలో రష్యా చమురును ఇండియా దిగుమతి చేసుకుంది. గత మార్చిలో 4.5 మిలియన్ బ్యారెళ్ల క్రూడాయిల్‌ను ఇండియా కొనుగోలు చేయగా, ఇందులో సగానికిపైగా చమురు రష్యా నుంచే దిగుమతి చేసుకుంది. ఇదే సమయంలో యుద్ధం జరుగుతున్న మిడిల్ ఈస్ట్ నుంచి చమురు దిగుమతి ఇదే సమయంలో యుద్ధం జరుగుతున్న మిడిల్ ఈస్ట్ నుంచి చమురు దిగుమతి 61 శాతం తగ్గింది.గత ఏప్రిల్‌లో ఇండియాకు రష్యా అత్యధిక చమురు అందించింది. రోజుకు 1.57 మిలియన్ బ్యారెళ్ల చమురును ఇండియా దిగుమతి చేసుకుంది. ఇప్పుడు రష్యా నుంచి చమురు కొనుగోలును అమెరికా నిషేధించిన నేపథ్యంలో.. ఇండియా ఆ చమురును కొనకపోతే దేశంలో మరింత సంక్షోభం తప్పదు. ఇటీవలి కాలంలో వరుసగా పెట్రో ధరలు పెరుగుతున్న సంగతి తెలిసిందే. అలాంటిది రష్యా చమురు ఆగిపోతే పెట్రో బాదుడు భారీగా ఉండబోతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## నేడు కొలువుదీరనున్న సతీశన్ సర్కారు

కాంగ్రెస్ నుంచి 12 మంది, ఐయూఎంఎల్ నుంచి ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు.అయితే, భాగస్వామ్యపక్షాలతో ఇవాళ జరిగిన



చర్చల్లో కేబినెట్ కూర్పుపై స్పష్టత వచ్చినట్లు కానున్న ముఖ్యమంత్రి సతీశన్ తెలిపారు. పార్టీ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితలా, మురళీధరన్, సన్నీ జోసెఫ్‌లు కేబినెట్‌లో చేరనున్నట్లు చెప్పారు. యూడీఎఫ్?లో కీలక భాగస్వామి అయిన ఐయూఎంఎల్‌కు 5 పోర్టుపోలియోలు దక్కాయి. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షుడు సాదిక్ అలీ, వీడీ సతీశన్ కేబినెట్‌లో చేరనున్న ఐదుగురి పేర్లను ప్రకటించారు. సీనియర్ శాసనసభ్యుడు తిరువంచూర్ రాధాకృష్ణన్‌ను అసెంబ్లీ స్పీకర్‌గా, షానిమోల్ ఉస్మాన్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించాలని కూడా యూడీఎఫ్ నిర్ణయించింది.ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ సహా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు హాజరుకానున్నారు. వీరితో పాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ హాజరయ్యే అవకాశం ఉంది.

## భారత్‌కు చేరిన మరో ఎల్పీజీ నౌక 'సైమి'

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో దేశంలో ఇంధన సరఫరాపై ఆందోళన నెలకొంది. ఈ తరుణంలో ఎల్పీజీని తీసుకొస్తున్న మరో భారత నౌక 'సైమి' హర్మూజ్‌ను దాటి సురక్షితంగా భారత్‌కు చేరింది. ఆదివారం గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు చేరిన ఈ ట్యాంకర్‌లో సుమారు 20,000 టన్నుల ఎల్పీజీ గ్యాస్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఖతార్‌లోని రాస్ లఫాన్ టెర్మినల్ నుంచి బయల్దేరిన ఈ క్యారియర్.. మే 13న హర్మూజ్‌ను దాటింది. మరో నౌక 'సన్‌షైన్' గురువారం హర్మూజ్‌ను దాటిందని.. 46,427 టన్నుల ఎల్పీజీతో సోమవారం నాటికి న్యూ మంగళూరు పోర్టుకు చేరుకుంటుందని నౌకాయాన శాఖ వెల్లడించింది. ఈ రెండు నౌకల్లోని వంటగ్యాస్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందినదని అధికారులు తెలిపారు. హర్మూజ్‌పై ఆంక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జలసంధిని దాటిన భారత నౌకల సంఖ్య 13కు చేరింది. మరోవైపు భారత్‌కు ఇంధనం రవాణా చేస్తున్న మరో 12నౌకలు గల్ఫ్‌లోనే చిక్కుకుపోయాయని పేర్కొన్నారు.



# 11శతాబ్దం నాటి చోళ వారసత్వ సంపద తిరిగి భారత్‌కు

ఈ అసాధారణమైన రాగి ఫలకాలను జాగ్రత్తగా భద్రపరిచిన లైడెన్ విశ్వవిద్యాలయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత్–నెదర్లాండ్స్ మధ్య బలపడుతున్న వ్యూహాత్మక, సాంస్కృతిక సంబంధాలకు ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలిచింది.మరోవైపు వారసత్వ సంపదను తిరిగి పొందడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. "ప్రతి భారతీయుడికి ఇది ఒక ఆనందకరమైన క్షణం! 11వ శతాబ్దానికి చెందిన చోళుల రాగి ఫలకాలు నెదర్లాండ్స్ నుంచి భారతదేశానికి తిరిగి రానున్నాయి. ప్రధాన మంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేను పాల్గొన్నాను. చోళుల రాగి ఫలకాల్లో 21 పెద్ద ఫలకాలు, 3 చిన్న ఫలకాలు ఉన్నాయి. వీటిపై ఎక్కువగా ప్రపంచంలోని అత్యంత అందమైన భాషల్లో ఒకటైన తమిళంలోని రచనలు ఉన్నాయి. ఇవి రాజేంద్ర చోళుడు ఎ తన పూర్వీకులు తండ్రి, మొదటి రాజరాజ చక్రవర్తి చేసిన మౌఖిక వాగ్దానాన్ని అధికారికంగా నెరవేర్చడానికి సంబంధించినవి. అవి చోళుల గొప్పతనాన్ని కూడా చాటిచెబుతాయి. భారతదేశంలో చోళులు, వారి సంస్కృతి, సముద్రయాన పరాక్రమం పట్ల ఎంతో గర్వపడుతున్నాం" అని ప్రధాని మోదీ అన్నారు.ఇవి నెదర్లాండ్స్‌లో లైడెన్ ఫలకాలుగా, భారతదేశంలో అనైమంగళం రాగి ఫలకాలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాచీన శాసనాలను తిరిగి తీసుకురావాలని భారత్ 2012 నుంచి అవిశ్రాంతంగా ప్రయత్నిస్తోంది. సుమారు 30 కిలోగ్రాముల బరువున్న ఈ 21 రాగి ఫలకాలు, చోళ సామ్రాజ్య అధికారిక రాజముద్రను కలిగిన ఒక భారీ కంచు ఉంగరంతో ఉంది. ఇది భారత సరిహద్దుల వెలుపల ఆ రాజవంశానికి సంబంధించిన అత్యంత కీలకమైన ఆధారాల్లో ఒకటిగా నిలుస్తుంది. ఈ గ్రంథాలు సంస్కృతం, తమిళం రెండింటిలోనూ ఉన్నాయి. ఇతర దేశాలు దొంగిలించిన వారసత్వ సంపదను తిరిగి పొందే విషయంలో భారత్? ప్రపంచవ్యాప్తంగా సాధిస్తున్న విజయాలకి ఇది నిదర్శనంగా నిలిచింది. ఇదిలా ఉండగా భారత్, నెదర్లాండ్స్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయి. ఈ మేరకు ఆ దేశ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్ మధ్య చర్చల సందర్భంగా రక్షణ, కీలక ఖనిజాలు, ఇతర రంగాల్లో కలిపి ఇరు దేశాలు 17 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. చర్చల సందర్భంగా ఇరు దేశాల ప్రధానమంత్రులు పశ్చిమాసియాలో పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్లోబల్ ఎనర్జీ సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు ఆటంకాల వల్ల ఈ



ప్రాంతం సహా ప్రపంచంపై పడే తీవ్ర ప్రభావాలపై సమాలోచనలు జరిపారు. హర్మూజ్ జలసంధి నుంచి నౌకాయాన స్వేచ్ఛ, అంతర్జాతీయ వాణిజ్య ప్రవాహం కొనసాగాలని మోదీ, జెట్టెన్ పిలుపునిచ్చారు. ఎలాంటి నియంత్రణ చర్యలనైనా వ్యతిరేకించాలని, ఆ దిశగా జరుగుతున్న ప్రయత్నాలకు తమ మద్దతును కొనసాగించాలని ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. ఉక్రెయిన్‌లో తాజా పరిస్థితి, రష్యాతో కొనసాగుతున్న ఘర్షణ, ప్రాంతీయ భద్రతా పరిణామాల గురించి కూడా ఇరువురు నేతలు చర్చించారు. చర్చలు, దౌత్యం ద్వారా ఉక్రెయిన్‌లో శాశ్వతమైన శాంతిని సాధించే ప్రయత్నాలకు మద్దతు కొనసాగించాలని పేర్కొన్నారు. అటు నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో కలిసి ఆదివారం అఫ్స్లుయిట్‌డైక్ డ్యామ్‌ను ప్రధాని మోదీ సందర్శించారు.

# గురుకులాలు, వసతి గృహ పాఠశాలలకు నెలవారీ చెల్లింపుల విధానం

**ఇకపై ఇదే పద్ధతిన 'భవన అద్దె' 'డైట్', 'కాస్మెటిక్స్' నిధుల విడుదల**

**రూ. 221.24 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం**

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహ పాఠశాలల నిర్వహణకు ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ సంక్షేమం, విద్యా శాఖల పరిధిలోని నివాస విద్యాసంస్థలకు సంబంధించిన ఆహార వ్యయాలు (డైట్ చార్జీలు), కాస్మెటిక్స్ ఖర్చులు, భవన అద్దెలను ఇకపై ప్రతి నెలా సకాలంలో విడుదల చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సామాజికంగా వెనుకబడిన, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ అడుగు వేసింది.గతంలో ఈ నిధుల చెల్లింపుల్లో 8 నుంచి 9 నెలల వరకు ఆలస్యం కావడం వల్ల నివాస పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గౌరవ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందులో భాగంగా మొదట త్రైమాసిక (మూడు నెలలకోసారి) చెల్లింపుల విధానాన్ని తీసుకువచ్చి, ప్రస్తుతం దాన్ని నెలవారీ చెల్లింపుల విధానంగా మార్చారు. 2026–27 బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలోనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ కీలక మార్పును ప్రకటించడం గమనార్హం. ఈ నిర్ణయం వల్ల విద్యార్థులకు నిరంతరాయంగా పోషకాహారం అందడంతో పాటు హాస్టళ్ల సక్రమ నిర్వహణ, భవనాల అద్దెల చెల్లింపులు సాఫీగా సాగనున్నాయి. ఇది విద్యార్థుల విద్యా ఫలితాలను, పాఠశాలల వాతావరణాన్ని మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడుతుంది.

రూ. 221.24 కోట్ల నిధులు విడుదల

నెలవారీ చెల్లింపుల నిర్ణయంలో భాగంగా.. వివిధ సంక్షేమ, విద్యా శాఖల పరిధిలోని వసతి గృహ విద్యాసంస్థల ఆహార, కాస్మెటిక్స్ ఖర్చులు, భవన అద్దెల కోసం ప్రభుత్వం రూ.221.24 కోట్లను విడుదల చేసింది.ఈ నిధుల విడుదల ద్వారా వసతి గృహ పాఠశాలల్లోని విద్యార్థుల పోషణ, సంక్షేమం మరియు వసతి సదుపాయాలకు పూర్తి స్థాయిలో నిరంతర మద్దతు లభించనుంది."అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన నివాస సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సాధికారత సాధించడమే కాకుండా, వారిని సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం" అని స్పష్టం చేశారు.

# ముందుంది మండేకాలం

జారీ చేసింది. అధిక ఎండ తీవ్రతతో పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇవాళ 16 జిల్లాల్లో 41 నుంచి 44 మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో నెలకొన్న గాలి విచ్ఛిన్నతితో రాష్ట్రంలో ఇవాళ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రేపు వడగాలుల ప్రభావంతో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశంతో ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను జారీ చేశారు. రాష్ట్రంలో సోమవారం 41 నుంచి 44 మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ మేరకు కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్?, మేడ్చల్–మాల్కాజిగిరి, జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, నాగర్? కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు టోపీ లేదా టవల్‌ను తలకు కట్టుకోవాలి. ముక్కు, చెవుల ద్వారా వేడి గాలి లోపలికి వెళ్లకుండా ఉండే విధంగా కర్చీఫ్‌ను కట్టుకోవాలి. నూలు వస్త్రాలను ధరించాలి.గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాల రోగాలతో సతమతమవుతున్న వారు జాగ్రత్తలు పాటించడం మంచిది. రేకుల ఇండ్లలో నివాసం ఉంటున్న వారు, వేడి గాలులు నేరుగా ఇళ్లలోకి వచ్చేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రేకులపై గడ్డి లేదా జనపనార సంచులను వేసి వేడిని తగ్గించుకోవాలి. ఎండ తీవ్రతకు చెమటతో పాటు శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ అధికంగా పోతుంటాయి. ఫలితంగా అలసటతో పాటు అస్వస్థత కలుగుతుంది. అందువల్ల వీలైనంత ఎక్కువగా నీరు తీసుకోవాలి. కొబ్బరి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, నీరు తీసుకోడం ఉత్తమం. నిమ్మరసం ఉప్పు, చక్కెర కలిపి తాగొచ్చు. వడదెబ్బకు గురైనట్లయితే వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకువెళ్లి తల నుంచి కాళ్ల వరకు తడి గుడ్డతో పూర్తిగా తుడవాలి. పేషెంట్‌కు గాలి ఆడేవిధంగా చూడాలి. కొంత తేరుకున్న తర్వాత ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించి హాస్పిటల్‌కు తీసుకువెళ్లాలి.

# ఆదర్శానికి నిలువుటద్దం రఘుపాల్

- ఆయనొక విజ్ఞానగని..గొప్ప ఆచరణవాది
- సాహిత్యం, సామాజిక అంశాలపై అపారపట్టు
- రఘుపాల్ ప్రథమ వర్ధంతి సభలో వక్తలు
- రఘుపాల్‌పై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించిన సారంపల్లి మల్లారెడ్డి
- తొలి ప్రతిని అందుకున్న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు



హైదరాబాద్ (జనంసాక్షి) : జీవితాంతం నమ్మిన సిద్ధాంతాన్ని, విలువలను వీడని ఆదర్శనేత రఘుపాల్ అనీ, ఆయన ఆదర్శానికి నిలువుటద్దం అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రఘుపాల్ ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. రఘుపాల్‌పై సాంబరాజు యాదగిరి రాసిన పుస్తకాన్ని సీపీఐ(ఎం) సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి ఆవిష్కరించారు. తొలి ప్రతిని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులుకు అందజేశారు. ఈ సభలో బీవీ.రాఘవులు మాట్లాడుతూ..1990 దశకంలో ప్రభుత్వ రంగ సంస్థలు, ఉద్యోగులతో హైదరాబాద్ ముందుకెళ్తే..నేడు ఐటీరంగం హవా నడుస్తున్నదని చెప్పారు. ఆనాడు విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలో ఉంటే నేడు ప్రజలకు అందకుండా ప్రయివేటు ఆధిపత్యంలోకి వెళ్లిపోయాయని తెలిపారు. పారిశ్రామిక రంగం కంటే విద్యారంగం నేడు కార్పొరేట్లకు లాభసాటి రంగంగా మారిందనీ, పారిశ్రామిక రంగంలో ఏటా 20 శాతం లాభం ఉంటే విద్యారంగంలో 33 నుంచి 50 శాతం లాభాలు గడిస్తున్న పరిస్థితి ఉందని వివరించారు. ఒక డాక్టర్ తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందిస్తే గుర్తింపు దక్కట్లేదనీ, ఎవరెక్కువ టెస్టులు రాసి, ఎక్కువ మందులు రాసి రోగుల నుంచి ఎంత పెద్ద మొత్తంలో డబ్బులు గుంజితే అంతే మొత్తంలో డాక్టర్లకు పర్సెంటీలు ఇస్తున్న పరిస్థితి ఉందని చెప్పారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని ఫణంగా పెట్టిన గొప్ప నేత రఘుపాల్ అని కొనియాడారు. అనారోగ్యం ఇబ్బంది పెడుతున్నా సీపీఐ(ఎం) పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని గుర్తుచేసుకున్నారు. అన్ని అంశాలను ఆయన విస్తృంగా అధ్యయనం చేసేవారనీ, తను అనుభవాలను, పార్టీని ముందుకు ఎలా తీసుకెళ్లాలనే దానిపైనే జీవింత చరమాంకంలో కూడా తనను కలిసిన నేతలతో చర్చించేవారని తెలిపారు. రఘుపాల్ ఆశయబాటలో నేటి యువ తరం నడవాలని పిలుపుని చ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడు తూ.. విద్యార్థి సంఘం నేతగా ఉన్నప్పుడు ఆవేశంతో ఆయన దగ్గరకు వెళ్తే ఆలోచనా రూపంగా మార్చి పంపేవారని కొనియాడారు. సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. డబ్బులకంటే నైతిక విలువలను పాటించడం, సామాజిక సేవ చేయడమే ముఖ్యమని బతికిన వారిలో రఘుపాల్ ఒకరని కొనియాడారు. ఎస్వీకే ట్రస్టు కార్యదర్శి, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వినయ కుమార్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ అంశాలపై రఘుపాల్ అపార మైన పట్టు ఉండేదనీ, సాహిత్యం, సామాజిక అంశాలపై ఆయనతో విస్తృతంగా చర్చించే వాడినని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఐఫ్టో జాతీయ నాయకులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడు తూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో త్యాగాలు చేసిన గొప్ప కుటుంబం నుంచి రఘుపాల్ వచ్చారనీ, తన కుటుంబం మొత్తం కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని పాటించేలా, సమ సమాజం కోసం జరుగుతున్న పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించి, ఆచరణలో పెట్టిన మహనీయుడు రఘుపాల్ అని కొనియాడారు. ఐఫ్టో అఖిల భారత అధ్యక్షవర్గ సభ్యులు సుధాకర్ మాట్లాడుతూ..ఐఫ్టో ఉద్యమంలో ఆయనతో పదేండ్ల పాటు కలిసి పనిచేశానని గుర్తుచేశారు. నేడు దేశం మతోన్మాద శక్తుల్లోకి వెళ్లిపోతున్నదనీ, కమ్యూనిస్టులు ముక్కలు కావడం వల్లనే నేడు ఈ పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులు కలవాలని ఆకాంక్షించారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. మనుషులను ప్రేమించే ప్రేమమూర్తి రఘుపాల్ అని కొనియాడారు. తన ఆదర్శ వివాహం ఆయన చేతులమీదుగానే జరిగిందని గుర్తుచేసు కున్నారు. తాను రాసిన 'అవీ..ఇవీ' హాస్య కథల పుస్తకాన్ని రఘుపాల్‌కు అంకితం ఇచ్చారు. ఆయన మాదిరిగా నేటి కమ్యూనిస్టు యువ నేతల ఆదర్శ విలువలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పుస్తక రచయిత సాంబరాజు యాదగిరి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మోతుకూరి నరహరి, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఎం.శ్రీని వాస్, జనగామ జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, హైదరాబాద్ జిల్లా మాజీ కార్యదర్శి పీఎస్ఎన్. మూర్తి, తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నేత డీజీ నర్సింహారావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎమ్‌డీ అబ్బాస్, సిద్దిపేట కార్యదర్శి ఎ.మల్లారెడ్డి, రఘుపాల్ సతీమణి భారతి, కూతురు సుప్రియ, ఐఫ్టో రాష్ట్ర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, ఐఫ్టో నాయకులు తిప్పర్తి యాదయ్య, గురుబచన్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ వాక్ ఫర్ వాటర్ నిరసన

ప్రభుత్వ నిర్లక్ష్యంపై కార్తీక్ రెడ్డి ఆగ్రహం



రాజేంద్రనగర్, మే17 (జనంసాక్షి) : రాజేంద్రనగర్ పరిధిలోని గండిపేట్, నార్సింగ్, మణికొండ, పుప్పాలగూడ, బండ్లగూడ జాగీర్ ప్రాంతాల్లో తీవ్రమైన తాగునీటి సమస్యలపై భారాస పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ "వాక్ ఫర్ వాటర్" నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారాస ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి నేతృత్వంలో నెక్నాపూర్ బటర్ ఫ్లై చౌరస్తా వద్ద ఉన్న చింతచెట్టు నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర మణికొండ మర్రిచెట్టు వరకు కొనసాగింది. ర్యాలీలో వివిధ కాలనీలకు చెందిన ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నీటి సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "నీటి బిల్లులు రద్దు చేయాలి", "ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితిని నిలిపివేయాలి", "యథావిధిగా మంచినీటి సరఫరా పునరుద్ధరించాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఈ అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గజం భూమి లక్షల్లో పలుకుతున్నప్పటికీ ప్రజలు గుక్కెడు మంచినీటి కోసం బిందెలతో తిరగాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకర మన్నారు. ఆధునిక హైదరాబాద్‌గా పేరుగాంచిన ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్యలు కొనసాగడం పాలకుల అసమర్థతకు నిదర్శన మని విమర్శించారు. ప్రజలు ప్రతినెల నీటి బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ సరైన సరఫరా లేకపోవడం అన్యాయమని, ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులర్ వాటర్ సప్లై అందించాలని డిమాండ్ చేశారు. ట్యాంకర్ల ద్వారా తాత్కాలిక పరిష్కారాలకే పరిమితం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పెండింగ్ బిల్లులను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీతారాం దూళిపాల, మాల్యాద్రి నాయుడు, కుంభగల ధనరాజ్, బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి, మహమ్మద్ ఆరిఫ్, గుట్టమీద నరేందర్, శ్రీకాంత్, బొడ్డు శ్రీధర్, పట్లోళ్ల రూపా రెడ్డి, సుమనళిని తదితరులు పాల్గొన్నారు. భరోసా నాయకు లు, కార్యకర్తలు, మహిళా నాయకు లు, స్థానిక కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై నిరసనకు మద్దతు తెలిపారు.

## తెలంగాణ రక్షణ సేనలో చేరికలు



హైదరాబాద్ (జనంసాక్షి) : బోథ్, ఖైరతాబాద్, అంబర్ పేట్, నర్సాపూర్ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున చేరిన నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత కండువా కప్పి ఆహ్వానించారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆధ్వర్యంలో 200 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్ లో చేరారు. సీనియర్ నాయకుడు మతిన్ అధ్వర్యంలో అంబర్ పేట్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మహిళలు టీఆర్ఎస్ లో చేరారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి నర్సింహా తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్ లో చేరారు. నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు టీఆర్ఎస్ లో చేరారు. జూబ్లీహిల్స్ కు చెందిన నర్సింహా ఆధ్వర్యంలో 200 మంది యువకులు టీఆర్ఎస్ లో చేరారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో



పాలకుర్తి, మే 17(జనంసాక్షి) : సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండలంలోని ఈరవెన్ను గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈరవెన్నులో శాతాపురం, కోతులబాదు చౌరస్తాలో గంట పాటు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల నాయకుడు ఏదునూరి మదార్ రైతులను ఉద్దేశించి కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పోసి నెల రోజులు గడుస్తున్న కొనుగోలు చేయకపోవడంతో పాటు అటు ట్రాన్స్ఫార్మర్ల కొరత ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో రైతులు భయందోళనకు గురవుతున్నారని ఆన్నారు. గ్రామంలో తేమ, తరుగు పేరుతో బస్తాకు 3 కిలోల వరకు కోత విధిస్తున్నారని రైతులు విమర్శించారు. అయితే మిల్లుల యాజమానులు కొర్రీలు పెడుతున్నారని అన్నారు. వెంటనే రైతుల ఇబ్బందులు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగయ్య, మాజీ ఎంపీటీసీ కోడిశాల యాదగిరి, వర్రె యాదయ్య, అనుముల ఎల్లయ్య. సంజీవ, సంపత్, పొన్నాల దామోదర్, మహేందర్, దామర చంద్రయ్య, రాజయ్య, సుదాకర్ పాల్గొన్నారు.

## దేశ రైతాంగాన్ని మరోసారి మోసగించిన మోడీ ప్రభుత్వం

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి



నర్సంపేట మే 17 ( జనం సాక్షి) : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు కానీ మద్దతు ధర ప్రకటించిందని ఇది రైతులను మరోసారి మోసం చేయడమేనని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి అన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో సంఘ అధ్యక్షులు జక్కుల తిరుపతి అధ్యక్షతన జరిగిందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మామిడాల బిక్షపతి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు మేలు జరగదని దుక్కి దున్నినప్పటి నుండి పంట చేతికి వచ్చేవరకు రైతాంగం అనేక రకాల పెట్టుబడులు పెట్టిందని ఈ సంవత్సర కాలంలో ఎరువులు పురుగు మందులు ఇతర అన్ని రకాల పెట్టుబడులు మరింత పెరిగాయని వాటికి అనుగుణంగా మోడీ ప్రభుత్వం రైతులు పండించిన పంటకు ప్రకటించిన మద్దతు ధర ఏమాత్రం సరిపోదని తిరిగి మరింత మద్దతు ధర ప్రకటించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యవర్గ సమావేశంలో చేసిన తీర్మానాలను సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు ప్రకటించారు. ఒక క్వింటాలు వడ్లకు 3000 రూపాయలు మొక్కజొన్నకు 2800గా మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అలాగే రైతులకు గతంలో సబ్సిడీల తో కూడిన పరికరాలను పరికరాలకు ఎరువులు పురుగు మందులకు సబ్సిడీ అందజేసేవారని ఇప్పుడు క్రమక్రమంగా సబ్సిడీలు ఎత్తివేసారని తిరిగి కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మక్కలు వడ్లు సరైన సమయంలోనే కొనుగోలు చేస్తామని చెప్పి నెల దాటుతున్న రోడ్లపై రైతులు పండించిన పంటను ఆరబోసి కొనుగోలు కోసం ఎదురుచూస్తున్నారని, అవినీతికి పాల్పడుతున్న మిల్లర్లు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గట్టి కృష్ణ సహాయ కార్యదర్శి బొమ్మిడి సాంబయ్య, సభ్యులు ఐలయ్య, రమేష్, భద్రాజి కృష్ణ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

- నీట్ లీకులు, అవినీతి, అక్రమాలపై నైతిక బాధ్యత వహించాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి, ఎంపీ పి. సంతోష్ కుమార్
- 'నీట్ పేపర్ లీకులు- ప్రభుత్వ విద్యపై దాడి' అనే అంశంపై సదస్సు




న్యూఢిల్లీ (జనంసాక్షి) : నీట్ లీకులు, అవినీతి, అక్రమాలపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, ఎంపీ పి.సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ 2026 పేపర్ లీక్‌లు, పోటీ పరీక్షల అవ్యవస్థ, ప్రభుత్వ విద్యపై జరుగుతున్న దాడులపై అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ సమితిల సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం ఎస్వీ ఘాటే హాల్, అజయ్ భవన్, ఇంద్రజిత్ గుప్తా మార్గ్‌లో 'నీట్ పేపర్ లీకులు – ప్రభుత్వ విద్యపై దాడి' అనే అంశంపై సదస్సు నిర్వహించడం జరిగింది, ఈ సదస్సుకు రాజ్యసభ సభ్యులు, సీపీఐ జాతీయ కార్యదర్శి పి. సంతోష్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సదస్సు ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా, ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ రంగరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు, సీపీఐ జాతీయ కార్యదర్శి పి. సంతోష్ కుమార్. మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ ఘటన దేశ విద్యా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందనే విషయాన్ని బహిర్గతం చేసిందన్నారు. 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పోటీ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న లీకులు, అవినీతి, అక్రమాలపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడడంలో పూర్తిగా విఫలమైన కేంద్ర ప్రభుత్వం దేశ యువతకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. నీట్ విధానం పేద, గ్రామీణ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తోందని, కార్పొరేట్ కోచింగ్ మాఫియాలకు లాభాలు చేకూర్చే విధంగా వ్యవస్థ నడుస్తోందని ఆరోపించారు. అదే విధంగా జేఎన్‌యూ అసోసియేట్ ప్రొఫెసర్ అజయ్ గుడావర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్య రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుటిల ప్రయత్నంలో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానంను తీసుకువచ్చిందని విమర్శించారు. కార్పొరేట్ కోచింగ్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా విద్యా వ్యవస్థను మలుస్తున్నారని ఆరోపించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ అరుణ్ కుమార్, జీటీబీ హాస్పిటల్ అనేస్తేసియా డాక్టర్ శరవనన్ కుమార్, ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యులు హరీష్ బాలా, కల్లూరు ధర్మేంద్ర, నేర్లకంటి శ్రీకాంత్, యుగంధర్, సంతోష్, సాగర్, ధీరందర్, రాకేష్, చరణ్ జీత్ , ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు లక్ష్మణ్, మణికంఠ, నాసర్ జీ, వలరాజు, సాయి కుమార్ లతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

## పేదరికాన్ని రూపుమాపే శక్తివంతమైన ఆయుధమే విద్య

- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి
- విద్యారంగంలో ములుగు జిల్లాకు విశిష్ట గౌరవం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క



ములుగు ప్రతినిధి, మే 17(జనంసాక్షి) : సమాజంలోని పేదరికం రూపుమాపే అత్యంత శక్తివంతమైన ఆయుధం కేవలం విద్య మాత్రమేనని, అక్షరజ్ఞానం మనిషిని సమాజంలో ఉన్నతమైన వ్యక్తిగా నిలబెడుతుందని, ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో కార్పొరేట్ స్థాయికి మించిన నాణ్యమైన విద్య ప్రభుత్వం పాఠశాలలోని విద్యార్థులకు అందుబాటులో ఉందని, విద్యారంగంలో ఏజెన్సీ ములుగు జిల్లాకు ప్రత్యేకమైన విశిష్టత లభించిందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల చూపు ములుగు జిల్లా వైపే ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లివిద్య విజయోత్సవ దినోత్సవంలి కార్యక్రమం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్ర గేయాలాపనతో ప్రారంభించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు, తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ద్వారా ఒక్కొక్కరికి పదివేల రూపాయల నగదు ప్రోత్సాహం, పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మంత్రి అనసూయ సీతక్క లాప్ టాప్ లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా పాలన లక్ష్యాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటుగా, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ములుగు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా మొదటి స్థానంలో నిలవడం గర్వకారణంగా ఉందన్నారు. విద్యా రంగంలో ములుగు జిల్లా సాధిస్తున్న పురోగతిని మంత్రి కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, డిజిటల్ తరగతుల ఏర్పాటు, ప్రత్యేక ప్రణాళిక, ఉపాధ్యాయుల తల్లిదండ్రుల కృషి వల్ల మంచి ఫలితాలు వచ్చాయన్నారు.

ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ మాట్లాడుతూ మౌలిక వసతులు లేని ప్రాంతాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉద్దేశంతో రాష్ట్రంలో ఎక్కడా లేనటువంటి విధంగా ములుగు ఏజెన్సీ ప్రాంతంలో కంటైనర్ పాఠశాలలను ప్రారంభించి విద్యార్థులకు విద్యను అందించడం జరుగుతుందని స్థానిక మంత్రి సీతక్కకు విద్యపై అపారమైన శ్రద్ధ ఉందనడానికి మంచి నిదర్శనం అన్నారు. గత సంవత్సరం వచనం ఫలితాలలో ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ములుగు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఈ సంవత్సరం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని ఈ విజయాలను స్ఫూర్తిగా తీసుకొని మంత్రి సీతక్క ఆధ్వర్యంలో అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ ప్రథమ స్థానంలో నిలవాలని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా విద్యాశాఖ అధికారి గా బాధ్యతలు అప్పగించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పదవ తరగతి ఫలితాలలో ములుగు జిల్లా మొదటి స్థానంలో నిలవడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. రాబోయే రోజులలో ఈ విజయ స్ఫూర్తిని కొనసాగిస్తూ మరిన్ని మెరుగైన ఫలితాలు విజయాలు సాధించడానికి కృషి చేస్తూ క్షేత్రస్థాయిలో పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వీరేందర్, డిసిఇబి కార్యదర్శి ఈ సూర్యనారాయణ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు శ్యామ్ సుందర్ రెడ్డి, రజిత, అడల్ట్ ఎడ్యుకేషన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వేణుగోపాల్, టాస్ ఉల్లాస్ ములుగు జిల్లా కోఆర్డినేటర్ పీర్ల కృష్ణ బాబు, మండల విద్యాశాఖ అధికారులు వజ్జా తిరుపతి, కొయ్యడ మల్లయ్య, సాంబశివరావు, అవార్డు పొందిన విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు విద్యాభిమానులు పాల్గొన్నారు.




## తెప్పోత్సవాలకు హంస వాహనం

కాళేశ్వరం, మే 18 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సరస్వతి అంత్య పుష్కరాలలో నిర్వహించే తెప్పోత్సవంలో భాగంగా స్వామి వారి హంస వాహనం కాకినాడ లో తయారు అవుతుందని ఆలయ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు కాళేశ్వరం చేరుకొనున్నట్లు వారు తెలిపారు. అంత్య పుష్కరాల సందర్భంగా తెప్పోత్సవాల్లో ఈ హంస వాహనాన్ని ఉపయోగించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

## జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- నక్కలగుట్ట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



హనుమకొండ, ప్రతినిధి మే 17 (జనం సాక్షి) :జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు జీడబ్ల్యూఎంసీ ఇంచార్జ్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి అధికారులకు సూచించారు. ఆదివారం కలెక్టర్ ఖాజీపేట పరిధిలోని నక్కలగుట్ట, వరంగల్‌లోని కాశిబుగ్గ జీడబ్ల్యూఎంసీ సర్కిల్ కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి జనగణన వివరాల సేకరణ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో నమోదవుతున్న వివరాలు, డేటా ఎంట్రీ పురోగతి, సిబ్బంది పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉప కమిషనర్లు డీసీ బీర్రు శ్రీనివాస్, ప్రసన్నరాణి ఆర్ ఓ లు, ఆర్ ఐలు, టెక్నీకల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# 'నీట్' లీక్ కుంభకోణం జాతీయ సంక్షోభం

**పరీక్ష లీకైంది.. నమ్మకం కూలిపోయింది**

**వ్యవస్థా వైఫల్యం, విద్యార్థుల బలిదానం..**

**జవాబుదారీతనం లేని పాలనపై ఒక విశ్లేషణ**

**"కలలు కన్న చేయి పరీక్షా హాల్‌లో కాదు - అవినీతి చీకటిలో కూలిపోయింది"**

సంపాదకీయం

భారతదేశంలో వైద్య విద్యకు ప్రధాన ప్రవేశద్వారమైన నీట్ పరీక్ష, నేడు అనేక అనుమానాలు, అవినీతి ఆరోపణలు, వ్యవస్థాపరమైన లోపాలకు కేంద్రబిందువుగా మారింది. లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తును ఒకే పరీక్షపై ఆధారపడి నిర్మించుకునే సమయంలో, ప్రశ్నాపత్ర లీక్ ఆరోపణలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించాయి. ఇది కేవలం ఒక పరీక్షా లోపం కాదు యువత నమ్మకాన్ని దెబ్బతీసిన సంఘటన.

2014 నుండి 2024 వరకు దేశవ్యాప్తంగా వివిధ పోటీ పరీక్షల్లో పలు పేపర్ లీక్ ఘటనలు నమోదయ్యాయి. 2024లో జరిగిన నీట్-యూజీ వివాదం దేశ రాజకీయ, విద్యా రంగాలను కుదిపేసింది. బిహార్, గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో అనుమానాస్పద కార్యకలాపాలపై దర్యాప్తు కొనసాగుతోంది. అదే సమయంలో యూజీసీ-ఎన్ఈటీ రద్దు, ఇతర నియామక పరీక్షల వివాదాలు పరీక్షా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయి. నీట్ వంటి అత్యంత పోటీ పరీక్షల ఒత్తిడి కారణంగా విద్యార్థుల్లో మానసిక ఆందోళనలు, ఆత్మహత్యల ఘటనలు పెరుగుతున్నాయని పలు నివేదికలు సూచిస్తున్నాయి. ప్రతి ఘటన వెనుక ఒక కుటుంబం ఆశలు, ఒక విద్యార్థి కలలు ఉన్నాయి. 1987లో ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి ప్రశ్నాపత్రం లీక్ ఘటన వెలుగులోకి వచ్చినప్పుడు, అప్పటి విద్యాశాఖ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు... స్వచ్ఛందంగా మంత్రి పదవికి రాజీనామా చేసి రాజకీయ నైతికతకు ఉదాహరణగా నిలిచారు. నేడు, కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే వివాదాలు వచ్చినప్పటికీ, బాధ్యత స్వీకరణపై ప్రశ్నలు కొనసాగుతున్నాయి. "దర్యాప్తు జరుగుతోంది" అనే సమాధానం సరిపోతుందా? లేక ప్రజాస్వామ్యంలో నైతిక జవాబుదారీతనం ఇంకా అవసరమా? అనే చర్చ బలపడుతోంది.

**సీబీఐ దర్యాప్తు, అరెస్టులు వంటి చర్యలు అవసరమే. కానీ అవి నష్టం జరిగిన తర్వాతి చర్యలు మాత్రమే. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా వ్యవస్థను ఎలా బలోపేతం చేయాలి? అన్నది అసలు ప్రశ్న. ప్రశ్నాపత్ర భద్రతలో లోపాలు, పరీక్షా సంస్థల పారదర్శకతపై సందేహాలు, కోచింగ్ మాఫియా ప్రభావం, రాజకీయ , అధికార రక్షణ ఆరోపణలు, ఇవన్నీ సమగ్ర సంస్కరణల అవసరాన్ని సూచిస్తున్నాయి. ప్రతి విద్యార్థి ఆత్మహత్య వెనుక ఒక కుటుంబం ఆవేదన ఉంది. తీవ్రమైన పోటీ, అసమాన అవకాశాలు, పరీక్షా వ్యవస్థపై నమ్మకం కోల్పోవడం ఇవన్నీ కలిపి యువతపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. విద్యా వ్యవస్థ కేవలం ర్యాంకులు కాదు; అది విద్యార్థుల జీవితం, గౌరవం, మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడాలి.**

ఎన్‌టీఏపై అనుమానాలు తొలగాలంటే స్వతంత్ర నియంత్రణ సంస్థ, నిరంతర బాహ్య ఆడిట్ జరగాలి. పేపర్ లీకేజీకి తావులేకుండా బ్లాక్ చైన్ ఆధారిత భద్రత, వికేంద్రీకృత పేపర్ సెట్టింగ్ అవశ్యం. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ కఠినంగా అమలు చేయాలి. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా మానసిక ఆరోగ్య సహాయ కేంద్రాలు అందుబాటులోకి తేవాలి. ఎలాంటి రాజకీయ ప్రలోభాలకు లోనుకాకుండా వీటన్నింటినీ పారదర్శకంగా నిర్వహించగలగాలి. 'విద్య వ్యాపారం కాదు. పరీక్ష యుద్ధభూమి కాదు. విద్యార్థులు బలిపశువులు కారు. వ్యవస్థ మారాలి. లేదా దాన్ని మార్చే తరం ఎదగాలి' ఈ సంక్షోభం కేవలం నీట్ గురించేం కాదు. ఇది భారతదేశ విద్యా వ్యవస్థపై యువత ఉంచిన నమ్మకానికి సంబంధించినది. ఆ నమ్మకాన్ని తిరిగి గెలుచుకోవడం ఇప్పుడు ప్రభుత్వాల, సంస్థల, సమాజం ముందున్న అతిపెద్ద బాధ్యత.

# అధికార ఉన్మాదానికి బలవుతున్న బాల్యం





భూపతి వెంకటేశ్వర్లు
సాంస్కృతిక రంగ రచయిత
94900098343

అధికారం అనేది ప్రజల ప్రాణాలను, గౌరవాన్ని కాపాడే ఒక కవచం, కానీ.. నేడు ఆ అధికారమే అబలల మానప్రాణాలను హరించే ఆయుధంగా మారుతోంది. తెలంగాణ గడ్డపై ఒక కేంద్ర మంత్రి కుమారుడు బండి భగీరథ్, మైనర్ బాలికపై సాగించిన లైంగిక దాడి ఉదంతం కేవలం ఒక నేరపూరిత చర్య మాత్రమే కాదు.. అది వ్యవస్థీకృత అధికార దురహంకారానికి పరాకాష్ట. చట్టం తన గుప్పిట్లో ఉందని, తండ్రి అధికారం తనకు అభయారణ్యమని భావించే ఒక యువకుడి ఉన్మాదం నేడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశమైంది.

సాధారణంగా నేరం జరిగినప్పుడు నేరస్థుడు చట్టానికి భయపడతాడు. కానీ, ప్రస్తుత రాజకీయ వాతావరణంలో నేరస్థులు చట్టాన్ని చూసి నవ్వుతున్నారు. బండి భగీరథ్ విషయంలో బాధితులు గట్టిగా నిలబడబట్టే పోక్సో (ూజుూూ) కేసు నమోదైంది. లేదంటే, అధికార యంత్రాంగం దీనిని ఒక చిన్న గొడవగానో లేదా పరస్పర అంగీకారంగానో చిత్రీకరించి కాలగర్భంలో కలిపేసేది అనడంలో సందేహం లేదు. "మేం ఏం చేసినా కేంద్రంలో మా పార్టీ ఉంది" అనే ధీమా ఆ యువకుడి ప్రవర్తనలో కనిపిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి ఆలోచన కాదు, అధికార పక్ష నేతల్లో వేళ్లూనుకున్న ఒక ప్రమాదకరమైన ధోరణి.

కేంద్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసే 'బేటీ బచావో - బేటీ పఢావో' నినాదం క్షేత్రస్థాయిలో ఎంత అపహాస్యానికి గురవుతుందో చెప్పడానికి బీజేపీ నేతల చరిత్రే సాక్ష్యం. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (చీజ=దీ) గణాంకాలు పరిశీలిస్తే, గత పదేళ్లలో దేశంలో మహిళలు, మైనర్లపై జరుగుతున్న దాడుల్లో అధికార పక్ష నేతల ప్రమేయం పెరగడం ఆందోళనకరం. ఉత్తరప్రదేశ్ సోన్ భద్ర ఎమ్మెల్యే రామ్ దులార్ గోండ్ (2014) నుంచి మొదలుకొని, ఉన్నావ్ గ్యాంగ్ రేప్ నిందితుడు కుల్దీప్ సింగ్ సెంగార్ (2018) వరకు.. అందరూ అధికార గర్వంతో విర్రవీగినవారే. 2022లో త్రిపుర మంత్రి భగవాన్ దాస్ కుమారుడు, 2024లో కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నం, తాజాగా ఉత్తరాఖండ్‌లో తల్లి ముందే బాలికపై జరిగిన అత్యాచారంలో బీజేపీ జిల్లా నేత నిందితుడిగా ఉండటం చూస్తుంటే.. వీరికి ఆడబిడ్డల పట్ల ఉన్న గౌరవం ఏపాటిదో అర్థమవుతోంది.

దేశభక్తిని ఓట్ల కోసం వాడుకునే శక్తులు, ఒక మైనర్ బాలికపై అరాచకం జరుగుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నాయి? శ్రీరాముడి జపం చేస్తూనే, తెర వెనుక రాక్షస క్రీడలు సాగించడం ఏ రకమైన దేశభక్తి? అధికార బలంతో గల్లీ నేతలు కూడా ఢిల్లీ స్థాయి చక్రవర్తులుగా ఫీలవుతూ, సామాన్యుల జీవితాలతో ఆడుకుంటున్నారు. బండి సంజయ్ తన కొడుకు గురించి మాట్లాడుతూ, "నేను పట్టించుకోకపోవడం వల్లే అలా తయారయ్యాడు" అని సంజాయిషీ ఇచ్చుకోవడం హాస్యాస్పదం. తన సొంత బిడ్డనే సంస్కారవంతుడిగా పెంచలేని వ్యక్తి, ప్రజా ప్రతినిధిగా సమాజానికి ఏమి సందేశం ఇస్తారు? నిత్యం పరుష పదజాలంతో ప్రత్యర్థులపై విరుచుకుపడే సంజయ్, తన ఇంట్లోనే పెరుగుతున్న ఈ ఉన్మాదాన్ని ఎందుకు అరికట్టలేకపోయారు? ఈ మొత్తం ఉదంతంలో కొన్ని మీడియా సంస్థల పాత్ర అత్యంత విచారకరం. బాధితురాలికి అండగా నిలవాల్సిన మీడియా, ఆ మైనర్ బాలికనే 'హనీ ట్రాప్' చేసిందంటూ కథనాలు అల్లడం జర్నలిజానికే మాయని మచ్చ. నేరస్థుడి తండ్రికి ఉన్న రాజకీయ పలుకుబడిని చూసి, బాధితురాలిని దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసం? ఇది కేవలం వార్తలను తప్పుదోవ పట్టించడమే కాదు, రేపటి రోజున ఏ బాధితులూ పోలీసు మెట్లెక్కకుండా భయపెట్టడమే. తెలంగాణ సమాజం చైతన్యానికి నిలయం. ఇక్కడ ఎవరి అహంకారం చెల్లదు. సినిమాల్లో విలన్ల కొడుకులు చేసే అకృత్యాలు నేడు మన కళ్ల ముందే వాస్తవ రూపం దాల్చడం మన రాష్ట్రానికే తలవంపు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి, నేరస్థుడికి కఠిన శిక్ష పడేలా చూడాలి. తన కుమారుడు చేసిన ఈ దారుణానికి నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలి. అప్పుడే బాధితురాలికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలుగుతుంది.

మనుస్మృతి మార్గంలో నడుస్తూ, మహిళలను భోగవస్తువులుగా చూసే ఆలోచనా విధానమే ఇన్ని అత్యాచారాలకు మూలం. సైన్స్‌ను, సమసమాజాన్ని నమ్మే మనం ఇలాంటి ఉన్మాద శక్తులను ఎదిరించక తప్పదు. మన ఆడబిడ్డల భద్రత కోసం, తెలంగాణ ఆత్మగౌరవం కోసం ప్రతి పౌరుడు గొంతు విప్పాలి. అధికారం అంటే సేవ చేయడం తప్ప, అది అరాచకాలకు లైసెన్స్ కాదని నిరూపించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

# భారత రాజకీయాల్లో పెరుగుతున్న వృథా ఖర్చులు

నిన్నటి సంచిక తరువాయి

భారతదేశ రాజకీయ వ్యవస్థలో పెరుగుతున్న వృథా ఖర్చులు ప్రస్తుతం దేశ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్న అంశాలలో ఒకటిగా మారాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ నేడు అనేక ప్రాంతాల్లో రాజకీయ నాయకుల జీవనశైలి సామాన్య ప్రజలకు దూరమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా భారీ వాహన దళాలు, విలాసవంతమైన కార్యాలయాలు, అధిక భద్రతా ఏర్పాట్లు, ప్రత్యేక విమాన ప్రయాణాలు ప్రభుత్వ ఖర్చులను గణనీయంగా పెంచుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశలో దేశ నాయకులు ఎంతో నిరాడంబరంగా జీవించారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కూడా అనేక సందర్భాల్లో సాధారణ ప్రజలతో కలిసిమెలిసి ప్రయాణించిన సందర్భాలు చరిత్రలో నమోదయ్యాయి. ఆ కాలంలో ప్రజా ధనం పవిత్రమైనదిగా భావించే రాజకీయ సంస్కృతి బలంగా ఉండేది.

1960-1975 కాలంలో రాష్ట్ర మంత్రుల ప్రయాణాలకు నెలకు నిర్దిష్ట ఇంధన పరిమితి ఉండేది. ప్రభుత్వ వాహనాలను కుటుంబ సభ్యులు వినియోగించకుండా కఠిన నిబంధనలు అమలులో ఉండేవి. ఒక మంత్రికి సాధారణంగా ఒక కారు, ఒక డ్రైవర్ మాత్రమే ఉండేవారు. భద్రతా సిబ్బంది కూడా పరిమిత సంఖ్యలో ఉండేవారు. అయితే 1980ల తర్వాత రాజకీయాల్లో వ్యక్తిగత ప్రతిష్ట, అధికార ప్రదర్శన, ఆధిపత్య భావనలు పెరుగుతూ వచ్చాయి. 1995 తర్వాత అనేక రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల వాహన దళాలు 20 నుండి 40 వాహనాలకు పెరిగినట్లు పలు నివేదికలు తెలియజేశాయి. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి పర్యటనకు ముందు వందలాది పోలీసు సిబ్బందిని మోహరించడం సాధారణ విషయంగా మారింది.

దేశంలో పెరుగుతున్న ప్రజా అప్పుల పరిస్థితిని పరిశీలిస్తే రాజకీయ వృథా ఖర్చుల నియంత్రణ అత్యవసర అవసరంగా కనిపిస్తోంది. 2025 నాటికి భారతదేశ మొత్తం ప్రభుత్వ అప్పులు సుమారు రూ. 205 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఆర్థిక విశ్లేషణలు తెలియజేస్తున్నాయి. అనేక రాష్ట్రాలు తమ వార్షిక ఆదాయంలో 25% కంటే ఎక్కువ మొత్తాన్ని అప్పుల వడ్డీలకే చెల్లిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమయంలో ప్రజాప్రతినిధుల విలాసవంతమైన ఖర్చులు ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, ప్రభుత్వ పాఠశాలలు, వైద్య సేవలు, రహదారులు వంటి ప్రాథమిక అవసరాలకు సరిపడ నిధులు లేకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

రాజకీయ నాయకుల భద్రత పేరుతో జరిగే ఖర్చులు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా అత్యున్నత భద్రత కలిగిన నాయకుల కోసం వేలాది మంది భద్రతా సిబ్బంది నియమించబడుతున్నారు. ఒక్కో అత్యున్నత భద్రత కలిగిన నాయకుడిపై సంవత్సరానికి కోట్ల రూపాయల వరకు ఖర్చు అవుతోందని పలు అంచనాలు సూచిస్తున్నాయి. భద్రత అవసరమైన అంశమే అయినప్పటికీ అనవసర ప్రదర్శన ప్రజల్లో వ్యతిరేక భావనలను పెంచుతోంది. కొన్ని సందర్భాల్లో రహదారులను పూర్తిగా మూసివేయడం వల్ల అంబులెన్సులు కూడా నిలిచిపోయిన సంఘటనలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల సౌకర్యం కంటే నాయకుల ప్రదర్శనకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి కొన్నిచోట్ల కనిపిస్తోంది. అయినప్పటికీ రాజకీయ నాయకుల కోసం కొత్త వాహనాలు కొనుగోలు చేయడం, విలాసవంతమైన అతిథి గృహాలు నిర్మించడం, ప్రత్యేక విమానాలు అద్దెకు తీసుకోవడం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. 2023--2025 మధ్యకాలంలో కొన్ని రాష్ట్రాలు మంత్రుల వాహనాల కొనుగోలుకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు పలు నివేదికలు వెల్లడించాయి. ఇదే సమయంలో రైతుల రుణ మాఫీ, విద్యార్థుల వసతి గృహాలు, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేకపోవడం విరుద్ధ పరిస్థితిని సూచిస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులు ప్రజల ధనాన్ని జాగ్రత్తగా వినియోగించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. ప్రభుత్వ ధనం అనేది ప్రజలు చెల్లించే పన్నుల ద్వారా సమకూరుతుంది. ఒక సాధారణ ఉద్యోగి, రైతు, కార్మికుడు చెల్లించే పన్నుల ద్వారా ప్రభుత్వ ఖజానా నిండి ఉంటుంది. అలాంటి ధనాన్ని అనవసర విలాసాలకు వినియోగించడం సామాజిక న్యాయానికి విరుద్ధంగా భావించబడుతుంది. ముఖ్యంగా పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో రాజకీయ దుబారా ఖర్చులు ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలుమార్లు ప్రజాప్రతినిధులు ఖర్చులను తగ్గించుకోవాలని సూచించిన విషయం ప్రాధాన్యత సంతరించుకుంది. పరిమిత వాహన వినియోగం, సరళ జీవన విధానం, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం కొనసాగించడం వంటి అంశాలు ప్రజాస్వామ్యానికి బలాన్ని ఇస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా యువత రాజకీయాల్లో నైతిక విలువలను ఆశిస్తోంది. పారదర్శకత, బాధ్యత, సరళ జీవనం వంటి అంశాలను పాటించే నాయకులపట్ల ప్రజల్లో గౌరవం పెరుగుతోంది.


రాజకీయ వృథా ఖర్చులను నియంత్రించడానికి కఠిన విధానాలు అవసరమనే అభిప్రాయం బలపడుతోంది. మంత్రుల వాహన దళాలకు పరిమితి విధించడం, ప్రభుత్వ వాహనాల వినియోగంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం, అధికారిక ఖర్చుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రభుత్వ ధన వినియోగంపై సామాజిక తనిఖీ వ్యవస్థ బలోపేతం కావాలి. ప్రజల ముందు జవాబుదారీతనం పెరిగినప్పుడే రాజకీయ వ్యవస్థలో మార్పు సాధ్యమవుతుంది.

ముగింపుగా పరిశీలిస్తే భారతదేశ రాజకీయ వ్యవస్థలో ఒకప్పుడు కనిపించిన నిరాడంబరత ప్రస్తుతం తగ్గిపోవడం ప్రజాస్వామ్యానికి ఆందోళనకర పరిణామంగా మారింది. ప్రజాసేవ అనే మహత్తర భావన స్థానంలో అధికార ప్రదర్శన పెరుగుతున్న పరిస్థితి సమాజానికి మంచిది కాదు. రాజకీయ నాయకులు తిరిగి సరళ జీవన విధానాన్ని అనుసరించి ప్రజా ధనాన్ని జాగ్రత్తగా వినియోగించినప్పుడే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ప్రభుత్వ ఖర్చులను తగ్గించి ఆ నిధులను విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలకు మళ్లించడం ద్వారా సమాజ పురోగతి సాధ్యమవుతుంది. ప్రజాస్వామ్యంలో నాయకుడు ప్రజల సేవకుడనే భావన బలపడినప్పుడే నిజమైన ప్రజా పాలన స్థిరపడుతుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# 36 ప్రజా సంఘాల చారిత్రక ప్రస్థానం




తెలంగాణ మలిదశ ఉద్యమ చరిత్రలో 1996 నుండి 2001 మధ్య కాలం ఒక చారిత్రాత్మక మైలురాయి. ఆనాడు ఏ ప్రధాన రాజకీయ పార్టీ కూడా ప్రత్యేక రాష్ట్రం గురించి మాట్లాడటానికి సిద్ధంగా లేనప్పు డు, ఉద్యమ నిప్పును పల్లె పల్లెనా సజీవంగా ఉంచినవి ప్రజా సంఘాలే. వార్తది పత్రిక సంపాదకులు కె. రామచంద్ర మూర్తి ప్రచురించిన వ్యాసాలు, ప్రోత్సాహకరంగా వార్తల కవరేజీ. జర్నలి స్టులు, ప్రజా గాయకులు, మేధావులు, కవులు, విద్యావంతులు, విప్లవకారులు మరియు వివిధ కుల వృత్తుల శ్రేణులు స్వచ్ఛందంగా ఏకమై సుమారు 36 ప్రజా సంఘాలుగా అవతరించాయి. అయితే, ఈ ఐదేళ్ల ప్రస్థానం కేవలం ఒక పోరాటం మాత్రమే కాదు; అది అట్టడుగు బహుజన శ్రేణుల మేధోమథనానికి, కేంద్రీకృత నాయక త్వం లేకపోవడం వల్ల జరిగిన అంతర్గత విచ్ఛిన్నానికి, మరియు చివరకు రాజకీయ చదరంగంలో జరిగిన ఒక పెద్ద బహుజన విషాదానికి సజీవ సాక్ష్యం. పాశం యాదగిరి ఖైరతాబాద్ బడే గణేశ్ వాడను డి వెలువరించిన వర్తమానం దిన పత్రిక ముఖ్యమంత్రి చంద్రబాబు ఇనుప బూట్ల కింద నిలిగిన చరిత్ర ఒక సజీవ సాక్ష్యం.

### 36 ప్రజా సంఘాల ఆవిర్భావం, తొలి జేపీసీ రూపకల్పన

రాజకీయ శూన్యతను భర్తీ చేస్తూ ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల మేధావులు, దళిత బహుజన సంఘాలు వీధుల్లో కి వచ్చాయి. తెలంగాణ సమాచార ట్రస్ట్ (1996), తెలంగాణ ఐక్య వేదిక (1997), తెలంగాణ జనసభ (1998), తెలంగాణ మహాసభ మరియు సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (1999) వంటి బలమైన సంస్థలు ఈ కాలంలోనే రూపుదిద్దుకున్నాయి. గాదె ఇన్నయ్య, వీరమల్ల ప్రకాష్, నంది నిర్మల, ప్రొఫెసర్ కేశవరావు జాదవ్, పాశం యాదగిరి , బి ఎస్ రాములు , యం కోదండరాం, ఆచార్య కె. జయశంకర్, బియ్యాల జనార్ధనరావు, డాక్టర్ కొల్లూరి చిరంజీవి, యండి అరిఫుద్దీన్ జూలూరి గౌరీ శంకర్, అనిశెట్టి రజిత, ననుమాస స్వామి, వంటి సిద్ధాంతకర్తలు ఈ 36 సంఘాల పరస్పర సమన్వయం కోసం ఒక ఉమ్మడి వేదికను నిర్మించారు. ఇదే మలిదశ ఉద్యమ చరిత్రలో మైలురాయి. పునాది రాయి. సిద్ధాంత భూమిక. ప్రజా ఉద్యమాల వేదిక.

తొలి జాయింట్ యాక్షన్ కమిటీ. ఈ వేదిక నుండే "సామ్రాజ్యవాద వలస పాలన నశించాలి - సామాజిక న్యాయ తెలంగాణ రావాలి!" అనే పిలుపు ఊరూరా ప్రతిధ్వనించింది.

### విప్లవ ముద్ర - ప్రజా పోరాటాల శక్తులు

ఈ ఐదేళ్ల కాలంలో తెలంగాణ వాదానికి అత్యంత పదునైన, రాజీలేని గుణాన్ని అద్దింది విప్లవ పార్టీలు, వాటి అనుబంధ ప్రజా సంఘాలే. పీపుల్స్ వార్, జనశక్తి వంటి విప్లవోద్యమాల నుండి వచ్చిన మేధావులు, నాయకులు అట్టడుగు వర్గాలను కదిలించారు.

**మారోజు వీరన్న (తెలంగాణ మహాసభ):** సాయుధ పోరాట గమనాన్ని మార్చి, "కుల నిర్మూలన - సామాజిక తెలంగాణ" అనే నినాదంతో బహుజన రాజ్య కాంక్షను రగిల్చిన చారిత్రక యోధుడు. ఆయన ఎన్ కౌంటర్ బహుజన శ్రేణులను కుదిపేసింది.

జనశక్తి రాజన్న: సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకం గా పల్లెల్లో శ్రమజీవుల ఐక్యతను చాటిన విప్లవ గొంతుక.

**గద్దర్ - ఆకుల భూమయ్య:** ప్రజా కోర్టులలో గద్దర్ పాటలు, ఆకుల భూమయ్య గారి హక్కుల పోరాటాలు అణచివేతపై నిరంతర తూటాలై దూసుకెళ్లాయి. వీరితో పాటు వైకుంఠం, లోకేందర్ రెడ్డి వంటి కవులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో తిరిగి ప్రజలను చైతన్యపరిచారు.

### ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - జలదృశ్యం వేదిక

తెలంగాణ ఉద్యమ పితామహుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గారి పాత్ర ఈ దశలో అత్యంత కీలకమైనది. హుస్సేన్‌సాగర్ ఒడ్డున ఉన్న ఆయన నివాసం "జలదృశ్యం" ఆనాడు 36 ప్రజా సంఘాల సిద్ధాంత చర్చలకు, మేధోమథన సదస్సులకు ప్రధాన నిలయంగా నిలిచింది. ఆ తర్వాత టిఆర్ఎస్ (ం=హా) పార్టీ ఆవిర్భావానికి కూడా బాపూజీ గారు తన జలదృశ్యం వేదికనే ఆశ్రయమిచ్చి, ఉద్యమాన్ని రాజకీయ మలుపు తిప్పడంలో చారిత్రక పాత్ర పోషించారు.

### బహుజన తాత్విక ఘర్షణ -దళిత ముఖ్యమంత్రి నినాద విజయం

ఈ పునాది దశలోనే, తెలంగాణ ఐక్యవేదిక, బహుజన శ్రమల శ్రేణు ల తరపున బి.ఎస్. రాములు నాయకత్వంలో ఒక చారిత్రాత్మక సిద్ధాంత చర్చ జరిగింది. "బహుజనులే ఉద్యమానికి, రేపటి ప్రభు త్వానికి నాయకులుగా ఉండాలి. కుల సమస్యను, స్త్రీవాద సమస్యల ను ఉద్యమ అజెండాలో చేర్చాలి" అని బి.ఎస్. రాములు గట్టిగా పట్టుబట్టారు.

**జయశంకర్‌తో చర్చ:** ఈ ప్రతిపాదనపై ప్రొఫెసర్ జయశంకర్ సార్ మొదట కొంత తటపటాయించి, "తెలంగాణ వచ్చాక ఇవన్నీ చూద్దాం" అన్నారు.

**అంబేద్కర్ స్ఫూర్తి - చారిత్రక హెచ్చరిక:** దీనిని బి.ఎస్. రాములు గారు చారిత్రక ఆధారాలతో తిప్పికొట్టారు. "బాబాసాహెబ్ అంబేద్క ర్ జాతీయ ఉద్యమ కాలంలోనే బ్రిటిష్ వారితో గట్టిగా పోరాడి డిమాండ్ చేయడం వల్లే పూనా ఒప్పందం ద్వారా చట్టసభల్లో రిజర్వే షన్లు వచ్చాయి. కానీ, బీసీలు గాంధీ మాట నమ్మి 'స్వాతంత్ర్య ం వచ్చాక చూసుకుందాం' అనడం వల్లే ఇప్పటికీ రాజ్యాధికారానికి దూరంగా ఉండిపోయారు. కనుక, ఉద్యమ కాలంలోనే కలిసి నడవ డానికి స్పష్టమైన సామాజిక హామీలు సాధించుకోవాలి" అని వాదిం చారు. ఈ బలమైన తర్కానికి జయశంకర్ సరే అనక తప్పలేదు.

**నినాద విజయం:** ఈ బహుజన మేధోమథనం నుండి పుట్టినదే "దళిత బిడ్డే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి!" అనే చారిత్రాత్మక నినాదం. బి.ఎస్. రాములు గారి సిద్ధాంతం విజయమైన ఈ నినాదం సృష్టించిన బహుజన చైతన్య ఒత్తిడి వల్లే.. ఆ తర్వాతి కాలంలో కేసీఆర్ సైతం "దళితుడే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి అవుతాడు" అని పదే పదే ప్రకటించాల్సి వచ్చింది. అందుకు మల్లేపల్లి లక్ష్మయ్య వంటి వారి కృషి కూడా తోడయ్యింది.

### సిద్ధాంత చర్చల మేధో సైన్యం

ఈ కాలంలో తెలంగాణ అస్తిత్వ భావజాల వ్యాప్తిని పత్రికలు, పుస్తకాలు మరియు విశ్వవిద్యాలయాల సదస్సుల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన మేధావుల సైన్యం ఇది:

మల్లేపల్లి లక్ష్మయ్య: సీనియర్ జర్నలిస్ట్‌గా, విశ్లేషకుడిగా సమైక్య పాలకుల బడ్జెట్ వివక్షను గణాంకాలతో ఎండగట్టి, మేధావులను ఏకం చేసిన కో-కన్వీనర్. రాపోలు ఆనంద భాస్కర్: చేనేత కార్మికుల (పద్మశాలీల) ఆకలి చావులను, వారి ఆర్థిక దైన్యాన్ని తెలంగాణ ఉద్యమ ప్రధాన డిమాండ్లలో ఒకటిగా చేర్చి, వృత్తి సంఘాల ఐక్యతకు కారకుడైన నేత.

**విశ్వవిద్యాలయాల మేధో బలం:** చరిత్రను డాక్యుమెంట్ చేసిన ప్రొఫెసర్ ఐ. తిరుమలి, దళిత బహుజన హక్కుల సిద్ధాంతకర్త ప్రొఫెసర్ మురళీ మనోహర్, మరియు ప్రెస్ అకాడమీ, మీడియా రంగాల ద్వారా వలస మీడియా కుట్రలను తిప్పికొట్టిన మేధావి ప్రొ. పి.ఎల్. విశ్వేశ్వర రావుల పాత్ర అనన్య సామాన్యం.

మహిళా మరియు ప్రజాస్వామ్య స్వరాలు: ప్రజాస్వామ్య హక్కుల వేదికలలో బలంగా నిలిచిన ఎం. రత్నమాల, నంది నిర్మల అట్టడుగు శ్రేణుల గొంతుకగా నిలిచిన అనిశెట్టి రజిత లాంటి మేధావులు బలాన్ని ఇచ్చారు. వెలిచాల సోదరులు విద్యావంతుల వేదిక: వెలిచాల కొండల్ రావు, వెలిచాల జగపతి రావుల రాజకీయ గర్జన, మరియు ప్రొఫెసర్ ఎం. కోదండరాం గారి ఆధ్వర్యంలో నడిచిన "తెలంగాణ విద్యావంతుల వేదిక" ప్రతి కాలేజీని ఒక ఉద్యమ కేంద్రంగా మార్చాయి.

### కేంద్రీకృత నాయకత్వ లోపం- బహుజన శ్రేణుల అంతర్గత విషాదం

1996-2001 మధ్య కాలంలో బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల విద్యావంతులకు మేధో బలం పుష్కలంగా ఉన్నప్పటికీ, వారి దగ్గర ఆర్థిక వ్యవస్థ లేదు, సామాజిక గౌరవమూ తక్కువ. దీనివల్ల వారు అనేక వివక్షలను ఎదుర్కొన్నారు. దానికి తోడు, ఈ బహుజన శ్రేణుల్లో అత్యధికులు దీర్ఘకాలంగా విప్లవోద్యమ భావజాలంలో మునిగితేలడం వల్ల.. ఒకరినొకరు నాయకత్వంగా అంగీకరించలేని తీవ్రమైన అంతర్గత సంఘర్షణ నెలకొంది. కేంద్రీకృతమైన ఒక బలమైన నాయకత్వం లేకపోవడం ఈ కాలపు ఉద్యమ లోపంగా మారింది. ఫలితంగా, అంతటి మేధో సంపత్తి ఉండి కూడా 2001 దాకా వీరంతా విడివిడి గ్రూపులుగానే మిగిలిపోయారు.


7. రాజకీయ చాకచక్యం -- అజెండా మార్పిడి - బహుజన నాయకత్వాల పతనం

2001లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి (ం=హా) తో రంగంలోకి దిగడంతో కథ పూర్తిగా మారిపోయింది. రాజకీయ నాయకత్వం అత్యంత చాకచక్యంగా ఒక వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది.

ఏకైక నినాదం వ్యూహం: "బహుజనుల తెలంగాణ, సామాజిక తెలంగాణ, ప్రజాస్వామిక తెలంగాణ.. మొదలైనవన్నీ తెలంగాణ వచ్చాకే చూసుకుందాం, ఇప్పుడు కేవలం తెలంగాణ సాధన అనే ఏకైక నినాదం మాత్రమే ఉండాలి" అని ప్రచారం చేశారు.

నినాదాల అణచివేత: దీనివల్ల 1996 నాటి 36 ప్రజా సంఘాలు రగిల్చిన బహుజన రాజ్య కాంక్ష, సామాజిక న్యాయ అజెండాలు వెనకబడిపోయాయి. పేద వర్గాల ఆకాంక్షలైన "ప్రతి జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కులు, స్థానిక ఖాళీల భర్తీ", 610 జీవో అమలు, "మా భాష మాండలికం కాదు మాది స్వతంత్ర తెలంగాణ భాష" అనే అస్తిత్వ నినాదాల స్థానంలో.. ధనిక రైతాంగానికి ఉపయోగపడే "భారీ ప్రాజెక్టులు, ఉచిత కరెంటు" నినాదాలు ముందుకు వచ్చాయి. ఫలితంగా, ఆనాటి బహుజన ప్రజాతంత్ర నాయకత్వాలు పూర్తిగా దెబ్బతిని, ఆనాటి స్థాయి కన్నా పూర్తిగా వెనకబడిపోయాయి.

1996-2001 మధ్య సాగిన 36 ప్రజా సంఘాల ప్రస్థానం తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన మాట వాస్తవమే అయినా, కేంద్రీకృత నాయకత్వ లోపం , రాజకీయ శక్తుల చాకచక్యం వల్ల అది బహుజన విషాదంగా మిగిలిపోయింది. పీపుల్స్ వార్ శ్రేణులు, మారోజు వీరన్న, జనశక్తి రాజన్నల విప్లవ త్యాగాలు, కొండా లక్ష్మణ్ బాపూజీ గారి జలదృశ్యం వేదిక స్ఫూర్తి, బి.ఎస్. రాములు గారు ప్రతిపాదించిన బహుజన నాయకత్వం , "దళిత ముఖ్యమంత్రి" నినాదం ఉద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గవి. కానీ, నినాదాల వెనుక జరిగిన అజెండా మార్పిడిని గ్రహించలేక పోవడం వల్లే ఆనాటి బహుజన చైతన్యం రాజకీయంగా ఓడిపోయి, కేవలం వనరుల ఆధారిత ధనిక రైతు వర్గ నాయకత్వానికి దారి ఇచ్చింది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

గ్రంథాలయాలు.. ప్రపంచాన్ని చదవాలనుకునే వారి పాలిట స్వర్గధా మాలు.. విద్య ఖరీదైన ఈ రోజుల్లో విజ్ఞానం కోసం ఒక్క పుస్తకం కొనాలన్నా వందలాది రూపాయలు వెచ్చించాల్సిన దుస్థితి. కానీ ఈ గ్రంథా ఆలయంలో అడుగిడితే అన్నీ ఉచితం.. పుస్తక సంపద అపారం. ఒకప్పుడు సమస్యలతో కునారిల్లే కేంద్రాలు నేడు ఆధునిక సొబగులు సంతరించుకున్నాయి. ఆహ్లాదకర వాతావరణంతో కళకళలాడుతూ పిల్లలతో పాటు నిరుద్యోగులనూ ఒక్కసారి అడుగిడాలని ఆహ్వానిస్తున్నాయి.

చిరిగిన చొక్కా అయినా వేసుకో.. కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో.. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం.. పుస్త కం జీవితాన్ని మారుస్తున్నది. ఈ మాటలు మన పెద్దలు చెప్పిన మూటలు. పుస్తక పఠనానికి ఉన్నంత ప్రాధాన్యత మరేదేనికి లేదంటారు. అలాంటి పుస్తకపఠనానికి మార్గం సుగమం చేసేవి గ్రంథాలయాలు. వీటిని విజ్ఞాన కేంద్రాలుగా కూడా పిలుస్తుంటారు. ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తారు. గ్రంథాలయాల ప్రయోజనాలపై 'జనంసాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.



# ఆధునిక సొబగులు ఆశ్రయిస్తే అజేయులు



## పుస్తక పఠనంలో ఉన్న తృప్తి ఏఐ సెర్చింగ్‌లో లేదు

- నిరుద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న గ్రంథాలయాలు
- విలువైన పుస్తక సంపదతో అమితమైన విజ్ఞానం
- మరింత ప్రోత్సహిస్తే భావితరాలకు భరోసా

### అందుబాటులో పుస్తకాలు

| క్రమం | లైబ్రరీ / స్థలం | తెలుగు | ఇంగ్లీష్ | ఉర్దూ | హిందీ | ఇతరాలు | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| 1 | డీసీఎల్ సంగారెడ్డి | 17,992 | 9,225 | 3,230 | 7,172 | 8 | 37,627 |
| 2 | బి.ఎల్. సదాశివపేట | 12,806 | 2,628 | 589 | 871 | - | 16,894 |
| 3 | పుల్కల్ | 5,417 | 882 | 56 | 172 | - | 6,527 |
| 4 | జోగిపేట | 15,487 | 3,467 | 993 | 952 | - | 20,899 |
| 5 | కొండాపూర్ | 5,383 | 1,042 | 165 | 101 | - | 6,691 |
| 6 | మనూర్ | 6,514 | 1,541 | 223 | 478 | - | 8,756 |
| 7 | మునిపల్లి | 6,201 | 1,103 | 107 | 291 | - | 7,702 |
| 8 | ఝరాసంగం | 5,870 | 1,134 | 50 | 182 | - | 7,236 |
| 9 | రామచంద్రపురం | 15,215 | 2,769 | 438 | 806 | - | 19,228 |
| 10 | రాయికోడు | 6,782 | 1,445 | 253 | 700 | - | 9,180 |
| 11 | కోహీర్ | 9,744 | 1,775 | 1,193 | 718 | 78 | 13,508 |
| 12 | నారాయణఖేడ్ | 1,207 | 2,648 | 691 | 1,039 | 194 | 5,779 |
| 13 | కల్హేర్ | 6,594 | 1,422 | 202 | 463 | - | 8,681 |
| 14 | జిన్నారం | 6,202 | 1,301 | 143 | 144 | - | 7,790 |
| 15 | జహీరాబాద్ | 11,112 | 2,582 | 677 | 1,120 | - | 15,491 |
| 16 | హత్నూర్ | 7,424 | 1,600 | 129 | 173 | - | 9,326 |
| 17 | న్యాల్కల్ | 6,330 | 1,623 | 232 | 290 | - | 8,475 |
| 18 | కంగ్టి | 6,419 | 1,536 | 200 | 240 | - | 8,395 |
| 19 | పటాన్చెరు | 14,020 | 2,395 | 395 | 877 | - | 17,687 |
| 20 | ఇస్మాయిల్ ఖాన్ పేట | 8,772 | 1,112 | 267 | 278 | - | 10,429 |
| జిల్లావ్యాప్తంగా | | 1,86,591 | 43,377 | 10,183 | 17,067 | 303 | 2,57,521 |

**విలువైన పుస్తకాల కొలువు**
గ్రంథాలయాల్లో విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు, ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పుస్తకాలు, గ్రంథాలు, మ్యాగజైన్లు సమకూర్చారు. ప్రస్తుత వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకునేలా లైబ్రేరియన్ విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన సబ్జెక్టు పుస్తకాలు విజ్ఞాన, వినోదానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

**బాల్యం నుంచే పుస్తక పఠనం**
పఠనం జీవితానికి నాణ్యతను జోడిస్తుంది. బాల్యం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకొంటే అదో మేధా కార్యకలాపంగా రూపొందుతుంది. భాష, సాహిత్యం, సాంస్కృతిక చైతన్యం పరిమళించడానికి దారులు చూపే గ్రంథాలయాలు -భావితరాలకు చరిత్రను అందించే వేదికలుగా నిలుస్తాయి. గ్రంథాలు లేదా రాతలు పురాతన కాలంలో రాళ్లపై కనిపించే వి. కాలక్రమేణా తాళపత్రాలు, రాగి రేకులు, చర్మాలు, కాగితాలు, తెరలమీదకు రూపాంతరం చెందాయి. మూఢాచారాలను పారదోలి ప్రజల్లో చైతన్యం నింపడానికి ఒకప్పుడు గ్రంథాలయ ఉద్యమాలు నడిచాయి. అవే భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలకు సమాచారం చేరవేయడానికి, ఉద్యమ స్ఫూర్తిని రగిలించడానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. మహాత్మాగాంధీతో పాటు అనేక మంది జాతీయ నాయకులు, రచయితలు రాసిన వ్యాసాలు, గ్రంథాలు నాడు దేశవ్యాప్తంగా గ్రంథాలయ ఉద్యమాల ద్వారానే ప్రజలకు చేరి, చైతన్యపరచేవి. తరవాతి కాలంలో ప్రజా గ్రంథాలయాల ప్రాధాన్యం మందగించింది. విద్యాలయాల్లో గ్రంథాలయాలు ఎంతో ప్రయోజనకరంగా కొనసాగుతున్నాయి.

**ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దే నిలాయాలు**
విజ్ఞానాన్ని పంచే భండాగారాలు గ్రంథాలయాలు.. ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దే సరస్వతీ నిలాయాలు.ఇక్కడ విజ్ఞానాన్ని పెంపొందింపజేసుకుని ఉన్నత శిఖరాలకు చేరిన వారెందరో ఉన్నారు. కంప్యూటర్ యుగంలో కూడా పుస్తక పఠనంపై యువత మొగ్గ చూపుతున్నారు.



**పుస్తకం విలువ ఎనలేనిది :**
**గ్రంథాలయ చైర్మన్ అంజయ్య**



సమాచార రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చినా పుస్తకం విలువ ఎనలేనిది. నేటి యువత, బాలబాలికలు, మహిళలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి. చైర్మన్‌గా తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. అన్నివర్గాల వారికి పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా కృషి చేశాం. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాలలో అన్ని వర్గాల వారికి ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచాం.

**ప్రజలకు మరింత చేరువయ్యేలా :**
**గ్రంథాలయ కార్యదర్శి వసుంధర**



మునుపెన్నడూ లేనివిధంగా గ్రంథాలయాల్లో వారోత్సవాలను నిర్వహించాం. ప్రస్తుత యువత ఇంటర్నెట్, ఫేస్బుక్, సెల్‌ఫోన్ ఎన్ని ఉన్నా చాలామంది గ్రంథాలయాల వైపై మొగ్గ చూపుతున్నారు. మనదైనా సంస్కృతిని, విజ్ఞాన సంపదను అందించే గ్రంథాలయాలను విస్మరించకూడదు. సాంకేతికను అవసరార్థం వాడుకోవాలి కానీ, అదే జీవితంగా అనుభవించాలను కోవడం సరికాదు. నిత్యం పత్రికల్లో వచ్చే సమ కాలీన ప్రపంచ విషయాలను, మంచి పుస్తకాల్లోనిఅంశాలను చదవడానికి గ్రంథాలయాలబాట పట్టాలి.

ఇంటర్నెట్ అందు బాటులోకి వచ్చిన తరువాత ఏ విషయమైన నెట్లో సెర్చ్ చేస్తే సులువుగా దొరుకుతున్నది. కానీ పుస్తక పఠనంలో ఉన్న తృప్తి కంప్యూటర్ సెర్చింగ్ లో లేదని గ్రంథాలయ పాఠకులు అంటున్నారు. పాఠకులు... సాంకేతిక ఎంత పెరిగినా.. ఎన్ని కంప్యూటర్లు వచ్చినా గ్రంథాలయ ప్రత్యేకత కాదనలేదనిదని అభిప్రాయపడుతున్నారు.

**సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 20 లైబ్రరీలు**
సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 20 లైబ్రరీలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో సెంట్రల్ లైబ్రరీ , సదాశివపేట, పటాన్చెరు, రామచంద్రపురం, మునిపల్లి, జిన్నారం, పుల్కల్, జోగిపేట్, కొండాపూర్, కోహిర్, రాయికోడ్, నారాయణఖేడ్, ఇస్మాయిల్ ఖాన్ పెట్, కల్హేర్, మనూర్, హత్నూర, న్యాలల్‌లో గ్రంథాలయాలు కొనసాగుతున్నాయి.

## ఎప్‌సెట్-2026లో శ్రీ చైతన్య ర్యాంకుల ప్రభంజనం

- పి. స్ఫూర్తిశ్రీ 1338వ ర్యాంకు సాధించిన విద్యార్థులు
- పది వేల ర్యాంకుల్లోపు 30 మంది రాణించారు

**కరీంనగర్ బ్యూరో, మే 17 (జనంసాక్షి):** ఆదివారం విడుదలైన ఎప్‌సెట్-2026 ఫలితాల్లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ, మా కళాశాల విద్యార్థులు ఈఏపసెట్ ఫలితాల్లో పి. స్ఫూర్తిశ్రీ 1338, ఇ. అఖిల 1390, యస్. భార్గవి 1512, షేక్ హుస్సేన్ జాఫర్ 2589, యస్. హారిక 2592, యస్. రవి 3323, మహేశ్వరి 3455, ఎ. సుహాస్యా రెడ్డి 3548, యం. సాయి సాత్విక్ 3806, బి. సాయి అఖిల్ 4325, బి. విఘ్నేష్ వర్ధన్ 4824, పి. హసిని రావు 5600 ర్యాంకులు సాధించారని వెల్లడించారు. పది వేల ర్యాంకుల్లోపు మొత్తం 30 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు.
ఎప్‌సెట్-2026లో రాష్ట్ర స్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించిన శ్రీ చైతన్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులను చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి అభినందించారు. ఈ విజయ సాధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్‌మోహన్ రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎజియం శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.



## రెసోనెన్స్ విద్యార్థుల అద్భుత ప్రతిభ

**టీజీ ఈఏపీసీఈటీ 2026 ఇంజినీరింగ్ విభాగంలో మొదటి ర్యాంకు**

**హైదరాబాద్, మే 17 (జనంసాక్షి):** రెసోనెన్స్ జూనియర్ కళాశాలల విద్యార్థులు తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ ఈఏపీసీఈటీ) 2026లో అద్భుత ఫలితాలు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో ఎం రుషి రాష్ట్ర మొదటి ర్యాంక్, వెటర్నరీ, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో అటిపాముల భార్గవ రాష్ట్ర 41వ ర్యాంక్ సాధించారు. అన్ని విభాగాలలో అద్భుత ప్రతిభ ప్రదర్శించారు. మాదాపూర్ సిద్ధి వినాయక నగర్ లో ఉన్న నాగ్-శేష్ కన్వెన్షన్ లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్ర మొదటి ర్యాంక్ విద్యార్థిని ఎం రుషి కి రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ (తెలంగాణ & ఆంధ్రప్రదేశ్) డైరెక్టర్ పూర్ణచంద్రరావు చేతుల మీదుగా రూ. 3 లక్షల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణ చంద్రరావు నర్రా మాట్లాడుతూ ఈ పరీక్షలో విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాలతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఫలితాలు విద్యార్థుల కృషి, అధ్యాపకుల నిరంతర శ్రమ, తల్లిదండ్రులు మాపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమన్నారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## కళ్లలో కారం చల్లి.. తల్లి, కూతుర్ని హతమార్చిన దుండగులు

**నల్లగొండ జిల్లాలో సంచలనం... భూ తగాదాల కోణంలో పోలీసుల దర్యాప్తు**

**హాలియా, మే 17 జనం సాక్షి:** నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపేట గ్రామంలో ఆదివారం దారుణ ఘటన చోటుచేసుకుంది. తల్లి, కూతురిని గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత క్రూరంగా హత్య చేశారు. గ్రామానికి చెందిన రుద్రాక్షి సుమలత (45), ఆమె కూతురు లావణ్య (20) తమ ఆయిల్ పామ్ తోటలో పనులు చేసుకుంటుండగా దుండగులు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ముందుగా వారి కళ్లలో కారం చల్లి, అనంతరం గొంతు నులిమి హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఘటనతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.
ఈ హత్యలకు భూ తగాదాలే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యుల మధ్య కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. నిందితులను గుర్తించేందుకు డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజుహాలియా సిఐ సతీష్ రెడ్డి ఎస్ఐ సాయి ప్రశాంత్ ఘటనాస్థలాన్ని పరిశీలించి, కుటుంబ విభేదాల కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

## వివక్ష వీడితేనే హెచ్ఐవికి విముక్తి

- రోగాన్ని ద్వేషించండి, రోగిని కాదు : జిల్లా క్లినికల్ అధికారి రమేష్.
- హెచ్ఐవికి ఉచిత మందులు, నాణ్యమైన వైద్యం : డాక్టర్. సమియుల్లా.
- 40 ఏళ్ల ఎయిడ్స్ పోరుకు గుర్తుగా తాండూరులో కొవ్వొత్తుల ర్యాలీ.
- తాండూరు ఏఆర్‌టి కేంద్రంలో ఉచిత వైద్యం సద్వినియోగం చేసుకోండి.




**తాండూరు, మే 17(జనంసాక్షి) :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం తాండూరు జిల్లా ఆసుపత్రిలో అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్‌లైట్ మెమోరియల్ డే ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా క్లినికల్ సేవల అధికారి రమేష్ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా హెచ్ఐవి/ఎయిడ్స్‌తో పాటు సమాజంలోని వివక్ష, చిన్నచూపు కారణంగా అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వారిని స్మరించుకుంటూ ప్రతి ఏటా మే మూడవ ఆదివారం ప్రపంచవ్యాప్తంగా క్యాండిల్‌లైట్ మెమోరియల్ డే నిర్వహిస్తారని, అందులో భాగంగానే తాండూరులో కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. లక్షలాది క్షేత్రస్థాయి సిబ్బంది కృషితో ప్రస్తుతం హెచ్ఐవి నియంత్రణలో ఉందని, భవిష్యత్తులో ఎవరూ హెచ్ఐవి బారిన పడకుండా అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. నాణ్యమైన వైద్య సేవలతో మరణాలను అరికట్టవచ్చని, వివక్ష తొలగినప్పుడే హెచ్ఐవిని అంతం చేయగలమని పేర్కొన్నారు. రోగాన్ని మాత్రమే ద్వేషించాలి, రోగిని కాదని ప్రజలకు పిలుపునిచ్చారు.ఏఆర్‌టి నోడల్ ఆఫీసర్ డా. సమియుల్లా మాట్లాడుతూ హెచ్ఐవి సోకిన వారికి ప్రస్తుతం నాణ్యమైన మందులు అందుబాటులో ఉన్నాయని, వాటిని క్రమం తప్పకుండా వాడటం ద్వారా సాధారణ జీవితం గడపవచ్చని తెలిపారు. తాండూరు ఏఆర్‌టి కేంద్రంలో పూర్తి ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాబోవు రోజుల్లో మరింత సమర్థంగా పనిచేస్తే హెచ్ఐవిని పూర్తిగా నియంత్రించ వచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్లు పర్వతాలు, రత్నాకర్, అశోక్ రెడ్డి, డిఎస్ఆర్‌సి కౌన్సెలర్ కుమార్, ఏఆర్‌టి సిబ్బంది, సంపూర్ణ, దివ్యదిశ, వైఆర్‌జి కేర్ ఎన్‌జిఓల సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు

- రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నం : కాంగ్రెస్ నాయకులు ఫైర్
- భూమి, చెరువుల అభివృద్ధిని చూసి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ విమర్శలు



**మల్యాల, మే 17 (జనంసాక్షి):** ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్న రవిశంకర్, కొండగట్టు అభివృద్ధి, చెరువుల పూడిక తీసే పనులపై అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని సర్పంచ్ దారం ఆదిరెడ్డి ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ మండలస్థాయి విలేకరుల సమావేశంలో విమర్శించారు. గత 10 సంవత్సరాల్లో కొండగట్టు అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా నిధులు తేవలేని రవిశంకర్, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేకపోతున్నారని ఆరోపించారు. మిషన్ కాకతీయ పేరుతో చెరువు మట్టిని అమ్ముకున్న వారు గత ఐదేళ్లలో ఏ పనికి కమిషన్ తీసుకోలేదని ప్రజల ముందు జవాబు చెప్పాలని ఆదిరెడ్డి డిమాండ్ చేశారు. కొండగట్టు అంజన్న సాక్షిగా ప్రమాణం చేసిన రవిశంకర్ కనీసం కొండగట్టు వైపు కూడా చూడలేదని విమర్శించారు. కోట్ల రూపాయలతో ఇంటి నిర్మాణం చేపట్టినా మేస్త్రీకి డబ్బులు ఇవ్వలేక కుటుంబం ఆత్మహత్య చేసుకున్న సంఘటనను గుర్తు చేశారు.
మల్యాల మండలంలో జగ్గని ఒర్రె పనిని 2 కోట్ల 46 లక్షలతో త్వరగా ప్రారంభించినందుకు ఓర్వలేక రవిశంకర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం గురించి మరోసారి చెడుగా మాట్లాడితే ఖబర్దార్ అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చెవుల మద్ది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంగ ఆనంద్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, ముత్యాల రామలింగారెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శనిగరపు తిరుపతి మరియు వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## వేముకుంట ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**శేరిలింగంపల్లి, మే 17 (జనంసాక్షి) :** చందానగర్ డివిజన్ పరిధి వేముకుంటలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. కొండవీటి సునీత ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి తెలంగాణ రాష్ట్ర టూరిజం అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జైపాల్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఔత్సాహికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆసక్తి కలిగిన రాజకీయ నేతలు ఎవరైనా సరే సమాజ హితం కోసం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. చందానగర్ పరిధి వేముకుంటలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పరిసర ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సేవలను వినియోగించుకోవడం జరిగిందని, ఇది అనేక సామాజిక కార్యక్రమాలకు, సేవా కార్యక్రమాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆహార నియమాలు, నాణ్యత లోపించిన పదార్థాల వల్ల మనుషులకు అనేక రకాల రుగ్మతలు అంటుకుంటున్నాయని, ప్రధానంగా మధుమేహం, ఊబకాయం, హృద్రోగం, రక్తపోటు, మెదడు సంబంధ వ్యాధులు సులువుగా వ్యాప్తి చెందుతూ అనారోగ్యకర సమాజాన్ని పెంపొందిస్తుండడం ఆందోళన కలిగించే విషయం అన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం, నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు, తాజా కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పోషకాహారాలతో కూడిన పదార్థాలను తరచుగా తీసుకోవడం ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించుకొని మెరుగైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలని వారు ప్రజలకు సూచించారు.
ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ డైరెక్టర్ జుబేరా బేగం, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం. రఘునందన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు నార్ని శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ రవీంద్రరావు, టీపీసీసీ లేబర్ సెల్ వైస్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, నాయకులు, మైనార్టీ విభాగం, యువజన విభాగం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
18 మే 2026

# విద్యార్థులు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు నేర్చుకోవాలి

- ప్రణాళికతో భవిష్యత్తును నిర్మించుకోవాలి
- వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి
- ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన సౌకర్యాలు
- జవహర్ బాలభవన్ డేలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**గద్వాల నడిగడ్డ, మే 17 (జనం సాక్షి) :** విద్యార్థులు చదువుతోపాటు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు నేర్చుకుంటే తాము ఎంచుకున్న రంగాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో చివరి రోజు ఆదివారం జవహర్ బాలభవన్ డే కార్యక్రమాలు నిర్వహించారు. గద్వాల బాలభవన్ లో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఒకప్పుడు ఎడ్యుకేషన్ డే అంటే కేవలం చదువుకు సంబంధించి మాత్రమే నిర్వహించే వాళ్ళని ప్రస్తుతం లైబ్రరీ డే, బాల భవన్ డే వంటివి నిర్వహిస్తూ బోధనేతర అంశాలపై విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఎప్పుడూ చదువుకోవడం అంటే ఒత్తిడి పెరుగుతుందని, ఇలాంటి బాలభవన్ శిక్షణలతో వారిలో సృజనాత్మకత అలవడుతుందన్నారు. విద్య అంటే కేవలం మార్కులు సాధించడం మాత్రమే కాదని క్రీడలు, సాంస్కృతిక వంటి బోధనేతర రంగాలపై కూడా విద్యార్థులు దృష్టి సారించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, ప్రస్తుతం ఎంపిక చేసిన పలు పాఠశాలల్లో చెస్, క్యారమ్స్, నృత్యం, చిత్రలేఖనం, హ్యాండ్ రైటింగ్ తదితర అంశాలపై నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ పోవాలంటే సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని, ఎక్కడికి వెళ్ళినా, ఎలాంటి వాళ్ళతోనైనా ధైర్యంగా మాట్లాడగలిగే నైపుణ్యాలు అవసరమని పేర్కొన్నారు. కంప్యూటర్, డిజిటల్ టెక్నాలజీ, ఏఐపై కూడా అవగాహన కలిగేలా విద్యార్థులకు కంప్యూటర్ మాస్టర్లు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్, తదితర కోర్సుల్లో చేరి చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు తమకు ఆసక్తి, డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకొని ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. విద్యార్థులు ప్రణాళికతో తమ భవిష్యత్తును నిర్మించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఇటీవల వెలువడిన పదవ తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో టాపర్స్ గా నిలిచిన ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో పాటు పలు బహుమతులు, ప్రశంసా పత్రాలను జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి అందజేశారు. అంతకుముందు చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి, పలు మండలాల విద్యాధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు



**సంగారెడ్డి, టౌన్ మే 17 (జనం సాక్షి) :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా "విద్య విజయోత్సవం" వేడుకలను ఆదివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యా, క్రీడా రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 10 వేల నగదు చెక్కు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి సంగారెడ్డి జిల్లాకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోజిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, అదనపు సంచాలకులు శంకర్, సమగ్ర శిక్ష సమన్వయ కర్తలు, మండల విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యా సమన్వయ మండలి కార్యదర్శి లింబాజీ, బాలయ్య, తాజుద్దీన్, భీమగౌండ, వెంకటస్వామి, సిద్ధారెడ్డి, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆటోకు తాడు కట్టి లాగుతూ సీపీఐ వినూత్న నిరసన

- పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలి
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్



**చేర్యాల, మే 17 (జనంసాక్షి) :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ చేర్యాల మండల కేంద్రంలో అంగడి బజార్ చౌరస్తా వద్ద ఆదివారం సీపీఐ నాయకులు ఆటోకు తాడుకట్టి లాగుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గసభ్యులు అందె అశోక్ మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన 13 సంవత్సరాల కాలంలో పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ నిత్యవసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని మండిపడ్డారు. సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపడంతో రైతులు, కూలీలు, కార్మికులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇంధన ధరల పెరుగుదల కారణంగా రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు కూడా అమాంతం పెరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో మధ్యతరగతి, పేద ప్రజల జీవనం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, లేదంటే దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, మండల కోశాధికారి నంగి కనకయ్య, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు సుంకోజు రజిత, మండల కార్యవర్గ సభ్యులు మనేపల్లి కిష్టయ్య, సిద్దిరాం భద్రయ్య,మల్లం గిరి, మల్లయ్య, పోషయ్య, రాజవ్వ, ప్రమీల, కనకవ్వ, తదితరులు పాల్గొన్నారు.

## వరి బోనస్ డబ్బులు వేస్తారా లేదా స్పష్టం చేయాలి



**కృష్ణ, మే 17 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లుకు క్వింటాలుకు 500 బోనస్ వేస్తాము అని ప్రకటించి వడ్లు కొనుగోలు కేంద్రాలలో రైతులు అమ్మి 25 రోజులు అయిన కూడా బోనస్ డబ్బులు వేయలేదు అని సన్న వడ్లకు బోనస్ వేస్తారా..? లేదా ప్రభుత్వం స్పష్టం చేయాలని మండల బిజెపి అధ్యక్షుడు నలె నర్సప్ప డిమాండ్ చేశారు.ఆదివారం బిజెపి మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ లు, ప్రధాన కార్యదర్శులు డి రాఘవేంద్ర, తిమ్మాలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొన్న వడ్ల డబ్బులు మాత్రమే రైతుల ఖాతాలలో జమ చేశారనీ గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా యాసంగికి బోనస్ వేసేటట్లు లేరు అని అన్నారు. పెట్టుబడులు ఎక్కువ అయ్యాయి, పంటలు తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది వడ్లు అమ్మితే పెట్టుబడి కూడా రాలేదు అని రైతులు దిగులు చెందుతున్నారని అన్నారు. ఒకవేళ ప్రైవేట్ వ్యక్తుల దగ్గర వడ్డీకి తెచ్చి పంటలు పండించిన వారి పరిస్థితి మరి గోరంగా ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యింది సౌకారుల దగ్గరకు అప్పుకు వెళ్తే మునుపు తీసుకున్న అప్పు కడితే కొత్త అప్పు ఇస్తాము అని అంటున్నారని రైతులు వాపోతున్నారని తెలిపారు.రైతులను ఆదుకోవడం కోసం బోనస్ డబ్బులు వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలని అన్నారు. అదేవిధంగా యాసంగి రైతు భరోసా కేవలం రెండు ఎకరాలకు మాత్రమే వేసి మౌనం పాటించడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. రైతు భరోసా పంటలు పండే భూములకు మాత్రమే కుటుంబ యూనిట్‌గా ఐదు ఎకరాలకా లేక పది ఎకరా లకు ఇస్తారా అని ప్రకటించి ఖరీఫ్, యాసంగిలో సకాలంలో రైతు భరోసా ఇస్తే రైతులకు కొంత ఆసరా అవుతుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యింది కావున రైతులను ఆదుకోవడం కోసం వడ్లు అమ్మిన వారికి బోనస్ డబ్బులు, రైతులందరికీ రైతు భరోసా డబ్బులు వేసి రైతుల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

# సమన్వయంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి

- జడ్చర్ల మున్సిపల్ నూతన కమిషనర్ గిరీష్
- బాధ్యతలు స్వీకరించిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటన
- వర్షాలకు కూలిన ఇండ్ల పరిశీలన
- శానిటేషన్, డ్రైనేజీ వ్యవస్థలపై సమీక్ష



**జడ్చర్ల, మే 17 (జనంసాక్షి) :** మున్సిపల్ సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ ఎం గిరీష్ అన్నారు. ఆదివారం జడ్చర్ల మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎం. గిరీష్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పట్టణ పరిస్థితులను సమీక్షించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పట్టణంలో కూలిపోయిన ఇండ్లను మున్సిపల్ కమిషనర్ గిరీష్ స్వయంగా పరిశీలించారు. బాధితులతో మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆ ఇండ్లలో నివాసం ఉంటున్న వారిని తక్షణమే స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలివెళ్లాలని ఆయన సూచించారు. అనంతరం జడ్చర్ల పట్టణంలో శానిటేషన్ (పారిశుధ్యం), డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో పట్టణంలో పారిశుధ్య లోపం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మన్నతో పాటు వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బందితో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి



**కొముురవెల్లి, మే 17 (జనం సాక్షి) :** పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఎం పార్టీ కొమరవెల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో కొముురవెల్లి పోలీస్ బొమ్మ వద్ద రాస్తారోకో చేసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు .అనంతరం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ మాట్లాడుతూ .కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రోజురోజుకు నిత్యవసర వస్తువు ధరలను పెంచుతూ పేద మధ్యతరగతి ప్రజలపై అధిక భారం మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ను పెంచడం వలన నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో పాటు రవాణా చార్జీలు కూడా పెరుగుతాయని దీంతో పేద మధ్యతరగతి ప్రజలు ఇబ్బందుల పాలు అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు . బడ కార్పొరేట్లకు అనేక రాయితులు ఇచ్చి పేద మధ్య తరగతి ప్రజలపై అనేక భారాలు వేస్తూ వారి నడ్డి విరుస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగియగానే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను రూపాయలు 993 పెంచడంతో వాణిజ్య సిలిండర్ ధర 3100 చేరుకున్నదని గృహ అవసరాల గ్యాస్ సిలిండర్ పై 50 రూపాయలు పెంచడం అలాగే పెట్రోల్ డీజిల్ పై మూడు రూపాయలు పెంచడం జరిగిందని అసలే నిత్యవసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ గ్యాస్ ధరలతో ప్రజల మీద మూలిగే నక్కపై తాటి పండు పడ్డచందంగా ఉందని వారన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సార్ల యాదయ్య తాడూరి ప్రశాంత్ ఆరుట్ల రవీందర్ లింగంపల్లి మల్లయ్య తాడూరి నరేష్ తాడూరి దాసు పాకనాటి బాలుతాడూరి భరత్ కుమార్ కానుగుల రాజు గాంధారి శ్రావణ చారి ఆరుట్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి



**నంగునూర్, మే 17 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని నంగునూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి సూచించారు.ఆదివారం ఉదయం ఖాతా,గట్లమల్యాల గ్రామాలలోని వడ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా మిల్లుకు వచ్చిన వెంటనే ధాన్యాన్ని ఖాళీ చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని రైస్ మిల్లర్లకు సూచించారు. చైర్మన్ వెంట ఖాతా సర్పంచ్ పుల్లూరు సోనీ మహేష్,డైరెక్టర్ గాండ్ల రమేష్, బాగు శ్రీకాంత్ యాదవ్,తుపాకుల శ్రీనివాస్, చల్ల శ్రీనివాస్ రెడ్డి, ఆరెపల్లి సురేష్,పంగ రాజశేఖర్ రెడ్డి,మహాదేవ్, ఈజాజోద్దీన్ తదితరులున్నారు.

# సామాజిక విద్యావేత్త అయిల్ సదానందం గౌడ్‌కు గౌరవ డాక్టరేట్ పురస్కారం

- చెన్నై సిటీ లోనిభారతీయ విద్యా భవన్‌లో అందజేత
- ఆనందం వ్యక్తం చేసినఅయిల్ సదానందం గౌడ్




**కల్వకుర్తి రూరల్, మే 17 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రం,ఉమ్మడి పాలమూరుజిల్లా తలకొండపల్లి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారులు,సామాజిక విద్యావేత్త అయిల్ సదానందం గౌడుకి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ చేగౌరవ డాక్టరేట్ పురస్కారంచెన్నైలోని భారతీయ విద్యా భవన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు అందజేశారు. ఈ సందర్భంగా సదానందం గౌడు మాట్లాడుతూ 26 ఏండ్లుగా సామాజిక విద్యావేత్త గా అంకితభావంతో పని చేయడంతో గౌరవ డాక్టరేట్ పురస్కారం అందజేశారు. డాక్టరేట్ పురస్కారం నాలో మరింత భాద్యత ను పెంచిందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా, కల్వకుర్తి నియోజకవర్గం , తలకొండపల్లి మండలం, చెన్నంపల్లి గ్రామంలో నిరుపేద రైతు కుటుంబంలో అయిల్ యాదయ్య గౌడు,చెంద్రమ్మ దంపతులకు సదానందం గౌడు జన్మించారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నాగాని చిన్న వయసులో చక్కగా చదువుకొని ప్రసిద్ధ ఉస్మానియా యూనివర్సిటీలో ఫస్టు క్లాసులో పట్టా పొందారు. విద్యా రంగంలో గత 26 ఏండ్లుగా లెక్చరర్ గా వారు చేసిన సేవలు ,పర్యావరణ పరిరక్షణకై చేసిన కృషి, సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ లిగౌరవ డాక్టరేట్ అవార్డు అందజేశారని పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమకారులు,సామాజిక విద్యావేత్త, పర్యావరణ పరిరక్షకులు, ఉత్తమ లెక్చరర్ అవార్డు గ్రహీత అయిల్ సదానందం గౌడు నిరంతరం విద్యార్థుల్లో జ్ఞానాన్ని వెలికితీయడం అవినీతికి వ్యతిరేకంగా పోరాటం,సామాజిక న్యాయం కోసం చేసిన ప్రయత్నాలు గౌరవ డాక్టరేట్ పురస్కారం అందజేయడం జీవితంలో ఎంతో ఆనందాన్ని కల్గించిందన్నారు.విద్య బోధించడం నా హాబీ, సమస్యలపై ఉద్యమించడం నా నైజం,పర్యావరణ పరిరక్షణ నా బాధ్యతఅనిసదానందం గౌడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానిక అతిథులుగా యూనివర్సిటీ వైస్ చాన్సులర్ అమృతవల్లి, మద్రాస్ హైకోర్టు జడ్జి వెంకటేశన్,గోని నర్సింహ్మ గౌడ్,రష్య రాయబారి రిజిస్ట్రార్, అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల విస్తరణకు రైతులు ముందుకురావాలి

- హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష
- వజ్రోత్సవ వేడుకల్లో ఆకట్టుకున్న మామిడి ప్రదర్శన



**సంగారెడ్డి టౌన్, మే 17 (జనం సాక్షి) :** ఉద్యాన శాఖ అందిస్తున్న ప్రోత్సాహక పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంచుతూ అధిక ఆదాయం పొందాలని హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష సూచించారు. ఆదివారం సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రంలో నిర్వహించిన వజ్రోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె, కార్యక్రమాన్ని ప్రారంభించి ఏర్పాటు చేసిన మామిడి ప్రదర్శనను పరిశీలించారు. వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన మామిడి ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫల పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో వివిధ రకాల మామిడి పండ్లను ప్రదర్శించగా, మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల నుండి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష మాట్లాడుతూ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల విస్తీర్ణం పెంపు కోసం రైతులకు అనేక ప్రోత్సాహక పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉద్యాన పంటల సాగు విస్తరణ ద్వారా అధిక ఆదాయం పొందాలని సూచించారు. జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో సుమారు 16 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోందని తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరిస్తూ నాణ్యమైన మామిడి పండ్ల ఉత్పత్తి చేపడితే విదేశాలకు ఎగుమతులు చేసి అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఉత్తమ దిగుబడుల సాధనకు నాణ్యమైన మొక్కలు ఎంతో అవసరమని పేర్కొంటూ, ఫల పరిశోధన కేంద్రం ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల నాణ్యమైన మొక్కలను సంగారెడ్డి జిల్లా రైతులకు అందజేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఫల పరిశోధన కేంద్రం ఒక విలువైన ఆస్తిగా నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ పి. సురేష్, డాక్టర్ కె. వెంకటలక్ష్మి, డాక్టర్ బాబు, డాక్టర్ ఏ. కిరణ్ కుమార్, శాస్త్రవేత్తలు మౌనిక, నవీన్, నితీష్ కుమార్, ఉద్యాన అధికారులు, ఉద్యాన విస్తరణా అధికారులు, డ్రిప్ మరియు గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


## వరి కొనుగోలు వేగం పెంచాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 17 (జనం సాక్షి) :** వరి ధాన్యం కొనుగోళ్లను వేగంగా జరపాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను ఆదేశించారు. ఆదివా రం ఆయన దామరగిద్ద మండలంలోని ఆశన్ పల్లి, మద్దూరు మండలంలోని ఖాజీపూర్, దమ్ గాన్ పూర్ ఐకెపి, పిఎసిఎస్, మెప్మా వరి కొనుగోలు కేంద్రాలను సంద ర్శించారు. ఈ సందర్భంగా వరిలోని తేమ శాతాన్ని తని ఖీ చేశారు. ప్రభుత్వ నిబంధ నల ప్రకారం కచ్చితంగా వరిని సేకరించాలని ఆయా కేంద్రాల ఇన్‌చార్జ్‌లను ఆదే శించారు. సేకరించిన వరిని, ట్యాగ్ చేయబడిన రైస్ మిల్లు లకు వెంటనే తరలించేలా చూడాలని సూచించారు. అంతేకాకుండా ఓపిఎంఎస్‌లో రోజువారీ ట్యాబ్ ఎంట్రీల ను ఎలాంటి ఆలస్యం లేకుండా వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి సైదులు, డీటిలు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో 'లారీ' రాజకీయం

- ప్రభుత్వ కేంద్రాల్లో దళారుల దందా!
- కృత్రిమ కొరత సృష్టించి రైతుల నడ్డి విరుస్తున్న బ్రోకర్లు
- బస్తాకు రూ.30 అదనపు వసూలు
- ట్రాన్స్పోర్ట్ వాహనాలే.. ప్రైవేటు ముసుగులో దోపిడీ
- అధికారుల సమాధానంపై రైతుల ఆగ్రహం




కొత్తగూడ, మే 17 (జనంసాక్షి) : ఆదివాసి ఏజెన్సీ ప్రాంత రైతుల అమాయకత్వమే ఆసరాగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో దళారులు రెచ్చిపోతున్నారు. ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు గిట్టుబాటు ధర లేక సతమతమవుతున్న రైతును 'రవాణా' పేరుతో నిలువునా దోచుకుంటున్నారు. ప్రభుత్వమే లారీలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో మాత్రం సీన్ రివర్స్ అవుతోంది. లారీల కృత్రిమ కొరతను సృష్టించి, పైసలు ఇస్తేనే లోడ్ చేస్తామంటూ దళారులు బరితెగిస్తున్నారు.

### సర్కారు ట్రాన్స్పోర్ట్ లారీకి.. సాహుకారి వసూళ్లు!

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చే వాహనాలను ప్రైవేటు లారీలుగా చిత్రీకరిస్తూ, ప్రతి బస్తాకు రూ.30 వరకు వసూలు చేస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఈ వసూళ్ల వెనుక గ్రామాల్లో ఉండే చోటా మోటా పెట్టుబడిదారులు, కొందరు అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "పైసలు ఇస్తేనే లారీలో లోడ్ చేస్తాం.. లేదంటే ఇక్కడే పడి ఉంటుంది" అంటూ డ్రైవర్ల పేరుతో దళారులు బెదిరింపులకు దిగుతుండటంతో రైతులకు దిక్కుతోచడం లేదు.

### అధికారుల వింత సమాధానం...

ఈ అక్రమాలపై రైతులు అధికారులను నిలదీయగా.. "రైతులే సొంతంగా లారీలను తెచ్చుకుంటున్నారు, అవి ప్రైవేటు వాహనాలు" అంటూ సమాధానం చెప్పి తప్పించుకుంటున్నారు. అయితే ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. ప్రైవేటు వాహనాలైతే ప్రభుత్వ ఆన్లైన్ పోర్టల్లో 'ట్రక్ షీట్' ఎలా జనరేట్ అవుతోంది? వాటికి ప్రభుత్వ కిరాయి ఎలా చెల్లిస్తున్నారు? దళారులకు లాభం చేకూర్చేందుకే అధికారులు ఇలాంటి అబద్ధాలు ఆడుతున్నారని రైతులు మండిపడుతున్నారు. పేద రైతు చెల్లించలేకపోవడాన్ని అదునుగా చేసుకుంటున్న పెట్టుబడిదారులు, రైతుల దగ్గర తక్కువ ధరకే మక్కలను కొనుగోలు చేస్తున్నారు. అవే మక్కలను ప్రభుత్వ కేంద్రాల్లో తూకం వేయించి, యధేచ్ఛగా ప్రభుత్వ లారీల్లోనే రవాణా చేస్తూ లాభపడుతున్నారు. ఈ కేంద్రాలు పేద రైతుల కోసమా లేక ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్న దళారుల కోసమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### పట్టించుకోని అధికారులు.. రైతుల తీవ్ర ఆవేదన

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల కష్టం దళారుల పాలవుతోంది. ప్రభుత్వం లారీ కిరాయిలతో పాటు ఇతర ఖర్చులను భరిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కొందరు స్వార్థపరులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఒక్కో ధాన్యం బస్తాపై 30 వరకు అక్రమంగా వసూలు చేస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారు.

### లారీకి రైతుల నుండి రూ. 24 వేల దోపిడీ!

సాధారణంగా ఒక లారీలో సుమారు 800 ధాన్యం బస్తాలను లోడ్ చేస్తారు. ఒక్కో బస్తాకు రూ. 30 చొప్పున లెక్కగడితే, కేవలం ఒక లారీ ధాన్యం తరలించడానికి రైతు నుండి రూ. 24,000 వరకు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా బస్తాకు డ్రైవర్ మామూలు, తాడు మాములు అంటూ రైతును పిప్పి చేస్తున్న వైనం..... ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి ఇంత భారీ మొత్తంలో అదనపు చార్జీలు చెల్లించాల్సి రావడంపై అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం లారీ కిరాయి చెల్లిస్తుంది కదా అని రైతు అడిగితే గోదాం వద్ద వెయిటింగ్ చేస్తున్నాం కాబట్టే మీ నుండి వసూలు చేస్తున్నాం మీకు సంబంధం లేదు మీరు ఇచ్చేది మీరు ఇవ్వాల్సిందే అంటూ హుకుం....

### అధికారులు ఉన్నారా...? లేక ప్రైవేట్ రాజ్యమా...?

ఇంత బహిరంగంగా అవినీతి జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "అసలు ప్రభుత్వ అధికారులు ఉన్నారా లేక ప్రైవేట్ వ్యక్తుల రాజ్యం నడుస్తుందా...?" అని రైతులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ అక్రమ వసూళ్లు బరితెగిస్తున్నాయని, ఇది ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### ప్రభుత్వ అధికారులు ఎందుకు ఉన్నట్టు..?

'రైతులే లారీలు తెచ్చుకోవాల్సి వచ్చినప్పుడు,ఇక అధికారుల పర్యవేక్షణ ఎందుకు...? ప్రభుత్వం ఎందుకు ఉన్నట్టు...?" అని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆదివాసి ప్రాంతాల్లో సాగుతున్న ఈ ఘరానా మోసంపై ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే విచారణ జరిపించాలని,దోపిడీకి పాల్పడుతున్న దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యార్థిని గంధం హాసినికి కలెక్టర్ అభినందన

- ప్రశంసా పత్రం, రూ.10 వేల నగదు అందజేత...



చెన్నారావుపేట, మే 17 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా విద్యా వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ లో అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను జిల్లా కేంద్రంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ మోడల్ జూనియర్ కళాశాలలో చదివిన జల్లి గ్రామానికి చెందిన గంధం వెంకన్న, రాధిక దంపతుల కుమార్తె గంధం హాసిని ఇంటర్ ఫలితాలలో 971 మార్కులను సాధించి అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది.ప్రభుత్వ కళాశాలలో చదివి జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఉత్తమ మార్కులను సాధించినందుకు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రశంస పత్రాన్ని అందించి రూ. 10వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి ఘనంగా శాలువాతో సన్మానించారు. అదేవిధంగా వరంగల్ కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడులు విద్యార్థిని గంధం హాసిని ఆమె తల్లి గంధం రాధికలకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అమీనాబాద్ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్ట జ్యోతి, ఉపాధ్యాయులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగిఉండాలి

- మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి



మహబూబాబాద్ బ్యూరో, మే 17(జనం సాక్షి): మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ రఘుపతి రెడ్డి, స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్స్కు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా, సమాజంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, రౌడీ షీటర్స్ తమ పాత నేరప్రవర్తనలను పూర్తిగా విడనాడి, మంచి పౌరులుగా మారాలని సూచించారు. ఎవరైనా తిరిగి నేర కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు భయాందోళనలు కలిగించే చర్యలు, గొడవలు, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వ్యవహారాలలో పాల్గొనరాదని స్పష్టం చేశారు. అలాగే యువత చెడు మార్గాల్లో వెళ్లకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు సహకరించాలని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై రాంచరణ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉర్స్ జాగీర్లో వక్ఫ్ భూములపై అక్రమ నిర్మాణాలు తొలగించాలి



వరంగల్ ఈస్ట్, మే 17 (జనం సాక్షి) : ఖిలా వరంగల్ మండల పరిధిలోని ఉర్స్ జాగీర్ గ్రామంలో వక్ఫ్ భూములపై గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ నిర్మాణాలు, కట్టడాలు మరియు సెల్ఫోన్ టవర్ గత నాలుగేళ్లుగా ఉంది అని ఆ యొక్క నెలసరి వేతనాలు దర్గాకు చెందాలని స్థానికులు కోరుతూ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం "హజ్రత్ జిందా బిక్కన్ దర్వేష్ దర్గా మరియు మస్జిద్"కు చెందిన సర్వే నంబర్లు 273, 274, 275, 276లో ఉన్న సుమారు 17 ఎకరాలు 5 గుంటల భూమి అధికారికంగా నమోదిత వక్ఫ్ ఆస్తిగా గెజిట్లో ప్రచురితమై ఉంది. అయితే కొందరు వ్యక్తులు ఆ భూములను అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడమే కాకుండా వెంచర్లుగా మార్చి ఇతరులకు విక్రయాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంకా సర్వే నంబర్లలో మార్పులు చేసి రిజిస్ట్రేషన్లు నిర్వహించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ శాఖతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత భూములు వక్ఫ్ బోర్డు ఆస్తులేనని పత్రాల ఆధారంగా నిర్ధారణ అయినట్లు సమాచారం.ప్రస్తుతం ఆ భూములపై సెల్ఫోన్ టవర్తో పాటు పలు అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు తెలిపారు. ఈ నిర్మాణాలను వెంటనే తొలగించాలని, లేదంటే వాటి ద్వారా వచ్చే నెలవారీ ఆదాయాన్ని దర్గా అభివృద్ధి మరియు నిర్వహణకు కేటాయించాలని మైనార్టీ సోదరులు డిమాండ్ చేస్తున్నారు.ఈ అంశంపై జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఇప్పటికే సంబంధిత అధికారులకు సమాచారం అందినట్లు తెలిసింది. అక్రమ నిర్మాణాలను నిలిపివేయడం, అనుమతులను రద్దు చేయడం, వక్ఫ్ చట్టం-1995 సెక్షన్ 52-ఏ కింద కేసులు నమోదు చేయాలని సూచించినట్లు సమాచారం.వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ మహమ్మద్ రియాజ్ ఆధ్వర్యంలో స్థానికులు మహ్మద్ అలీ, మహ్మద్ రఫీక్, మహ్మద్ జైనులాబిదీన్ అందించిన సమాచారంతో కొందరు వ్యక్తులు వక్ఫ్ భూమిలో అక్రమంగా ప్రవేశించి నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మిల్స్ కాలనీ పోలీసులు వెంటనే స్పందించి ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వక్ఫ్ శాఖ ప్రతినిధులు కోరుతున్నారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని అక్రమ ఆక్రమణలను తొలగించాలని స్థానిక ప్రజలు మరియు మైనార్టీ సోదరులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## పల్లెల్లో తొలిసారి ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు

- గ్రామంలో ఆనందోత్సాహం




నేరడిగొండ, మే 17 (జనంసాక్షి) : మండలంలోని దర్బా తండా గ్రామ ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ఆదివారం నుండి దర్బా తండా గ్రామానికి కొత్తగా ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభమైంది. ఈ బస్సు నేరడిగొండ నుండి బయలుదేరి వడూర్, బొందిడి,దర్బా తండా, ధన్నూర్ మీదుగా బోథ్ వరకు నడవనుంది. మొదటిసారిగా తమ గ్రామానికి బస్సు రావడంతో దర్బాతండా గ్రామస్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.ఊర్లోకి వచ్చిన బస్సుకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించినందుకు ప్రభుత్వానికి,ఆర్టీసీ అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. బస్సు డ్రైవర్,కండక్టర్లను శాలువాలతో సత్కరించి, మిఠాయిలు తినిపించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీతారామ్,ఉప సర్పంచ్ నరేష్ వార్డు మెంబర్ అంబారావు గ్రామ ప్రముఖులు హరీష్ కార్తీక్ గంగారామ్ విఠల్ లతో పాటు తండా పల్లె ప్రజలు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై బస్సు సర్వీసును ఘనంగా ప్రారంభించారు. బస్సు సౌకర్యం వల్ల విద్యార్థులకు,ఉద్యోగులకు, రోగులకు ఎంతో మేలు జరుగుతుందని గ్రామ పెద్దలు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు.

## విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత

- ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు
- ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేల రూ అందజేసిన ఎమ్మెల్యే




హనుమకొండ, ప్రతినిధి మే 16 (జనం సాక్షి) : విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా హనుమకొండ ఐడీఓసీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా హనుమకొండ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.200 కోట్లు కేటాయించి మౌలిక వసతులను మెరుగుపరిచినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ నైపుణ్యాలు పెంపొందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని అన్నారు ఉపాధ్యాయులు విద్యార్థుల మానసిక స్థితిని అర్థం చేసుకుని ప్రణాళికాబద్ధంగా శిక్షణ అందిస్తే వారు మంచి ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు.గత సంవత్సరం రాష్ట్రస్థాయిలో హనుమకొండ జిల్లా 18వ స్థానంలో ఉండగా, ఉపాధ్యాయుల కృషి, జిల్లా కలెక్టర్ ప్రోత్సాహం, విద్యార్థులకు సమర్థవంతమైన విద్యాబోధన అందించడం ద్వారా 2026లో రాష్ట్రస్థాయిలో 9వ స్థానాన్ని సాధించి విశిష్ట ఫలితాలు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థికి రూ.10 వేల నగదు బహుమతిని అందించడమే కాకుండా, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన సొంత వేతనం నుంచి అదనంగా మరో రూ.10 వేల చొప్పున అందించి విద్యార్థులను అభినందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో డీఈఓ గిరిరాజ్, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

వరంగల్ ఈస్ట్, మే 17 (జనం సాక్షి) : వరంగల్ మిల్స్ కాలనీ పరిధిలో ఉన్నటువంటి రౌడీషీటర్లందరికీ ఆదివారం వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత స్పెషల్ కౌన్సిలింగ్ ఇచ్చారు. వరంగల్ మిల్స్ కాలనీ పరిధి అంతా కూడా శాంతియుతంగా ఉండాలని రౌడీ షీటర్లను ఈ సందర్భంగా హెచ్చరించారు. బుద్ధిగా మసులుకోవాలని హితవు పలికారు. రౌడీ షీటర్లే కాకుండా ఎవరైనా సరే ఇకపై నుండి తగాదాల్లో,ఇతర గొడవల్లో తలదూరిస్తే వారికి కఠిన చర్యలు తప్పవని డిసిపి ధార కవిత అన్నారు.రౌడీ షీటర్ల కౌన్సిలింగ్ కార్యక్రమంలో వరంగల్ ఇంచార్జ్ హనుమకొండ ఏసిపి నరసింహ రావు,మిల్స్ కాలనీ సిఐ బొల్లం రమేష్, ఎస్ఐలు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు



లక్ష్మణ చందా, మే 16 (జనం సాక్షి) : మండలంలోని తిరుపల్లి నుండి లక్ష్మణచందా వైపు బేరం ఎా ఎ్ న ్ న వయస్సు 45.. బేరం లింగన్న వయస్సు 52 టీవీఎస్ ఇ-శ్రీ మీద వెళ్తున్నారు. లక్ష్మణ్ చందా నుంచి బైక్ అతను వీళ్లను ఢీకొట్టాడు. పాపన్నకు కాలికి తీవ్ర గాయం కాగా లింగన్నకి ఎడమ చేతికి దెబ్బ తగిలినది వీరికి ప్రథమ చికిత్స చేసి అంబులెన్స్ ఏమిటి సురేష్ నిర్మల్ గవర్నమెంట్ హాస్పిటల్ లో అడ్మిట్ చేసినట్టు తెలిపారు.

## రాష్ట్ర రహదారిపై బైఠాయించిన రైతులు

- లారీల్లో దాన్యం తరలించడంలో జాప్యం
- రోడ్డెక్కి నిరసన తెలిపిన రైతన్నలు...



మంగపేట మే 17(జనంసాక్షి) : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తరలించకుండా జాప్యం చేస్తున్న కొనుగోలు నిర్వాహకులు, లారీల యాజమాన్యంపై నిరసన తెలుపుతూ రాష్ట్ర రహదారి కమలాపురం రోడ్డుపై బైఠాయించిన బోరు నర్సాపురం రైతులు. ఆదివారం రైతులు తమ ధాన్యం బస్తాలలో పట్టి 10 రోజుల కాలం గడుస్తున్న నేటి వరకు కూడా ధ్యానాన్ని తరలించడం లేదు అని మిల్లులకు ధాన్యాన్ని తరలించడంలో లారీలు రాకపోవడంతో తీవ్ర జాప్యం జరుగుతుందని నిరసన తెలుపుతూ ఆందోళన చేపట్టారు. ఇది ఇలా ఉండగా మిల్లులకు పంపిన ధాన్యంలో ఒక్కో రైతు వద్ద క్వింటాకు ఐదు నుండి 10 కేజీల వరకు తరుగు పేరిట ధాన్యం కోత విధిస్తున్నారని రైతులు ఆరోపించారు. మిల్లు యజమానులు ధాన్యం మిల్లులకు చేరిన అనంతరం అధిక మొత్తంలో కటింగు పెడుతున్నారు అని ఆ కటింగ్ లకు ఒప్పుకోకపోతే ధాన్యాన్ని తిరిగి పంపిస్తామని కరాకండిగా చెప్పడంతో ఆరుగాలం కష్టపడి పండించిన తీవ్రస్థాయిలో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. గత కొన్ని రోజులుగా వాతావరణం మార్పుల వలన వర్షాలు సంభవిస్తున్నాయని ధాన్యాన్ని భద్రపరచడం తీవ్ర సమస్యగా మారింది అని ఇప్పటికైనా సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్ కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే లారీలను ఏర్పాటు చేసి ఎటువంటి కటింగులు లేకుండా చూడవలసిందిగా రైతులు వేడుకున్నారు. లేనిపక్షంలో ఇదే రాష్ట్ర రహదారిపై పెద్ద ఎత్తున రైతులు చేరుకొని ఆందోళనలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

## బెత్తం పడితేనే పిల్లలు సక్కగా ఉంటారు..

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు..
- స్ఫూర్తి పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపింది..
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి..



వరంగల్ ప్రతినిధి, మే 17 (జనంసాక్షి) : నేటి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఎన్ని అవకాశాలు ఉన్నాయో దారి తప్పడానికి అన్ని అవకాశాలు ఉన్నాయని వారిని పోలీస్ స్టేట్లో లాఠీ, ఉపాధ్యాయులు బెత్తం పట్టి అదుపు చేయాల్సిన అవసరం ఉందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా విద్యా విద్యా వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా డిసిసి బ్యాంక్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వర్ధన్నపేట కేఆర్ నాగరాజు పాల్గొని ప్రసంగించారు. నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి పాల్గొని జిల్లాలో టాప్ ర్యాంకర్లకి ఒక్కొక్కరికి 10వేల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఆరుగురు టాప్ ర్యాంకర్లకు కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రాంరెడ్డి ఒక్కొక్కరికి రూ. 10వేల చెక్కులు విద్యార్థినులకు బహుమతిగా అందించారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి చేతిలో మీదుగా బహుమతి అందుకున్న విద్యార్థితో పాటు ఈ టాప్ ర్యాంకర్లలో ఎస్ఎస్సి ఇంటర్మీడియట్ అండ్ స్పోర్ట్ విద్యార్థినులు ఉన్నారు. ఈ విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు (రిటైర్డ్ ఐపీఎస్) విద్యార్థులు, ఉపాధ్యాయులు, మరియు తల్లిదండ్రులను ఉద్దేశించి సంచలన ప్రసంగం చేశారు. నేటి విద్యా వ్యవస్థలో మారుతున్న పోకడలు, క్రమశిక్షణ లోపించడంపై ఆయన తనదైన శైలిలో స్పందించారు.తాను ఒక సాధారణ పోలీస్ కానిస్టేబుల్ కుమారుడినని, ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకున్నానని ఎమ్మెల్యే గుర్తు చేశారు.ప్రైవేట్ విద్యాసంస్థల కంటే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులే అత్యంత ప్రతిభావంతులు, క్వాలిఫైడ్ అని ఆయన కొనియాడారు. ఎన్నో ఒడిదుడుకులు, కష్టాలను ఎదుర్కొని, హార్డ్ వర్క్ను నమ్ముకుని తాను ఐపీఎస్ అధికారిగా విజయం సాధించానని, కష్టపడితేనే ఫలితం ఉంటుందని విద్యార్థులకు హితవు పలికారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా తమను తాము అప్డేట్ చేసుకోవాలని, అప్పుడే విద్యార్థులకు సరైన దిశానిర్దేశం చేయగలరని సూచించారు. పిల్లలను కేవలం స్కూల్కు పంపించి చేతులు దులుపుకుంటే తల్లిదండ్రుల బాధ్యత తీరిపోదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో "స్ఫూర్తి" కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రిటైర్డ్ హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేసి విద్యార్థులకు భవిష్యత్పై అవగాహన కల్పించేందుకు మోటివేషనల్ క్లాసులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించి, చదువుపై ఆసక్తి పెంపొందించడంలో "స్ఫూర్తి" కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.వచ్చే విద్యా సంవత్సరంలో ప్రజాప్రతినిధులను కూడా "స్ఫూర్తి" కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఈ సందర్భంగా సూచించారు.అదేవిధంగా, "స్ఫూర్తి" కార్యక్రమంలో పాటు పరీక్షల సమయంలో అదనపు క్లాసుల నిర్వహణ లో తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం ఈవెనింగ్ స్నాక్స్ అందించడం తో అట్టి సౌకర్యాన్ని పిల్లలు సద్వినియోగం చేస్నతున్నారని తెలిపారు. సందర్భంగా కూడా చైర్మన్ ఎనిమిల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ చిన్నప్పుడు మేమంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వాళ్ళమేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడమైనదిఈ కార్యక్రమంలో అతను కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవో సుమ, డిఓ రంగయ్య నాయుడు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ రావు, ఏసిజి ఈ అరుణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఏప్‌సెట్‌లో మెరిసిన రేస్ విద్యార్థులు

- అద్భుత ఫలితాలతో రేస్ కాలేజీకి రాష్ట్రస్థాయి గుర్తింపు
- రికార్డు స్థాయిలో క్వాలిఫై అయిన రేస్ విద్యార్థులు





**కోదాడ, మే 17 (జనం సాక్షి) :** ఏప్‌సెట్ ఫలితాలలో రేస్ కాలేజీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి స్టేట్ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన మొక్కా చరణ్ సాయి 380, ఐ. కృష్ణ చరణ్ 440, సిహెచ్ భాను శంకర్ 1775, డి విజయ్ చరణ్ 2135, సిహెచ్ ఉత్తేజ్ 5231, లేఖనా రెడ్డి 6749, కురువ నవీన్ 7354, వంగవీటి అక్షయ8462,వెంకటదత్త కిరణ్ 9748 ర్యాంకులు సాధించారు.ఈ సందర్భంగా చైర్మన్ బాణాల వసంత రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ ఏడాది పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ, కాలేజీ నుంచి రికార్డు స్థాయిలో విద్యార్థులు క్వాలిఫై అయ్యారని తెలిపారు.అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# కొంపల్లి సర్కిల్‌లో యథేచ్ఛగా అనుమతులేని భవన నిర్మాణాలు

- నిబంధనలు బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాల జాతర
- రామిరెడ్డి నగర్ పారిశ్రామికవాడలో కమర్షియల్ అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు
- అధికారుల అండదండలతో వరుస అక్రమ నిర్మాణాలు జోరు
- అధికారుల సిబ్బంది నిర్వాహకంతో కొంపల్లి మున్సిపల్ ఆదాయానికి భారీ గండి

**నిజాంపేట్, మే 17 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం (సిఎంసి) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కొంపల్లి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. కొంపల్లి సర్కిల్ పరిధిలోని కొంపల్లి, దూలపల్లి, సుభాష్ నగర్, సాయిబాబా నగర్, డివిజన్లో పలు ప్రాంతాల్లో కేవలం పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల సిబ్బంది తీరుతెన్నుల నిర్వాహకం వల్లనే అనేక అక్రమ నిర్మాణాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలు, (అనుమతి లేని భవనాలు నిర్మాణాలు కొనసాగిస్తున్నారు) ఇటీవల నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ సృజన ఎంతో కొంత మార్పు కోసం చేస్తున్నప్పటికీ ఎప్పటికప్పటికీ చర్యలు తీసుకోవలసిన అధికారులు, సిబ్బంది కొంపల్లి మున్సిపాలిటీ పాత పద్ధతులను అనుసరిస్తున్నారు. సిఎంసి గా మారిన గత పాత తరహాలోనే వారు అక్రమ నిర్మాణదారుల పట్ల ఉదాసీనతతో వ్యవహరించడం పరిపాటైపోయింది సిఎంసిలో విలీనమై శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్న ప్రజల ఆకాంక్షకు టౌన్ ప్లానింగ్ విభాగం తూట్లు పొడుస్తున్నారని స్థానికుల ఆరోపించారు. కొంపల్లి సర్కిల్లో అక్రమ నిర్మాణాల చేపట్టి కార్పొరేషన్ ఆదాయానికి గండికొడుతున్నారని స్థానికులు వాపోయారు. కొంపల్లి సర్కిల్ లో ఎక్కడ చూసినా అనుమతులు లేని నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. అందుకే అధికారులు సిబ్బంది మౌనం ఆంతర్యం పట్ల బహిరంగంగానే ప్రజలే ముక్కు మీద వేలేసుకుంటున్నారు. అధికారులు అక్రమ నిర్మాణాల పట్ల కుమ్మక్కై సిఎంసి నిబంధనలకు త్రిలోదకాలు ఇస్తూ ఈ అక్రమ నిర్మాణాల కొనసాగింపేనని ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా పై అధికారులు ప్రజా ప్రయోజనాల కోసం కొంపల్లి అభివృద్ధి దృష్ట్యా మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టే చర్యలపై విచారణ చేపట్టి, చర్యలు తీసుకొని ప్రభుత్వాదాయాన్ని పెంచుకోవాలని మేధావులు సూచించారు. అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై, వారి పై అధికారులు చర్యలు తీసుకొని కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. ఓవైపు అనుమతిలేని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించపోమని ప్రభుత్వం చెపుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అది సాధ్యం కావడం లేదని స్పష్టంగా అనుమతి లేని భవనాలను చూస్తే కనిపిస్తుంది.



## జి ఎడవెల్లి విద్యార్థికి నగదు పురస్కారం



**కనగల్లు, మే 17 (జనం సాక్షి) :** ప్రజా పలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాల సందర్భంగా జాతీయస్థాయి లో నిర్వహించిన క్రీడా పోటీలను ప్రతిభ కనబరిచిన జీ ఎడవెల్లి హై స్కూల్ విద్యార్థి నీ పరసనబోయిన దీక్షితను జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, డీఈవో బిక్షపతి లు అభినందించి 10 వేల రూపాయల నగదు పురస్కారాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలలో సాధించిన విజయం వ్యక్తిగత గౌరవమే కాకుండా విద్యనభ్యసించిన పాఠశాలకు, గురువులకు, జిల్లాకు, సమాజానికే గర్వకారణమన్నారు. భవిష్యత్తులో నీవు ఏమి కావాలనుకుంటున్నామని దీక్షితను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నీ సన్మానం తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో ఎంఈఓ పద్మ హెచ్‌ఎం విజయలక్ష్మి ఫిజికల్ డైరెక్టర్ నారాయణ కవిత తదితరులున్నారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన బీజేపీ ఇంచార్జి నివేదిత రెడ్డి

- కోయగురోని బావి గ్రామాభివృద్ధికి వినతి పత్రం సమర్పణ



**గుర్రంపోడు, మే 17 (జనంసాక్షి) :** నాగార్జున సాగర్ నియోజకవర్గ పరిధిలోని గుర్రంపోడు మండలం కోయగురోని బావి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఆదివారం హైదరాబాద్‌లోని కేంద్ర మంత్రి స్వగృహంలో నాగార్జున సాగర్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి కంకణాల నివేదిత రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కోయిగూరోనిబావి గ్రామపంచాయతీ పరిధిలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల గురించి మంత్రికి వివరించారు. గ్రామంలో చేపట్టాల్సిన అత్యవసర పనులను వినతి పత్రంలో పొందుపరిచారు. దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మామిడి వినోద్ కుమార్, చింతరెడ్డి భాస్కర్ రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దైద గిరిధర్ రెడ్డి, చింతరెడ్డి వినోద్ రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ముసుగు పృథ్వి తదితర ముఖ్య నాయకులు, కోయగురోని బావి గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా జిల్లా స్థాయి విద్యా విజయోత్సవం

**సూర్యాపేట ప్రతినిధి, మే 17 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు సందర్భంగా కలెక్టరేట్ లో జిల్లా స్థాయి విద్యా విజయోత్సవం సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.పదవ తరగతి, ఇంటర్మీడియట్, క్రీడా విభాగాల్లో రాష్ట్ర, జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ప్రతి విభాగంలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ.10 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్య యొక్క ఆవశ్యకతను గుర్తించి, భవిష్యత్తులో వచ్చే ఆధునిక అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.మారుతున్న సమాజానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని, క్రమశిక్షణ, ఏకాగ్రతతో కూడిన పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు పాఠశాల విద్యాశాఖను అభినందించారు.ఇదే ఉత్సాహంతో వచ్చే విద్యా సంవత్సరానికి గానూ బడిబాట కార్యక్రమంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కనీసం 10 శాతం కొత్త అడ్మిషన్లను పెంచేలా ఉపాధ్యాయులందరూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, డీఐఈఓ సులోచన రాణి, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, సూర్యనారాయణ, పూలన్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వనమాల వెంకటేశ్వర్లు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి జిల్లా కలెక్టర్ ఘన సన్మానం



**చింతలపాలెం, మే 17 (జనంసాక్షి) :** చింతలపాలెం మండలం,దొండపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో 8వ తరగతి చదువుకుం టున్న గుగులోతు కావ్యశ్రీ క్రీడారంగంలో ఎంతో ప్రతిభను కనబరిచి సూర్యాపేట జిల్లా నుంచి మొట్టమొదటిసారిగా సాఫ్ట్ బాల్ నేషనల్ కు ఎంపిక అయ్యి ఢిల్లీలో ఆడి వచ్చిన విద్యార్థిని కావ్యశ్రీ కి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తిరె డ్డి,పిఈటి క్రాంతి కుమార్ విద్యార్థిని తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలమైన తాగునీటి నల్లకు మరమ్మతులు



**సంస్థాన్ నారాయణపురం, మే 17 (జనం సాక్షి) :** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ 13వ వార్డులో శిథిలమైన మంచినీటి నల్ల చుట్టూరా హౌస్ నిర్మాణం పనుల ను సంస్థాన్ నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ఆదేశానుసారంగా చాలా రోజుల నుండి తుప్పుపట్టి నీళ్లు వృధాగా పోతున్న మంచి నీటి నల్లని మరమ్మతులు చేయుటకు పనులు చేపట్టడం జరిగింది. చెత్త చెదారం పిచ్చి మొక్కలు ఉండకుండా చుట్టూరా హౌస్ నిర్మించి నీళ్లు నిలవకుండా మురికి చేరకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పనులు చేయటం జరిగింది. కాలనీలో సిసి రోడ్లు పూర్తి స్థాయిలో పూర్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మందుగుల బాలకృష్ణ, గుండమల్ల మల్లేష్ కట్ట గాలయ్య, వలిగొండ రాములు, వలిగొండ పెద్ద రాములు, మందుగుల శ్రీనివాసులు, మందుగుల గంగయ్య, ఈసం శివకుమార్,గుండమల్ల అశోక్, ఏము సాయి, ఏర్పుల సైదులు, గుండమల్ల అంజయ్య, వలిగొండ అండాలు, గుండమల్ల స్వరూప,గుండమల్ల అంజమ్మ, మందుగుల లక్ష్మమ్మ, ఏము భారతమ్మ, గుండమల్ల సరిత, మాజీ ఎంపీటీసీ మందుగుల సత్యలక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు ఈసం కౌసల్య, కట్ట లయమాధురి, ఈసం ప్రియాంక, గుండమల్ల అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## వలస కూలీ మృతి



**కనగల్లు, మే 17 (జనం సాక్షి) :** మండలంలోని ధర్వేశిపురం బ్రిడ్జి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలంలో శనివారం రాత్రి వలస కూలి మృతి చెందాడు. ఒంగోలు జిల్లా ఉప్పలపాడు గ్రామానికి చెందిన బెంజిమెన్ నల్లగొండ పట్టణంలో తాపీ పనులు చేస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నాడు. శనివారం రోజు పనులు ముగించుకొని సాయంత్రం ధర్వేశిపురం గ్రామానికి చేరుకొని రాత్రి సమయం కాగానే బ్రిడ్జి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలంలో మద్యం సేవించి నిద్రించాడు. ఆదివారం రోజు ఉదయంనే అటువైపు నుంచి వెళుతున్న స్థానికులు పొలంలో పడి ఉన్న వ్యక్తి దగ్గరికి వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెందాడని గమనించారు. ఈ సమాచారాన్ని పోలీసులకు స్థానికులు చేరవేశా రు. సంఘటన స్థలముకు చేరుకున్న పోలీసులు పక్కనే ఉన్న రెండు సెల్ ఫోన్లు గమనించి అందులో ఒక సెల్ ఫోన ఆన్ చేసి అందులో ఉన్న నెంబర్కు ఫోన్ చేసి మృతుడి వివరాలను సేకరించడంతోపాటు,బెంజిమాన్ అను వ్యక్తి మృతి చెందాడని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలం కు చండూరు సిఐ రాము సిబ్బందితో అక్కడికి చేరుకొని వివరాలను నమోదు చేసుకొని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# నాయుడుపేటలో స్మశానవాటిక సమస్యపై గ్రామస్థుల ఆందోళన

- గ్రామ పెద్దల అత్యవసర సమావేశంలో కీలక తీర్మానం

**ఖమ్మం రూరల్, మే 17 (జనం సాక్షి) :** ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట గ్రామంలో స్మశానవాటిక సమస్య తీవ్రరూపం దాల్చింది. గ్రామ ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా ఉపయోగపడుతున్న స్మశానవాటిక మున్నేరు వద్ద ఆర్‌సిసి గోడ నిర్మాణంతో పూర్తిగా తొలగించబడటంతో గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆదివారం నాయుడుపేట గ్రామం లో గ్రామ పెద్దలు, యువకులు మరియు పలువురు గ్రామస్థులు అత్యవసర సమావేశం నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామంలో స్మశానవాటిక లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశంలో పలువురు గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక స్థలం సమస్య కాదని, గ్రామ ప్రజల భావోద్వేగాలకు, సంప్రదాయాలకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ నాయుడుపేట గ్రామానికి తక్షణమే ప్రత్యామ్నాయ స్మశానవాటిక స్థలం కేటాయించాలని ప్రభుత్వ అధికారులను కోరాలని నిర్ణయించారు. ఈ మేరకు మండల రెవెన్యూ అధికారి ,రెవెన్యూ డివిజనల్ అధికారి మరియు ఎదులాపురం మున్సిపాలిటీ కమిషనర్‌లకు సోమవారం కలిసి వినతి పత్రం అందజేయనున్నారు. గ్రామ ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని శాశ్వత పరిష్కారం చూపాలని, స్మశానవాటిక కోసం తగిన ప్రభుత్వ స్థలాన్ని వెంటనే గుర్తించి కేటాయించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.అధికారులు త్వరితగతిన స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.




# ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

- 8 తులాల బంగారు ఆభరణాలు, 90 వేలు నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన దేవరకొండ డిఎస్పి శ్రీనివాస్ రావు

**కొండమల్లేపల్లి, మే 17 (జనంసాక్షి) :** రాత్రి వేళల్లో ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 8 తులాల బంగారు ఆభరణాలు, 90 వేలు నగదు చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం దేవరకొండ డిఎస్పి కార్యాలయంలో డిఎస్పి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం చోరీలకు పాల్పడుతున్న నిందితుడు దాసరి విజయ్ (36) రామ్ రెడ్డి పేట, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి 12 తులాల బంగారం, లక్షా 80 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనం ఒక సెల్ ఫోన్ దొంగిలించాడు. కొండమల్లేపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కర్రే ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ఆదివారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని పెండ్లిపాకల ఎక్స్ రోడ్డులో ఎస్ఐ అజ్మీరా రమేష్ పోలీస్ సిబ్బందితో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక ద్విచక్ర వాహనం ఆపి ఆ వాహనం యొక్క పేపర్లు ఆ వ్యక్తిని అడగగా అతడు పేపర్లు చూపించకపోగా సరైన సమాధానం చెప్పకుండా అక్కడనుండి పారిపోతుండగా ఎస్ఐ చాకచక్యంతో ఆ వ్యక్తిని పట్టుకున్నారు. ఆ వ్యక్తిపై అనుమానంతో లోతుగా విచారించగా అతడు చేసిన దొంగతనాలను ఒప్పుకున్నాడు. నిందితుడు దాసరి విజయ్ తాళం వేసిన ఇళ్లను ఎంచుకొని వరుస దొంగతనాలకు పాల్పడుతున్నాడు. కొండమల్లేపల్లి లో నాలుగు దొంగతనాలు, దేవరకొండలో ఒకటి, చింతపల్లిలో ఒకటి, కల్వకుర్తిలో రెండు మొత్తం ఎనిమిది దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. ఈ సమయంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలిందని డీఎస్పీ తెలిపారు. దొంగతనాల కేసును చేదించిన సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్, క్రైమ్ సిబ్బంది హేము నాయక్, భాస్కర్, కృష్ణారెడ్డి, పిసి నవీన్ కుమార్, రైటర్ శేఖర్ రెడ్డిలను ఎస్పి శరత్ చంద్ర పవర్, డీఎస్పీ శ్రీనివాస్ రావులు ప్రత్యేకంగా అభినందించి రివార్డును ప్రకటించారు.



## యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



**యాదగిరిగుట్ట, మే 17 (జనంసాక్షి) :** వేసవి సెలవులతో పాటు, ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి ఆలయానికి విచ్చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది.ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు మూడు గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు గంటన్నర సమయం పట్టింది. ఆర్జిత సేవలు,నిత్యా పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు భక్తులు. రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. నిత్యా కల్యాణం, లడ్డు ప్రసాదం కౌంటర్లు, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండక్రింద కల్యాణ కట్ట, పుష్కరిణి, వాహనాల పార్కింగ్ వద్ద భక్తుల సందడి నెలకొంది. కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు వద్ద వాహనాలు బారులు తీరాయి.




# ప్రతికూలతల్లోనూ సెన్సెక్స్‌పై బులిష్‌గానే

- 12 నెలల్లో 89,000 స్థాయికి చేరొచ్చని అంచనా
- ‘బుల్’ పరుగెడితే లక్ష పాయింట్లకూ

బుల్ పరుగు పెడితే: సెన్సెక్స్ 1,00,000 పాయింట్ల స్థాయికి(చమురు బ్యారెల్ ధర 80 డాలర్లలోపు ఉండాలి) బేర్ పట్టు ఉంటే: సెన్సెక్స్ 66,000కు పరిమితం కావొచ్చు(చమురు అధిక ధరలు ఎక్కువ కాలం కొనసాగితే) అంతర్జాతీయంగా అనిశ్చితులు రాజ్యమేలుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధ మేఘాలింకా వీడ లేదు. చమురు ధరల సెగ చల్లారనేలేదు. ఈ ప్రభావం దేశీయ కార్పొరేట్ కంపెనీలు ఆర్థిక ఫలితాలపై కనిపిస్తోంది. భవిష్యత్‌లోనూ ఉంటుందన్న అంచనాలున్నాయి. ఇన్ని ప్రతికూలతల మధ్య భారత స్టాక్ మార్కెట్లు బేరిష్ ధోరణిలో సాగుతాయని పలు అంతర్జాతీయ బ్రోకరేజీలు అంటున్నా, మన సూచీలు రాణించొచ్చని అమెరికా కేంద్రంగా పనిచేసే బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేస్తోంది. ఎందుకు? 2027 జూన్ నాటికి అంటే రాబోయే 12 నెలల్లో బీఎస్ఈ సెన్సెక్స్ 89,000 పాయింట్లకు చేరొచ్చని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేస్తోంది. సాంకేతిక బలాలకు తోడు భారత్‌లో మధ్యకాల వృద్ధిపై మంచి విశ్వాసం ఉందని, విధానాల పరంగానూ సానుకూలతలు కనిపిస్తున్నాయని ఈ సంస్థ ఈక్విటీ స్ట్రాటజిస్ట్ రిధమ్ దేశాయ్ అంటున్నారు. ఈ ప్రాథమిక అంచనాకు 50% సంభావ్యత ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం సెన్సెక్స్ 74,600 పాయింట్ల స్థాయుల్లో



కదలాడుతోంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల సమయంలోనూ రాణించగలిగే సత్తా భారత మార్కెట్‌కు ఉందని, ‘డిఫెన్సివ్ గ్రోత్ మార్కెట్’గా భారత్‌ను సంస్థ అభివర్ణించింది. ఇందుకు కారణాలనూ చెబుతోంది. గత ఆరు త్రైమాసికాల మందగమనం తర్వాత, కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు పుంజుకోవచ్చని అంటోంది. ఇందుకు ఆర్‌బీఐ రేట్ల కోతలు, బ్యాంక్ డీరెగ్యులేషన్, ద్రవ్యలభ్యత జొప్పించడం, ఇంధన, రక్షణ, సెమీకండక్టర్, ఎరువులు, డేటా సెంటర్ల వంటి రంగాల్లో బలమైన మూలధన పెట్టుబడులు వస్తుండడం, పన్ను కోతలు.. ఇవన్నీ కలిసి కంపెనీల ఫలితాలకు దన్నుగా నిలవవచ్చని చెబుతోంది. దేశీయంగా బలమైన వృద్ధి, అంతర్జాతీయంగా స్థిరమైన వృద్ధికి తోడు ప్రస్తుత స్థాయుల నుంచి చమురు ధరలు తగ్గొచ్చన్న తమ ఊహలకు అనుగుణంగా ఈ అంచనాలను వెలువరించింది. ఇక 2009 నుంచీ అంతర్జాతీయ లాభాల్లో భారత వాటా తన అంతర్జాతీయ ఇండెక్స్ వెయిట్‌కు మించి ఉంటోందనీ చెప్పింది. కృత్రిమ మేధ(ఏఐ) కారణంగా భారత ఐటీ సేవల ఎగుమతులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇదే ఈక్విటీ మార్కెట్‌కు అత్యంత సవాలు విసిరే అంశం. అయితే రాబోయే దశాబ్దంలో జీడీపీలో తయారీ వాటా పెరగనుండడం ఊరట కలిగించే అంశం. భారత్‌లో పెరుగుతున్న వినియోగదార్ల సంఖ్య, ఆదాయ పెరుగుదల, యువ జనాభా వంటివీ కలిసిరావొచ్చు. 2025లో అంతర్జాతీయ జీడీపీ వృద్ధిలో భారత వాటా 18 శాతంగా ఉంది. రాబోయే రోజుల్లో ఇది మరింత పెరగవచ్చు. భారత్‌కు ఏవైనా సవాళ్లు వస్తే అవి బయటి నుంచే మినహా దేశీయంగా ఏమీ ఉండవని అంటోంది. ముఖ్యంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ వృద్ధి మందగమనం రూపంలో సవాళ్లు ఎదురుకావొచ్చని అంచనా వేస్తోంది. భారత ఈక్విటీల రేటింగ్‌ను హెచ్‌ఎస్‌బీసీ గత నెలలో తగ్గించింది. ద్రవ్యోల్బణ భయాలకు తోడు గిరాకీ, కార్పొరేట్ లాభదాయకతపై ఒత్తిడిని కారణంగా చూపుతూ ‘అండర్‌వెయిట్’ రేటింగ్‌ను ఇచ్చింది. యూబీఎస్, నొమురా, సిటీ, గోల్డ్‌మన్ శాక్స్.. ఇలా పలు అంతర్జాతీయ సంస్థలు భారత స్టాక్ మార్కెట్లపై అప్రమత్తతను ప్రకటించాయి. పెరుగుతున్న ముడి చమురు ధరలు కార్పొరేట్ ఫలితాలపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నాయి. ద్రవ్యోల్బణం, కరెంట్ ఖాతా లోటు పెరుగుతాయని అంచనా వేసింది.


## అప్పుడు మ్యాగీ.. ఇప్పుడు కిట్‌క్యాట్.. నెస్లేకు మనదే పెద్ద మార్కెట్

దిల్లీ: నెస్లేకు చెందిన చాక్లెట్ కోటెడ్ వేఫర్ బార్ కిట్‌క్యాట్‌కు భారత్ అతిపెద్ద మార్కెట్‌గా అవతరించింది. గడిచిన రెండు మూడేళ్లుగా రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్.. తాజాగా మొదటి స్థానానికి చేరింది. అంటే 85 దేశాల్లో ఈ చాక్లెట్ అమ్ముడవుతుండగా.. అత్యధికంగా విక్రయమయ్యేది మాత్రం మన దేశంలోనే అన్నమాట. వినియోగదారుల నుంచి డిమాండ్, చాక్లెట్‌లో కొత్త ఆవిష్కరణలు, మార్కెటింగ్‌పై పెద్దమొత్తంలో ఖర్చు చేయడం వంటివి ఇందుకు దోహదం చేశాయని నెస్లే తెలిపింది. గడిచిన కొన్నేళ్లుగా నెస్లే కిట్‌క్యాట్‌కు దేశీయంగా మార్కెట్ వాటా క్రమంగా పెరుగుతూ వస్తోందని నెస్లే ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనీశ్ తివారీ అన్నారు. నెస్లే విక్రయించే మ్యాగీకి ఇప్పటికే భారత్ అతిపెద్ద మార్కెట్ కాగా.. ఇప్పుడు కిట్‌క్యాట్ కూడా ఆ జాబితాలో చేరింది. దశాబ్దం క్రితం కిట్‌క్యాట్ మార్కెట్ పరంగా భారత్ పదో స్థానంలో ఉండేది. నెస్లేకు వచ్చే ఆదాయంలో కిట్‌క్యాట్ నుంచి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. అటు విలువ పరంగా, సంఖ్యా పరంగా రెండంకెల వృద్ధి నమోదు చేస్తోందని తివారీ పేర్కొన్నారు. భారత్ తర్వాత జపాన్, బ్రెజిల్, యూరప్ కిట్‌క్యాట్‌కు అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నాయని కంపెనీ తెలిపింది. కిట్‌క్యాట్ సెలబ్రేక్, కిట్‌క్యాట్ పాప్స్ వంటి ప్యాక్స్‌తో గిఫ్టింగ్ సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టామని నెస్లే ఇండియా డైరెక్టర్ జగదీశన్ గోపీ చందర్ ఈ సందర్భంగా తెలిపారు. కిట్‌క్యాట్ డిలైట్స్ పేరుతో ప్రీమియం సెగ్మెంట్‌లోకీ ఎంట్రీ ఇవ్వడం కలిసొచ్చిందని తెలిపారు. ప్రకటన వ్యయం పెంచడం, డిస్‌ప్లే వినియోగించే కమర్షియల్ గ్లాస్ డోర్ రిఫ్రిజిరేటర్ల ప్రోగ్రామ్ కూడా కిట్‌క్యాట్ వృద్ధికి దోహదం చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఏటా మ్యాగీ 5 బిలియన్ సర్వ్‌లు విక్రయమవుతున్నట్లు కంపెనీ తెలిపింది.

# హైదరాబాద్‌లో 25% పెరిగిన ఇళ్ల విక్రయాలు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రధాన నగరాల్లో ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో ఇళ్ల విక్రయాలు 2 శాతం మేర తగ్గాయి. మార్కెట్‌లో గిరాకీ మందగించడం, అందుబాటు ధరల ఇళ్ల సరఫరా తగ్గడమే ఇందుకు కారణమని స్థిరాస్తి సేవల సంస్థ ప్రాప్‌టైగర్ వెల్లడించింది. ఈ మూడు నెలల కాలంలో మొత్తం 95,973 యూనిట్లు అమ్ముడవ్వగా, 2025 ఇదే కాలంలో వీటి సంఖ్య 98,095గా ఉంది. హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, దిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా, ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్, పుణెలను ఈ నివేదిక కోసం పరిశీలించింది. హైదరాబాద్‌లో గత ఏడాది మార్చి త్రైమాసికంలో 10,647 ఇళ్లు అమ్ముడవగా, ఈసారి 25 శాతం పెరిగి 13,297 యూనిట్లకు చేరుకున్నాయి. బెంగళూరులో 15,603, చెన్నైలో 4,774 యూనిట్లు అమ్ముడైనట్లు ప్రాప్‌టైగర్ పేర్కొంది. కొత్తగా మార్కెట్లోకి వస్తున్న ఇళ్ల సంఖ్య, అమ్ముడవుతున్న వాటికి దాదాపు సరిపోలుతుండటంతో అమ్ముడుపోని ఇళ్ల సంఖ్య పెద్దగా లేదని నివేదిక వివరించింది.






# వడ్డీ రేట్లు వెంటనే పెరగకపోవచ్చు

**పసిడి రుణాలు పెరుగుతున్నాయి**
**కరూర్ వైశ్యా బ్యాంక్ ఎండీ, సీఈఓ రమేష్ బాబు**



హైదరాబాద్: ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి నెలకొన్నప్పటికీ, వెంటనే కీలక వడ్డీ రేట్లు పెరగకపోవచ్చని కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), సీఈఓ బి.రమేష్ బాబు అన్నారు. వృద్ధి ఆధారిత పనితీరు, ఆస్తుల నాణ్యత, లాభదాయకత ఈ మూడింటిపైనే బ్యాంకుల మనుగడ ఆధారపడి ఉంటుందని తెలిపారు. బంగారం రుణాలు, డిపాజిట్లు తదితరాల గురించి తన అభిప్రాయాలను ఇలా పంచుకున్నారు. రాబోయే 3-6 నెలల వరకూ ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచకపోవచ్చు. ఒకవేళ పశ్చిమాసియాలో యుద్ధం సద్దుమణిగితే, రేట్లు పెంచాల్సిన అవసరం రాదు. ద్రవ్యోల్బణం వల్ల ఒకపక్క ప్రజలు ఇబ్బంది పడుతుంటే, అప్పులపై వడ్డీ పెరిగితే, వారి కొనుగోలు శక్తి పూర్తిగా పడిపోతుంది. తద్వారా ఎఫ్‌ఎంసీజీలాంటి రంగాల్లో గిరాకీ దెబ్బతిని, దేశ వృద్ధిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. రాబోయే ఏడాది కాలంలో పసిడి రుణాలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుంది. ఇటీవల బంగారం ధరలు విపరీతంగా పెరగడంతో చాలామంది తమ పాత రుణాలను తీర్చేసి, బంగారాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ఇప్పుడు ఆ బంగారాన్ని మళ్లీ రుణం కోసం బ్యాంకులకు తెస్తున్నారు. ప్రస్తుత యుద్ధం, ఇతర కారణాల వల్ల ఎంఎస్‌ఎంఈలకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు కాస్త ఆలోచిస్తున్నాయి. సురక్షితమైన పసిడి రుణాల మీద ఎక్కువగా దృష్టి పెడుతున్నాయి. మా మొత్తం రుణాల్లో ఈ రుణాల పోర్ట్‌ఫోలియో సుమారు రూ.29,000 కోట్లు ఉంది. ఇది దాదాపు 30 శాతం. 110 ఏళ్ల బ్యాంకు చరిత్రలో గత ఆర్థిక సంవత్సరం గరిష్ఠంగా రూ.2,510 కోట్ల వార్షిక లాభాన్ని ఆర్జించింది. వృథా ఖర్చులకు కళ్లెం వేసి, నిర్వహణ వ్యయాన్ని 2.25% నుంచి 2.18% తగ్గించగలిగాం. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం పడుతుందేమోనని నాలుగో త్రైమాసికంలో రూ.163 కోట్లను పక్కనపెట్టాం. మొండి బాకీల వసూలు కోసం ప్రత్యేక బృందాలను నియమించడంతో నికర ఎన్‌పీఏలు గణనీయంగా తగ్గి, 0.19 శాతానికి దిగివచ్చాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 20కి పైగా కొత్త శాఖలను ప్రారంభించబోతున్నాం. వీటిని కొత్త జిల్లా కేంద్రాల్లో ఎక్కువగా ఏర్పాటు చేస్తాం. ముఖ్యంగా ఎంఎస్ ఎంఈలు, వ్యవసాయదారులు, చిన్న డిపాజిట్‌దారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలను ముఖ్యంగా ఎంఎస్ ఎంఈలు, వ్యవసాయదారులు, చిన్న డిపాజిట్‌దారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలనుఅందించడమే మా లక్ష్యం. నిజమే. యువత ఎక్కువగా మ్యూచువల్ ఫండ్లవంటి పెట్టుబడుల వైపు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త డిపాజిట్లు సేకరించడం భారమవుతోంది. మా ఖాతాదారుల పొదుపు ఖాతాల్లో ఉన్న డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్లవైపు మళ్లిస్తున్నాం. ఖాతాదారులను నేరుగా కలిసి ఖాతాలు తెరిపించడంలాంటివి చేస్తున్నాం. డిపాజిట్ల వ్యయం పెరుగుతున్నందున 2026-27లో మా నికర వడ్డీ మార్జిన్‌పై కాస్త ప్రభావం కనిపించవచ్చు.

# వర్క్‌ఫ్రం హోం..కార్ పూలింగ్

**ఇంధన పొదుపునకు దిల్లీ చర్యలు**




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో సంక్షోభం నెలకొన్న వేళ ఇంధన వాడకాన్ని తగ్గించాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇంధన పొదుపునకు దిల్లీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రైవేట్ కంపెనీలు, సంస్థలు వారంలో రెండు రోజుల వర్క్-ఫ్రమ్-హోమ్ విధానాన్ని అమలు చేయాలని, ఆఫీస్ సమయాల్లో మార్పులు చేయాలని, ఉద్యోగులు కార్ పూలింగ్ పద్ధతిని అవలంబించాలని సూచించింది. ఇందుకు సంబంధించి దిల్లీ కార్మికశాఖ ఆదివారం అడ్వైజరీ జారీచేసింది. దేశ రాజధానిలో రోజువారీగా అధిక మొత్తంలో ఇంధన వినియోగానికి ఆఫీస్‌లకు రాకపోకలు సాగించడమే కారణమని దిల్లీ ప్రభుత్వం భావిస్తోంది. ఒకవేళ ఇంటి నుంచే పని చేసుకునే వెసులుబాటు కల్పించడం వల్ల ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని తాజా అడ్వైజరీలో పేర్కొంది. ఉద్యోగులు ప్రజా రవాణా వ్యవస్థలను, కార్ పూలింగ్ పద్ధతులను వినియోగించాలని సూచించింది. ఆన్‌లైన్‌లో సమావేశాలు నిర్వహించుకోవడం ద్వారా ప్రయాణ ఖర్చులు తగ్గించుకోవచ్చని సూచించింది. ఆసుపత్రులతోపాటు ఇతర వైద్య, ఆరోగ్య సంస్థలు, విద్యుత్, నీరు, పారిశుద్ధ్యం, మున్సిపల్ తదితర సర్వీసులు ఈ అడ్వైజరీ పరిధిలో లేవని దిల్లీ కార్మికశాఖ తెలిపింది. మరోవైపు, ‘మేరా భారత్, మేరా యోగ్‌దాన్’ పేరుతో ఇటీవల ఓ కార్యక్రమాన్ని ప్రారంభించిన దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా.. ప్రైవేటు రంగం కూడా ఈ పొదుపు చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ఇంధన పొదుపు ప్రాముఖ్యతపై ఉద్యోగులకు అవగాహన కల్పించాలని యాజమాన్యాలను కోరారు.

## అమ్మకు దూరమై.. రాక్షసుడి చేతిలో బందీయై..

**యూఎస్‌లో చిన్నారి దయనీయ మరణం**



సరైన పత్రాలు లేని కారణంగా ఇమ్మిగ్రేషన్ అధికారులు కొన్ని నెలల క్రితం హోండురాస్ దేశానికి చెందిన వెన్డీ హెర్నాండెజ్ రేయెస్ అనే మహిళను అమెరికా నుంచి బహిష్కరించారు. అయితే ఆమె మూడేళ్ల కుమారుడు ఓర్లిన్ జోసు హెర్నాండెజ్ రేయెస్‌కు పాస్‌పోర్ట్ లేకపోవడంతో అతడిని తీసుకువెళ్లడానికి ఆమెకు అనుమతివ్వలేదు. తన కుమారుడు అనాథ అయిపోతాడని ఆమె ఎంత మొరపెట్టుకున్నా అధికారులు వినలేదు. దీంతో వేరే అవకాశం లేక ఆమె తన కుమారుడిని ఫ్లోరిడాలోని తమ బంధువు మాల్డోనాల్డో దగ్గర వదిలి వెళ్లింది. కాగా మాల్డోనాల్డో అనే వ్యక్తి చిన్నారిని రెండు నెలలపాటు చిత్రహింసలకు గురి చేశాడు. దీంతో ఆ చిన్నారి దయనీయ స్థితిలో ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. పోస్ట్ మార్టంలో బాలుడి పక్కటెముకలు విరిగిపోయాయని, లైంగిక వేధింపులకు గురయ్యాడని తేలింది. చిన్నారి శరీరంపై అనేక కాలిన గాయాలు కూడా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. చిన్నారి మరణించిన ఘటనపై అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు స్పందిస్తూ.. హెర్నాండెజ్ తన కుమారుడిని వేరే వ్యక్తి వద్ద వదిలి వెళ్లినందువల్లే ప్రాణాలు కోల్పోయాడని నిందించారు. చిన్నారిని తీసుకువెళ్లడానికి తాము అనుమతిచ్చినప్పటికీ ఆమెతో పాటు తీసుకువెళ్లలేదని ఆరోపించారు. దీనిపై హెర్నాండెజ్ స్పందిస్తూ.. ఇమ్మిగ్రేషన్ అధికారులు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. 2022లో యూఎస్‌కు వలస వచ్చిన తాను నాటి నుంచి అక్కడే స్థిరపడ్డానని తెలిపారు. ఎంతో గారాబంగా పెంచుకుంటున్న తన కుమారుడిని తనకు దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారిని తనతో పాటు పంపాలని ఎంత వేడుకున్నప్పటికీ అధికారులు అంగీకరించలేదని పేర్కొన్నారు. ఇప్పుడు వారి తప్పు కప్పిపుచ్చుకోవడానికి తనపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై ఫ్లోరిడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రేయసితో లగ్జరీ డేట్‌నైట్..

**మరో వివాదంలో కాశ్‌పటేల్..!**

**వాషింగ్టన్:** అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్, భారత సంతతి నేత కాశ్ పటేల్ చుట్టూ వివాదాలు ముసురుకొంటున్నాయి. వ్యక్తిగత ప్రయాణాలకు ప్రభుత్వ నిధులు వినియోగిస్తున్నారనే ఆరోపణలపై పటేల్ ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో గతేడాది తన ప్రియురాలితో కలిసి వెళ్లిన లగ్జరీ డేట్ నైట్‌కు సంబంధించిన వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. ఆ పర్యటనకు కూడా పటేల్ ప్రభుత్వ నిధులు ఉపయోగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మీడియా కథనాల ప్రకారం.. కాశ్ పటేల్ తన ప్రేయసి అలెక్సిస్ విల్‌కిన్స్‌తో కలిసి గతేడాది మే 10న ఎఫ్‌బీఐకి చెందిన జెట్‌లో ఫిలడెల్ఫియాలో జరిగిన ఒక కాన్సర్ట్‌కి వెళ్లారు. అక్కడ 50వేల డాలర్ల (భారత కరెన్సీలో రూ. 47 లక్షలకు పైగా) ఒక ప్రైవేట్ సూట్‌ను అద్దెకు తీసుకొని.. అందులోంచి కాన్సర్ట్‌ని వీక్షించారు. వారు ఆ కాన్సర్ట్ నుంచి వెళ్లే వరకు విమాన, భద్రతా సిబ్బంది రాత్రి 11 గంటల వరకు అక్కడే విధుల్లో ఉండాల్సి వచ్చింది. ఇందుకోసం వారు అదనపు జీతం కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ విషయాలు తీవ్ర చర్చకు దారి తీశాయి. కాగా.. ఆ లగ్జరీ సూట్‌కి డబ్బులు ఎవరు చెల్లించారనే విషయంపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించేందుకు కాశ్‌పటేల్ నిరాకరించారు. ఇదిలాఉండగా.. ఇటీవల పెర్ల్ హార్బర్‌లోని యూఎస్ఎస్ ఆరిజోనా స్మారక చిహ్నంసమీపంలో కాశ్ పటేల్ రహస్యంగా వీఐపీ స్నార్కెల్ జరపడంపై విమర్శలు వచ్చాయి. అయితే, స్నార్కెలింగ్ కార్యక్రమం ఒక అధికారిక పర్యటనలో భాగమని ఎఫ్‌బీఐ ప్రతినిధి ఒకరు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ముందు ప్రేయసి కాన్సర్ట్‌ను చూసేందుకు 60 మిలియన్ డాలర్ల విలువైన ప్రభుత్వ విమానంలో ప్రయాణించడంతో సహా విల్‌కిన్స్ కోసం కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లు చేయడం వంటి ఆరోపణలు ఆయనపై ఉన్నాయి.



# రంగు నుంచి నీరొచ్చె..

## ఇంటిని చల్లబరిచి, నీటిని ఉత్పత్తి చేసే కొత్త పెయింట్

**న్యూఢిల్లీ:** ఒక పక్క భూతాపం పెరుగుతోంది. మరోపక్క నీటి కొరత ఉద్ధృతమవుతోం ది. ఈ రెండు సమస్యలకు ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు ఒకే విరుగుడు కనుగొన్నారు. వీరు ఒక పెయింట్‌ను అభివృద్ధి చేశారు. అది భవనాలను చల్లబర్చడంతోపాటు గాలి నుంచి నీటిని సేకరిస్తుంది. పరిశోధకుల మెదడులో మెరిసిన ఈ ఆలోచన డ్యూపాయింట్ ఇన్నోవేషన్స్ అనే అంకుర పరిశ్రమగా ఆవిర్భవించింది. సాధారణ శీతల పెయింట్‌కు మరింత ఆధునిక సొబగులు అద్దడానికి అవసరమైన ఆవిష్కారాలు చేయాలన్నది దీని లక్ష్యం. నగరాల్లోని ఇళ్ల పైకప్పులన్నీ వేడిని పరావర్తనం చేస్తూ నీటిని ఒడిసిపడితే వాతావరణ సమస్యకు పెద్ద పరిష్కారం దొరికినట్లే! ఇప్పటికే నగరాల్లోని కాంక్రీటు, ఇళ్ల పైకప్పులు ఎక్కువగా సౌరశక్తిని శోషించుకుంటూ ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఫలితంగా మిగతా ప్రాంతాలతో పోలిస్తే అక్కడ వేడి ఎక్కువగా ఉంటోంది. దీనివల్ల విద్యుత్ వినియోగం పెరుగుతోంది. భవనాల్లో వేడిని తగ్గించడానికి ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు ప్రత్యేక పెయింట్ రూపొందించారు. నిజానికి ఇలాంటి ‘చల్లటి’ పెయింట్లు ఇప్పటికే ఉన్నాయి. అయితే వాటి సామర్థ్యం పరిమితం. తాజాగా పరిశోధకులు పాలీవినైలిడీన్ ఫ్లోరైడ్- కో-హెక్సాఫ్లోరోప్రోపీన్ (పీవీడీఎఫ్-హెచ్‌ఎఫ్‌పీ)తో రూపొందించిన ప్రత్యేక నానోపదార్థాలతో పెయింట్‌ను తయారుచేశారు. దీనితో వేసే పూత.. సూక్ష్మ రంధ్రాలతో ఉంటుంది. ఈ పెయింట్‌లో అతినీలలోహిత కాంతిని పరావర్తనం చెందించే టైటానియం డైఆక్సైడ్ వంటి పిగ్మెంట్లను వాడలేదు. అందువల్ల ఎక్కువకాలం మన్నుతుంది. మెరుగైన పనితీరునూ కనబరుస్తుంది. ఇది ప్యాసివ్ రేడియేటివ్ కూలింగ్ అనే ప్రక్రియ ఆధారంగా పనిచేస్తుంది. ఇది ఇంటిపైకప్పును తాకే సూర్యకాంతిలో ఎక్కువ భాగాన్ని పరావర్తనం చెందిస్తుంది. వేడిని తిరిగి ఆకాశంలోకి విడుదల చేస్తుంది. దీనివల్ల.. అదనంగా విద్యుత్‌ను వాడాల్సిన పనిలేకుండానే పరిసరాల్లోని గాలి కన్నా ఆ ఇంటిపైకప్పు 6 డిగ్రీల సెల్సియస్ మేర చల్లగా ఉంటుంది. ఫలితంగా భవనంలోపలికి ఎక్కువ వేడి ప్రవేశించదు. దీనివల్ల ఇంట్లో ఏసీలపై పెట్టే కరెంటు ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతమున్న ‘చల్లటి’ పెయింట్లు దాదాపు 70 శాతం మేర మాత్రమే సూర్యకాంతిని పరావర్తనం



చెందిస్తున్నాయి. డ్యూపాయింట్ పూత మాత్రం 96 శాతం వరకూ సౌరశక్తిని ఆకాశంలోకి తిరిగి పంపేస్తున్నట్లు ఆరు నెలల పాటు నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. నగరాల్లో ఉష్ణోగ్రతలకు చెక్ పెట్టడానికి ఇది ఆచరణయోగ్య ఆలోచన అని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పరిసరాల్లో వేడి ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో తక్కువ ఉష్ణోగ్రత ఉండే ఉపరితలంపై.. గాల్లోని తేమ కండెన్స్ అవుతుంది. ఇది చల్లటి గాజుపై నీటి బిందువులను ఏర్పరిచే ప్రాథమిక ప్రక్రియ లాంటిదే! ఈ సూత్రం ఆధారంగా తాజా పెయింట్‌తో శాస్త్రవేత్తలు నీటిని ఒడిసిపట్టారు. ఇలా ఉత్పత్తయ్యే నీటి పరిమాణం తక్కువేమీ కాదు. ప్రాథమిక ప్రయోగాల్లోనే ఈ పెయింట్ ద్వారా 200 చదరపు మీటర్ల పైకప్పు నుంచి రోజుకు 74 లీటర్ల నీటిని శాస్త్రవేత్తలు సేకరించారు. తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ బిందువులు ఎక్కువగా ఏర్పడతాయి. రాత్రివేళ తేమ అధికంగా ఉండే మెట్ట ప్రదేశాల్లోనూ ఈ పెయింట్‌తో ఎక్కువ నీటిని సేకరించొచ్చు.

## జీఎస్‌టీ, వ్యాట్ మోసం కేసులో ఇద్దరు అరెస్టు

దిల్లీ: జీఎస్‌టీ, వ్యాట్ మోసం కేసుతో సంబంధమున్న ఇద్దరిని ఎకనమిక్ అఫెన్సెస్ వింగ్ (ఈఓడబ్ల్యూ) అరెస్టు చేసింది. వ్యాపార వివరాల దుర్వినియోగం, నకిలీ సంస్థలు, పలు బ్యాంకు ఖాతాల నుంచి నిధుల మళ్లింపు ద్వారా కోట్ల రూపాయల జీఎస్‌టీ, వ్యాట్ అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఈ చర్యను చేపట్టినట్లు ఓ అధికారి తెలిపారు. ఈ ఇద్దరిలో ఒకరు చార్టర్డ్ అకౌంటెంట్ అతుల్ గుప్తా కాగా.. మరొకరు రాజీవ్ కుమార్ పరాసర్ అని ఈఓడబ్ల్యూ తెలిపింది. యశస్వి శర్మ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసులో వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌ను కూడా రిజిష్టర్ చేసినట్లు తెలిపింది. తన సంస్థకు చెందిన వ్యాట్, జీఎస్‌టీ వివరాలు, పత్రాలను తన ప్రమేయం లేదా అనుమతి లేకుండా మోసపూరితంగా వినియోగించి సుమారు రూ.28.40 కోట్ల విలువైన అనుమానాస్పద లావాదేవీలు జరిపారని తన ఫిర్యాదులో శర్మ తెలిపారు. ఫిర్యాదుదారు సంస్థకు చెందిన బ్యాంకు ఖాతాలను రాజీవ్ కుమార్ పరాసర్, మరో ప్రొప్రయిటర్ నిర్వహించారని, భారీగా నిధుల మళ్లింపునకు ఈ ఖాతాలను వాళ్లు ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలిందని ఈఓడబ్ల్యూ తెలిపింది. నకిలీ జీఎస్‌టీ రశీదులు, డొల్ల కంపెనీలను ఉపయోగించి రూ.128 కోట్ల జీఎస్‌టీ మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలపై ఆరుగురు వ్యక్తులను దిల్లీ పోలీస్‌కు చెందిన ఎకనమిక్ అఫెన్సెస్ వింగ్ అరెస్టు చేసింది.

## సీఎన్‌జీ ధర మరోసారి పెంపు

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీఎన్‌జీ ధరను కేంద్రం మరోసారి పెంచింది కిలో సీఎన్‌జీపై రూ.1 పెంచుతూ ఆదివారం ప్రకటన చేసింది. కాగా.. రెండ్రోజుల క్రితమే కిలో సీఎన్‌జీపై రూ.2 పెంచిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే మళ్లీ ధరను పెంచడం గమనార్హం. తాజా పెంపుతో దిల్లీలో కిలో సీఎన్‌జీ ధర రూ.80.09గా ఉంది. నొయిడా, ఘజియాబాద్‌లో రూ.88.70కు చేరింది. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. దీంతో ప్రభుత్వరంగ చమురు కంపెనీలపై ఉన్న ఆర్థిక ఒత్తిళ్లు తగ్గించేందుకు కేంద్రం ఇటీవల దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. లీటరు పెట్రోల్, డీజిల్‌పై సగటున రూ.3 పెరిగింది.

# ఫ్యూచర్ సిటీలో భూ కబ్జాలు...!

- బూత్ స్థాయి నాయకులు సైతం కబ్జాలు...?
- అసైన్డ్, భూదాన్, సీలింగ్ భూములు మాయం...!
- భూమి అమ్మినవారే తిరిగి యాజమానులుగా మారారు
- భూమి స్వభావంలో తప్పులు..
- ఇబ్బందులు పడుతున్న భూ యాజమానులు



**మహేశ్వరం, మే 17 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని గ్రామాలల్లో మహేశ్వరం, ఇబ్రాహీంపట్నం,కల్వకుర్తి నియోజకవర్గాలలో భూ కబ్జాలు రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్రధానంగా మహేశ్వరం నియోజకవర్గంలోని బండగ్ పేట్, బాలాపూర్,మహేశ్వరం, కందుకూరు మండలాలల్లో అసైన్డ్ మెంట్,భూదాన్, సీలింగ్, ఇనామ్,చెరువు శిఖం,వాగులను పూడ్చివేస్తూన్నారు.అక్రమార్కులకు,రియల్టర్లకు స్థానికంగా ఉండే కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు అండగా ఉంటూ కబ్జాలకు పాల్పడుతున్నారు. గ్రామాలలో ఉండే బూత్ స్థాయి నాయకులు సైతం అక్రమార్కులకు, రియల్టర్లకు అండగా ఉంటూ భూ కబ్జాలకు పాల్పడుతున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ పరిసర ప్రాంతాలల్లో భూ కబ్జాలు మూడు పువ్వులు ఆరు కాయలు అన్నచందంగా నడుస్తున్న సంబంధిత రెవిన్యూ అధికారులు సైతం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**భూమి స్వభావంలో తారుమారు...!**

మహేశ్వరం,కందుకూరు మండలంలోని పలు గ్రామాల్లో గత 40-30 సంవత్సరాల క్రితం భూమి స్వభావం పట్టా భూమిగా ఉన్న భూమిని భూదాన్ భూమిగా,భూదాన్ భూమిని ప్రభుత్వ భూమిగా,అసైన్డ్ మెంట్ భూములుగా భూ స్వభావంలో మార్చారు.ప్రస్తుతం పట్టా భూములు కూడా నిషేధిత జాబితాలో ఉండటం వల్ల భూ యాజమానులు తహశీల్దార్,ఆర్డీవో,కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.భూమి స్వభావంలో జరిగిన పొరపాట్ల గురించి భూ యాజమానులు రెవిన్యూ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్న నేటికి కూడా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని భూ యజమానులు పేర్కొంటున్నారు.తుమ్మలూరు గ్రామంలో సర్వే నంబర్ 197లో పట్టా భూమి నుంచి,భూదాన్ భూమి,భూదాన్ భూమి నుంచి ప్రభుత్వ భూమిగా భూ స్వభావం మారింది.ప్రస్తుతం ఈ భూమిలో వెంచర్ చేసి ప్లాట్లు చేశారు.ప్లాట్లు క్రయ విక్రయాలు కూడా జరుగుతున్నాయి.ఒక వేళ ప్రభుత్వ భూమి అయితే ఏ విధంగా ప్లాట్లు చేసి అమ్మకాలు జరుపుతున్నారు.అనుమతులు ఏ విధంగా ఇచ్చారో అధికారులకే తెలియాలి.ఈ వెంచర్ లో గ్రామ పంచాయతీకి రావాల్సిన 10 శాతం భూమిని కూడా గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయలేదు అనే ఆరోపణలు ఉన్నాయి.

**ఓవర్సీలు లేకుండానే పట్టాగా మారిన ఇనామ్ భూములు**

తుమ్మలూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 145,146,147,148,149,150ల లో భూమిని సాయిప్రియ వెంచర్ నిర్వాహకులు కొనుగోలు చేశారు. సాయిప్రియ వెంచర్ నిర్వాహకులు కొనుగోలు చేసిన భూమి అంతా ఇనామ్ భూమి.సర్వే నంబర్ 145,146,147,148,149,150 పహనీలల్లో సెరుబా ఇనామ్(దస్తుగర్ధన్ ఇనామ్) అని ఉంటుంది.ప్రస్తుత భూ భారతిలో సర్వే నంబర్ 150ఆ దస్తుగర్దన్ ఇనామ్ భూమి అని చూపిస్తుంది.ఇనామ్ భూములను పట్టా భూమిగా మార్చాలంటే ఓఆర్సీ తీసుకున్న తర్వాతనే పట్టా భూమిగా మారుతుంది.కాని తుమ్మలూరు గ్రామంలో సర్వే నంబర్145,146,147,148,149,150 భూములకు ఓఆర్సీలు జారీ చేయకుండానే పట్టా భూమిగా ఏ విధంగా మార్చారు అనేది రెవిన్యూ అధికారులు సమాధానం తెలపాలి.ప్రస్తుతం సాయి ప్రియ వెంచర్ నిర్వాహకులు ప్లాట్లు చేసి క్రయ విక్రయాలు జరుపుతున్నారు.

ఇదే గ్రామంలో సర్వే నంబర్315 లో లావాణి పట్టా భూములను పట్టా భూమిగా మార్చారు. లావాని పట్టా భూములను పట్టా భూములుగా మార్చి పాసు పుస్తకాలను సైతం పొందారు.పాతాళంలోకి మట్టి తవ్వకాలను జరుపుతున్నారు. తుమ్మలూరు గ్రామంలో ఉన్న లావాణి,అసైన్డ్ మెంట్ భూములపై రియల్టర్ల కన్ను పడింది.సర్వే నంబర్ 356 లో ఒక ఎకర మూడు గుంటలు సీలింగ్ భూమి ఉంది.సీలింగ్ భూమి కబ్జాకు గురైంది.సర్వే నంబర్ 377 భువన్ వెంచర్ నిర్వాహకులు మిగులు భూమిని కబ్జా చేశారు. సర్వే నంబర్ 377 ఆర్ఎస్ఆర్ రికార్డు ప్రకారం భూమి మొత్తం విస్తీర్ణం సుమారు19 ఎకరాల నాలుగు గుంటల భూమి ఉంది.ప్రస్తుత భూ భారతిలో సర్వే నంబర్ 377 లో భూమి మొత్తం విస్తీర్ణం 23 ఎకరాల 21 గుంటల భూమి ఉంది.ఆర్ఎస్ఆర్ రికార్డుకు,ప్రస్తుత భూ భారతి రికార్డు ప్రకారం సుమారు 4 ఎకరాలు భూ విస్తీర్ణం పెరిగింది. భూమి విస్తీర్ణం ఏ విధంగా పెరిగింది.

తుమ్మలూరు గ్రామంలో ఓ వెంచర్ నిర్వాహకులు స్మశాన వాటిక బోర్డు తమ వెంచర్‌కు అడ్డువస్తుందాన్ని పంచాయతీ కార్యదర్శుల పాలనలో స్మశాన వాటిక బోర్డును వేరే చోటకు మార్చారు.తుమ్మలూరు గ్రామంలో సుమారు 40 పైగా వెంచర్లు ఉన్నాయి.అందులో గ్రామ పంచాయతీకి ఎన్ని వెంచర్లు 10 శాతం భూమిని రిజిస్ట్రేషన్ చేశారో అధికారులే సమాధానం తెలుపాలి.

**భూమి అమ్మినవారే తిరిగి యాజమానులుగా మారారు...!**

మహేశ్వరం,కందుకూరు మండలాలలోని పలు గ్రామాలల్లో కొంతమంది వ్యక్తులు తమ అవసరాల కోసం 35-30 సంవత్సరాల క్రితమే తమ భూములను అమ్మకాలు జరిపారు.గతంలో భూమి అమ్మకాలు జరిపినవారే నేడు కొంతమంది యాజమానులుగా కొనసాగుతున్నారు.భూముల క్రయవిక్రయాలు జరిగిన వెంటనే మ్యుటేషన్ ప్రక్రియను చేపట్టాలి.కాని అప్పటి అధికారుల నిర్లక్ష్యం వల్ల మ్యుటేషన్ ప్రక్రియను వెంటనే చేయకపోవడంతో కొనుగోలు చేసిన వారికి సమస్యలు వస్తున్నాయి.గతంలో అమ్మినవారు ధరణిని అడ్డం పెట్టుకొని తమ పేరు మీద రికార్డు లో కొనసాగారు.గతంలో అమ్మకాలు జరిపిన వారి పేర్లు మళ్ళీ రావడంతో కొంతమంది గ్రామాలలో ఆర్థికంగా,రాజకీయంగా పలుకుబడి ఉన్నవారు ధరణిని ఆసరాగా తీసుకొని కొనుగోలు చేసిన వారిపై కేసులు వేసి ఇబ్బందులు గురి చేస్తున్నారు.మరో పక్క మా పూర్వీకులు తక్కువ ధరకు అమ్మారు.మా పేరు మీదనే భూమి రికార్డు ఉందని బెదిరింపులకు సైతం పాల్పడుతున్నారు.ప్రస్తుత భారతిలో కూడా మా పేరు ఉందని చెబుతున్నారు.గతంలో అమ్మిన వారికి ఎక్కడ కబ్జా లేదు కాని రికార్డులో పేరు మాత్రం ఉంటుంది.ఇలా సామాన్య రైతులను ఇబ్బందులకు గురి చేసి తమ భూములను కొల్లగొట్టాలని చూస్తున్నారు.ప్రస్తుత రోజులల్లో మీ పేరు మీద భూమి,ప్లాట్ ఉన్న కబ్జాలో ఎవ్వరు ఉన్నారో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. లేకపోతే రాత్రి రాత్రికి వేరే వ్యక్తులు వచ్చి తమ పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్న సంఘటనలు మహేశ్వరం, కందుకూరు మండలాలల్లో ఉన్నాయి.

## అంబేద్కర్ ఆశయాల సాధనకు యువత ముందుకు రావాలి



**ఘట్‌కేసర్, మే 17 (జనం సాక్షి) :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి బక్కని నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న 266వ వారం నిత్య పూలమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బక్కని నర్సింగ్‌రావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, అంటరానితనం తీవ్రంగా ఉన్న కాలంలో ఎన్నో అవమానాలు ఎదురైనా విద్యను ఆయుధంగా చేసుకుని అంబేద్కర్ ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. లండన్ వంటి విదేశీ దేశాల్లో న్యాయ విద్యను అభ్యసించి, తిరిగి భారతదేశానికి వచ్చి పేద, పీడిత ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడారని గుర్తు చేశారు. డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా అన్ని వర్గాలకు సమాన న్యాయం కలిగేలా భారత రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. నేటి విద్యార్థులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలని సూచించారు. సమాజంలో కుల నిర్మూలన జరగాలని ఆకాంక్షిస్తూ జై భీం నినాదంతో తన ప్రసంగాన్ని ముగించారు. ఇలాంటి చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న ఎం. అరుణ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డా. మీసాల మల్లేష్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కౌన్సిలర్ కడుపోళ్ల మల్లేష్, ఉట్కూరి అశోక్ గౌడ్, కట్కూరి నర్సింగ్‌రావు, అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఈరిటం శ్రీనివాస్, గురజకుంట్ల నర్సింహ, ఎం నర్సింగం, వడ్‌కుమార్, సంతోష్, బి కిరణ్, జి రమేష్, బి కుమార్, ఎం పెంటయ్య, కె రమేష్, కడప రవి, లాజర్, నవీన్ కుమార్, కృష్ణంరాజు, నవీన్ చంద్ర, యెల్లేష్, సి ఉపేందర్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాప్రా చెరువు అభివృద్ధికి శ్రీకారం

- సుందరీకరణకు రూ. 35 కోట్ల నిధులు
- అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కాప్రా, మే 17 (జనం సాక్షి) :** కాప్రా చెరువుకు రూ 35 కోట్లతో అభివృద్ధి పనులను ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాప్ర చెరువును సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం 35 కోట్ల రూపాయల ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని తెలిపారు. చెరువు పరిసరాలను పచ్చదనంతో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపేలా వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, లైటింగ్, విశ్రాంతి ప్రదేశాలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాత కాప్ర చెరువు నగరంలో ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, స్థానిక ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మెన్ రావుల శ్రీధర్ రెడ్డి మాజీ కార్పొరేటర్‌లు కొత్త రామారావు, ప్రభుదాస్, శ్రీనివాస్ రెడ్డి , గొల్లురి అంజయ్య, పన్నాల దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి సాయి జెన్ శేఖర్ , బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బైరి నవీన్ గౌడ్, గంధం నాగేశ్వర్ రావు ,నీలం రెడ్డి , మరాఠీ రవీందర్రావు , భాస్కర్ గౌడ్,దామోదర్, బి ఏ రాంచందర్ గౌడ్,సంజీవ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా రూపకల్పనలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి



**నిజాంపేట్, మే 17 (జనం సాక్షి) :** ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పట్ల పార్టీ నాయకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్య నాయకుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ కార్యక్రమం ప్రారంభమైన నాటి నుండి దేశవ్యాప్తంగా వివిధ రకాల విమర్శలు వ్యతిరేకత వ్యక్తం అవుతుందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పార్టీకి చెందిన నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఎ)లు జాగ్రత్తతో వ్యవహరించాలని తెలిపారు . మరణించిన ఓటర్లను జాబితా నుండి తొలగించడం 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా చేర్చడం జరుగుతుందని అన్నారు. అలాగే ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, వివిధ రాష్ట్రాలు వివిధ భాషలకు చెందిన వారు వచ్చి స్థిరపడి ఓటర్లుగా నమోదయ్యారన్నారు. సర్వే కార్యక్రమంలో ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రజల జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ పాటించవలసిన నియమ నిబంధనలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు అవగాహన కల్పించారు. 2000 టు జనాభా ప్రతిపాదికను ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడంతో పాటు డూప్లికేట్ ఓట్లు, పర్మనెంట్ మైగ్రేటెడ్ ఓట్లు, అసలు మనుషులు లేని పేర్లతో ఉన్న ఓట్లను గుర్తించడం కుటుంబ సభ్యుల ఓట్లను మ్యాపింగ్ చేయడం కొత్త ఓటర్లను చేర్చడం ఇంకా ఏమైనా చేర్పులు మార్పులు ఉంటే వాటిని సరిదిద్దేలా నాయకులు బిఎల్ఏలు సంక్షేమ సంఘాల నాయకులు సీనియర్ సిటిజన్స్ యువత ఒక బాధ్యతగా తీసుకొని ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను సమన్వయ పరుచుకుంటూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం పరుచుకోవాలనేలా పనిచేయాలన్నారు. అదేవిధంగా రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతంపై చేపటనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం నూతన కమిటీల నియామకంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత ప్రజల్లోకి ఎలా దూసుకెళ్లాలని చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు పలు డివిజన్లకు చెందిన పార్టీ అధ్యక్షులు సీనియర్ నాయకులు పలు సంక్షేమ సంఘాల నాయకులు మహిళా నాయకురాలు అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జంట హత్య కేసు నిందితురాలు ఆత్మహత్యాయత్నం

- కరణ్ కోట్ పోలీస్టేషన్‌లో ఘటన
- మొయినబాద్ హత్యల కేసులో విచారిస్తుండగా ఘాతుకం
- మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రికి తరలింపు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, మే 17 (జనం సాక్షి) :** పోలీసుల నిర్లక్ష్యమో.. దురదృష్టమో తెలియదు కానీ ఫోక్స్ కో కేసులో ఒక నిందితుడు తప్పించుకున్న సంఘటన మరువకముందే మరో సంఘటన జరిగింది.రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ జంట హత్యల కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబేగం ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది.పోలీస్టేషన్‌లో విచారిస్తుండగా బాతురూంకని వచ్చి సూసైడ్‌కు యత్నించింది. ఈ ఘటన ఆదివారం కలకలం రేపింది. మోయినాబాద్ తోల్కట్ట ఫాం హౌస్ వద్ద ఆబేదాబేగం, మహబూబాబీ తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయీంకు కలిసి వారిని నమ్మించి దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే.నిందితులు మృతుల వద్ద వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా తీసుకున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని మహిళలు ఒత్తిడి తీసుకరావడంతో వారిని చంపేయాలని కరీమాబేగం, రెహమాన్, నయీం పథకం వేశారు. డబ్బు ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు.ఆ తరువాత ఆబేదాబేగంను కూడా అక్కడికే తీసుకెళ్లి అదేరీతిలో హత్య చేసి పాతిపెట్టారు. ఈ కేసులో కరీమాబేగంను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆదివారం కరణ్‌కోట్ పీఎస్‌లో విచారిస్తుండగా.. బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించారు. హుటాహుటిన ఆమెను చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. పోలీసులకు కాలం కలిసి రావడం లేదా లేక వారిని దురదృష్టం వెంటాడుతుందా అనే చర్చ జరుగుతుంది. రెండు కీలకమైన కేసుల్లో నిందితులు పోలీసులపై మచ్చ పడేవిధంగా ప్రవర్తించారు. పోలీసుల ముప్పు తిప్పలు పడిపోక్సు కేసులో నిందితుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలిచ్చి పోలీసులు ఊపిరి పీల్చుకో గా మరుసటి రోజే జంట హత్యల కేసులో నిందితురాలు ఆత్మహత్యాయత్నం చేయడం సంచలనంగా మారింది. ఈ సంఘటనతో పోలీసులు తలబాదుకుంటున్నారు. నిందితురాలి పరిస్థితి విషమించి జరగరానిది జరిగితే ఈ ఘటనలో ఎంత మంది పోలీసులపై చర్యలు ఉంటాయో వేచి చూద్దాం..

## గోరక్షణ పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించం

- బక్రీద్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి



**ఉప్పల్, మే 17 (జనం సాక్షి) :** బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఉప్పల్ డివిజన్ ఏసీపీ వెంకట్ రెడ్డి సూచించారు. గోరక్షణ పేరుతో కొందరు వ్యక్తులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం సమాజంలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తుందని హెచ్చరిస్తూ, అలాంటి చర్యలను పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరని స్పష్టం చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతలు, సామాజిక సామరస్య పరిరక్షణ, ప్రజల సహకారం వంటి అంశాలపై ఉప్పల్ ఏసీపీ కార్యాలయంలో ప్రత్యేక పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నేతలు, మత పెద్దలు, సామాజిక సంస్థల ప్రతినిధులు, గోరక్షణ సంఘాల సభ్యులు, కాలనీ ప్రతినిధులు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, "అక్రమంగా గోవులను తరలిస్తున్నారనే సమాచారం వచ్చినప్పుడు ఎవరూ స్వయంగా వెళ్లి వాహనాలను అడ్డుకోవద్దు. అలాంటి సందర్భాల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. అవసరమైతే డయల్-100కు కాల్ చేయాలి. కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని గొడవలకు దిగితే పరిస్థితులు అదుపు తప్పే అవకాశం ఉంది" అని పేర్కొన్నారు. కొంతమంది భావోద్వేగాలకు లోనై చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడుతున్నారని, దీనివల్ల చిన్న ఘటనలే పెద్ద ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజలు సహనం పాటిస్తూ పోలీస్ శాఖపై నమ్మకం ఉంచాలని కోరారు. ప్రతి ఫిర్యాదును పోలీసులు అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటారని భరోసా ఇచ్చారు. బక్రీద్ సమయంలో సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు, పుకార్లు, రెచ్చగొట్టే పోస్టులు ఎక్కువయ్యే అవకాశముందని ఏసీపీ హెచ్చరించారు. ఎలాంటి నిర్ధారణ లేని సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని, అనుమానాస్పద పోస్టులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పండుగల అసలు ఉద్దేశ్యం సామరస్యాన్ని పెంపొందించడమేనని, మత విద్వేషాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవంతో ఉండాలని అన్నారు. ప్రజల సహకారంతోనే పండుగలను ప్రశాంతంగా నిర్వహించగలమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి, నాచారం డీఐ మాన్‌సింగ్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన బీజేపీ నాయకులు, కాలనీ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. సమావేశంలో ట్రాఫిక్ నియంత్రణ, రాత్రి పహారా, అనుమానాస్పద వాహనాల తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ వంటి అంశాలపై కూడా చర్చించారు.

# గురుకులాల ప్రత్యేకతను దెబ్బతీయొద్దు

**హయత్ నగర్, మే 17 (జనం సాక్షి) :** విద్యాశాఖ బదిలీ విధానాన్ని యథాతథంగా అమలు చేయడం సరికాదు, బదిలీల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఉద్యోగులకు కల్పించిన బదిలీల వెసులుబాటును కొందరు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తూ, పత్రికలలో తప్పుదోవ పట్టించే కథనాలు ప్రచారం చేసి గురుకులాల్లో బదిలీల ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా టీగారియా రాష్ట్ర అధ్యక్షులు అలగోని నర్సింహులు గౌడ్, జనరల్ సెక్రటరీ ఎస్. గణేష్ లు మాట్లాడుతూ గురుకుల సంస్థల నిర్మాణం, పరిపాలనా వ్యవస్థ, క్యాడర్ విధానం సాధారణ విద్యాశాఖకు పూర్తిగా భిన్నమని స్పష్టం చేశారు. అలాంటి ప్రత్యేక వ్యవస్థపై విద్యాశాఖ బదిలీ విధానాన్ని యథాతథంగా రుద్దడం పరిపాలనా పరంగా తీవ్ర సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు. సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీల్లో సంస్థ ప్రారంభమైనప్పటి నుంచి ఉపాధ్యాయులకు కనీస సర్వీస్ రెండు సంవత్సరాలు, గరిష్ట సర్వీస్ ఐదు సంవత్సరాలు అమలులో ఉండగా, ప్రిన్సిపాళ్లకు గరిష్ట సర్వీస్ నాలుగు సంవత్సరాల విధానం అమలులో ఉందన్నారు. ఈ విధానం గతంలో ఎప్పుడూ విద్యాశాఖ బదిలీ విధానానికి అనుసంధానం కాలేదని గుర్తు చేశారు. విద్యాశాఖలో ప్రభుత్వ ఉపాధ్యాయుల పోస్టులు జిల్లా క్యాడర్ పరిధిలో ఉండటంతో ఎనిమిది సంవత్సరాల సర్వీస్ ప్రమాణం అమలు సాధ్యమవుతుందని, కానీ గురుకులాల్లో పోస్టులు జోనల్, మల్టీజోనల్, స్టేట్ క్యాడర్ పరిధిలో ఉండటం వల్ల అదే విధానాన్ని అమలు చేస్తే ఉద్యోగులు, సంస్థలు రెండూ ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. గురుకులాల్లో ఒకే ప్రాంతంలో ఐదు సంవత్సరాలకు మించి కొనసాగినప్పుడు గ్రౌండ్ లెవెల్‌లో తలెత్తే పరిపాలనా, సామాజిక, వ్యవస్థాపక సమస్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉందన్నారు. అందుకే గతంలో జరిగిన బదిలీలలో కూడా విద్యాశాఖలో అమలవుతున్న ఎనిమిది సంవత్సరాల విధానాన్ని యథాతథంగా అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రత్యేకంగా 317 జీవో లోకలైజేషన్ ప్రక్రియ సమయంలో ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఐదు సంవత్సరాల సర్వీస్‌ను ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ.ఎంఎస్ నెం.38, తేదీ 21-04-2026, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అండ్ అకౌంట్స్, తెలంగాణ, హైదరాబాద్ జారీ చేసిన సర్క్యులర్ మెమో నెం. జ1/5697/2026, తేదీ 23-04-2026 ప్రకారం గురుకుల సొసైటీల్లో పనిచేస్తున్న




ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కూడా బదిలీల్లో పాల్గొనే అవకాశం కల్పించబడినట్లు స్పష్టంగా పేర్కొనబడిందన్నారు. అయితే కొద్దిమంది వ్యక్తులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ నిర్ణయాలను వక్రీకరిస్తూ, బదిలీల ప్రక్రియను నిలిపివేయాలనే ఉద్దేశంతో అపోహలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇది ఉద్యోగుల హక్కులను హరించే చర్యగా టీగారియా అభివర్ణించింది. ప్రస్తుతం అమలులో ఉన్న 2--5 సంవత్సరాల బదిలీ విధానాన్నే కొనసాగిస్తూ, ఒకే ప్రాంతంలో గరిష్ట సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు బదిలీల అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సెన్సెస్ డ్యూటీల్లో ఉన్న పోస్టులను ఖాళీలుగా పరిగణించి బదిలీలలో చూపించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి బాహ్య ఒత్తిళ్లకు లోనుకాకుండా సంక్షేమ గురుకులాల్లో బదిలీల ప్రక్రియను తక్షణమే ప్రారంభించి, సంబంధిత మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని టీగారియా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

‘కష్టంతో పైకి వచ్చానంటే ఎవరి కష్టంతో అని అడుగుతాను నేను’ ప్రకాష్ రాజ్ ఓ సినిమాలో పలికిన ఈ డైలాగ్ అందరికీ గుర్తుండే ఉంటుంది. కష్టపడి పైకి వచ్చానని చాలా మంది నోటి వెంట మనం వింటూనే ఉంటాం. వాస్తవానికి ఇక్కడ ‘ఎవరి కష్టంపై’ అనేది ఎవరికి వారుగా వేసుకోవాల్సిన ప్రశ్న. అచ్చం ఇలాంటిదే టెంట్ నుంచి పెంట్ హౌస్ వరకు ఎదిగిన ఓ మాజీ విలేకరి ప్రస్థానం. ఒక పేరు మోసిన పత్రికలో విలేకరి ఉద్యోగం వెలగబెట్టిన సదరు సాధారణ వ్యక్తి రియల్ ఎస్టేట్‌లో అడుగు పెట్టి నయ వంచనతో అసాధారణ స్థితికి చేరాడు. జనాన్ని నిట్ట నిలువునా మోసం చేస్తూ కోట్ల కట్టలపైకి ఎక్కి కూర్చున్నాడు. అతగాడి నిర్వాకాల్లో మచ్చుకి ఒకటి తెలుసుకుందాం..!



# సీలింగ్ భూమి సైలెంట్‌గా ఖూనీ

## ఎంచక్కా పాట్లు చేసి విక్రయం

- పేదోళ్ల నెత్తుటి కష్టాన్ని దోచుకున్న శ్రీనివాసుడి రియల్ లీలలు
- అసలు విషయం తెలుసుకుని లబోదిబోమన్న బాధితులు
- ప్రశ్నించిన వారిపై గాండ్రింపులు, బెదిరింపులు
- ఎఫ్ఐఆర్ నమోదైనా బెయిల్‌పై తప్పించుకు తిరుగుతున్న వైనం
- టెంట్ నుంచి పెంట్ హౌస్‌కు ఎదిగిన ఓ మోసగాడి నిర్వాకమిది

**ఖమ్మం బ్యూరో, మే 17 (జనంసాక్షి) :**

అది ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగు రెవెన్యూ పరిధి. జిల్లా కేంద్రానికి సమీపం కావడంతో ఒకప్పుడు రియల్ ఎస్టేట్ కొత్త పుంతలు తొక్కిన ప్రాంతం. ఈ క్రమంలోనే మన వైట్ కాలర్ విలన్ అక్కడ ఒక వెంచర్ వేశాడు. మూడెకరాల స్థలాన్ని ప్లాట్లుగా మార్చి గజం రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు ధరతో ఎడాపెడా విక్రయించేశాడు. అయితే ఇందులో మోసం ఏముందనే కదా అందరికీ వచ్చిన డౌట్.! అసలు కథాకమామిషు ఇక్కడే ఉంది మరి. అది సీలింగ్ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉండటమే అసలు మిస్టరీ.! అయితే ఇక్కడ మన కథలోని హీరో “శ్రీనివాసుడు” తెలివిగా ఓ పని చేశాడు. వివాదం తలెత్తితే తన మీదికి రాకుండా ఆ రాముడికి ఆంజనేయుడిలా ఉండే తన బంటు “అంజన్న”కు ముందే ఆ భూమిపై హక్కులు కల్పించి ప్లాట్ల కొనుగోలు దారులకు అతనితోనే రిజిస్ట్రేషన్ చేయించాడు. అయితే డబ్బులు మాత్రం మన శ్రీనివాసుడే జేబులో వేసుకున్నాడండోయ్.! మంచి ఊపు మీదున్న క్రమంలో ఈ వెంచర్‌కు సమీపంలోనే ఉన్న మరో 27 ఎకరాల భూమికి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి మరో పెద్ద వెంచర్ వేయాలని చూసి విఫలం చెందడం గమనార్హం.

### జంకుబొంకులేని బరితెగింపు

కాలక్రమంలో ఆ భూమి సీలింగ్ భూమి అనే ప్రచారం ఊపందుకోవడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్ధిదారులు లబోది బోమన్నారు. తమకు జరిగిన మోసాన్ని ప్రశ్నించడం మొదలు పెట్టారు. అయినా జంకుబొంకు, “తుళ్ళూరి”తనం లేకుండా సద రు నయవంచకుడు తానేమీ తప్పు చేయలేదన్నట్లు





కాలర్ ఎగరేశాడు. తెలివిగా రామ బంటు “అంజన్న” పేరుతో కదా రిజిస్ట్రేషన్ జరిగింది నాకేంటి అనుకున్నాడు. బాధితులు తమ డబ్బులు ఇవ్వాలని దయనీయంగా వేడుకున్నా లెక్కచేయలేదు. పిల్లల భవిష్యత్తు కోసం కూడబెట్టిన కష్టార్జితం ఆ శ్రీనివాసుడి హుండీలో పడేసరికి నిలువునా మోసపోయామని గ్రహించిన కొందరు బాధితులు మొఖం పట్టుకుని ప్రశ్నిస్తే అసలు ఆ భూమి తన పేరుతో లేదని బుకాయించాడు. తన తప్పేమీ లేదన్నట్లు బాధితులపై గాండ్రింపులు, బెదిరింపులకు పాల్పడ్డాడు. ఒక దశలో నన్నెవరూ ఏమీ చేయలేరన్నట్టుగా వ్యవహరించాడు.

### వేగంగా స్పందించిన యంత్రాంగం

ఎంత కప్పిపుచ్చుకోవాలని చూసినా జరిగిన తప్పును ఎవరూ దాచలేరు కదా.! దీంతో “తుళ్ళూరి”తనం ఎరుగని శ్రీనివాసుడి నయ వంచక వ్యవహారంపై రెవెన్యూ యంత్రాంగం వేగంగా విచారణ చేపట్టింది. ఈ ఫలితంగానే నాటి తహశీల్దారు ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు మన కథలోని హీరోపై కేసు నమోదు చేశారు. తర్వాత ఆ మూడెకరాల భూమికి ఫెన్సింగ్ వేసిన రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ స్థలమని బోర్డు పెట్టారు. అయితే ఇంత జరిగినా సిగ్గుఎగ్గూ ఎరుగని శ్రీనివాసుడు బెయిల్ తెచ్చుకుని ఎంచక్కా జనంలో తిరుగుతున్నాడు. కాగా న్యాయస్థానం సాక్షిగా తమకు న్యాయం జరగాలని, ఆ నయ వంచకుడికి శిక్ష పడాలని బాధితులు నిత్యం దండాలు పెడుతున్నారు.

# బీపీ... అదుపులో ఉంటేనే హ్యాపీ

## వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా మెడికవర్ హెల్త్‌టాక్



**కరీంనగర్ బ్యూరో, మే 17 (జనంసాక్షి) :**

హైపర్‌టెన్షన్ (బీపీ)ని అదుపులో ఉంచుకుంటే ఆరోగ్యం పై ఎలాంటి ప్రభావం ఉండదని మెడికవర్ వైద్యులు సూచించారు. వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కరీంనగర్ వెటర్నరీ కళాశాల మైదానంలో వాకర్స్ కోసం ప్రత్యేక హెల్త్ టాక్ నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, అనెస్థీషియా నిపుణుడు డాక్టర్ వినయ్, క్రిటికల్ కేర్ వైద్యుడు డాక్టర్ ఉపేందర్ రెడ్డి పాల్గొని అధిక రక్తపోటు (బీపీ) వల్ల కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల పై మాట్లాడుతూ... బీపీని “సైలెంట్ కిల్లర్”గా అభివర్ణించారు. చాలా మందికి బీపీ ఉన్న విషయం తెలియకపోవడం వల్ల గుండె, మెదడు, కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని హెచ్చరించారు. రెగ్యులర్‌గా బీపీ చెక్ చేసుకోవడం ద్వారా సమస్యను ముందుగానే గుర్తించి అదుపులో ఉంచుకోవచ్చన్నారు. రోజువారీ జీవితంలో ఫిజికల్ ఆక్టివిటీ, మంచి నిద్ర, ఇంట్లో తయారైన ఆహారం తీసుకోవడం వంటి అలవాట్లు బీపీ నియంత్రణకు దోహదపడతాయని తెలిపారు. రోజు కు ఐదు గ్రాములకంటే ఎక్కువ ఉప్పు తీసుకోవద్దని సూచించారు. ప్రతి మూడు, నాలుగు నెలలకు ఒకసారి బీపీ పరీక్ష చేయించుకోవాలని, 140 దాటితే తప్పనిసరిగా వైద్యుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. అలాగే ఒత్తిడిని తగ్గించుకోవడం, ప్రకృతికి దగ్గరగా జీవించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం ద్వారా బీపీని నియంత్రించవచ్చన్నారు. కిడ్నీ సమస్యలున్న వారిలో బీపీ పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. అవసరమైతే మాత్రమే మందులు వాడాలని, ప్రతి ఒక్కరూ జీవితాంతం బీపీ మందుల పై ఆధారపడాల్సిన అవసరం లేదని వైద్యులు వివరించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన హెల్త్‌టాక్‌లో 21వ డివిజన్ కార్పొరేటర్ వరాల నర్సింగం, కాంగ్రెస్ పార్టీ టౌన్ జనరల్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి భూంరెడ్డి, కోశాధికారి రాంనాథం, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, చంద్రశేఖర్, సంతోష్, మనోజ్, హరీష్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రమించారు.. సాధించారు



**సంగారెడ్డి, మే 17 (జనం సాక్షి) :** పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తమ లక్ష్యసాధన దిశగా తొలి అడుగు వేశారు. ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలి తాల్లో సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ జడ్.పి.హెచ్.ఎస పాఠశాల విద్యార్థులు10కి10 గ్రేడు పాయింట్లు సాధించమే కాకుండా రాష్ట్ర ,జిల్లా స్థాయిలో సత్తాచాటారు. తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నిరంతరం శ్రమించిన వీరు భవిష్యత్తు లోనూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయులు యాదగిరి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి దశరథ్, ప్రధానోపాధ్యాయులు యాదగిరి మాట్లాడుతూ... మల్కాపూర్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు తో పాటు నగదు పొందడమే కాకుండా ఆదివారం సంగారెడ్డి కలెక్టర్ ఆడిటోరియంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ , టిజిఐఐసి చైర్మన్ నిర్మల జయ ప్రకాష్ రెడ్డి , జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా రూ.10 వెల నగదు తో పాటు ప్రశంసా పత్రం తమ విద్యార్థులు అందుకోవడం సంతోషంగా ఉ ందన్నారు. ఎన్నడూ లేని విధంగా మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడడం అభినందనీయమన్నారు.

# అతివేగం బలి.. చెట్టును ఢీకొని యువకుడు మృతి

**కరీంనగర్ టౌన్, మే 17, (జనం సాక్షి) :** కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపాల్పూర్ గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బెజ్జంకి సాయికుమార్ (25) మృతి చెందినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు. సాయికుమార్ తన బంధువు యశ్వంత్‌తో కలిసి కెటిఎం బైక్‌పై కరీంనగర్ నుంచి గోపాలపూర్ వెళుతుండగా రోడ్డుపైకి వచ్చిన కుక్కను తప్పించబోయి బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా, సాయికుమార్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యశ్వంత్ ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.



# రాజన్న గోశాలకు ఎండు గడ్డి విరాళం

## ఐదేళ్లుగా నిరంతరంగా అందిస్తున్న రైతులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 17 (జనంసాక్షి) :**

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు సమర్పిస్తున్న కోడెలను ఆలయ అధికారులు గోశాలకు తరలిస్తారు.తిప్పాపురంలోని గోశాలకు యాసంగి వరి పంటలు పండించిన రైతులు ఎండు గడ్డిని (పశుగ్రాసం) ఆలయ గోశాలకు విరాళంగా అందజేశారు. పెద్దపెల్లి జిల్లాలోని కనుకుల, మారుతినగర్, రామునిపల్లి, తొగర్రాయి ప్రాంతాలకు చెందిన జానకిరామ్ ట్రాక్టర్ ఓనర్ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు 65 ట్రాక్టర్ల ఎండు గడ్డిని గోశాలకు అందచేశారు. గత ఐదేళ్లుగా రైతులు గోశాలకు నిరంతరంగా ఎండు గడ్డిని అందజేస్తున్నారు. 10 ట్రాక్టర్లతో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం, గత సంవత్సరం 45 ట్రాక్టర్లు, ఈ ఏడాది 65 ట్రాక్టర్ల ఎండు గడ్డిని విరాళంగా గోశాలకు అందజేయగా ఆలయ డీఈఓ భాస్కర శర్మ వారిని అభినందించారు.ఎండు గడ్డిని అందజేసిన రైతులకు స్వామివారి దర్శనం కల్పించి స్వామివారి



ప్రసాదాన్ని అందజేశారు.అనంతరం ఆలయ ఈవో రమాదేవి మాట్లాడుతూ గోశాలకు ఎండు గడ్డి,పచ్చగడ్డి, కూరగాయలు,పండ్లు,ఫలాలు తీసుకొచ్చి గోవులకు ఆహారం అందిస్తున్న భక్తులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గో సేవ ఎంతో పుణ్యప్రదమైందని, గోవులకు ఆహారం పెట్టడం ద్వారా అపారమైన పుణ్యం లభిస్తుందన్నారు.గోశాలకు సేవ చేయాలనుకునే భక్తులు నేరుగా గోశాలకు వచ్చి తమ వంతు సహాయం అందించవచ్చని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ పిఆర్ఓ శ్రీనివాస్ శర్మ,గోశాల ఇన్చార్జి విజయ్, గొట్టం రవి,ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ స్కూళ్లలో మెరుగైన వసతులు, బోధన : ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం
- ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 17 (జనంసాక్షి):** విద్యాభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముందుకు సాగుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11 నుంచి 17 వరకు విద్యాశాఖ వారోత్సవాలు నిర్వహించారు. ఈ ముగింపు సందర్భంగా జిల్లా సమగ్ర కార్యాలయ సముదాయంలో ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు, వివిధ స్పోర్ట్స్, గేమ్స్‌లో రాణించిన వారికి నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

పదో తరగతి, ఇంటర్‌లో మొత్తం 11 మంది విద్యార్థులు మంచి మార్కులు సాధించగా, లక్ష రూపాయలు ప్రోత్సాహం కింద అందజేశారు. బడికి తక్కువ సెలవులు తీసుకుని హాజరైన టీచర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సమ్మర్ క్యాంపులు ప్రారంభించి 100 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చామని, సర్పంచులకు కూడా విద్యా ప్రాధాన్యతపై వివరించామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో కార్పొరేట్ స్థాయి బోధన, వసతులు కల్పిస్తామని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని చెప్పారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను హైదరాబాద్‌లో సన్మానిస్తామని తెలిపారు. 10 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసి, బదిలీలు, ప్రమోషన్లు కల్పిస్తున్నామని వెల్లడించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు మంజూరు చేసి విద్యార్థులు, యువతకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు రానున్నాయని, ఆరుట్లలో డే స్కాలర్ విధానం ద్వారా వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను ప్రారంభించారని, జూన్ 12 వరకు 10 శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యా శాఖ వారోత్సవాల సందర్భంగా సైన్స్ ల్యాబులు, అదనపు తరగతులు, రెమెడియల్ తరగతులు, గ్రంథాలయ దినోత్సవం, సమ్మర్ క్యాంపులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీశాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప రెడ్డి, డీఈఓ జగన్‌మోహన్ రెడ్డి, వివిధ మండలాల ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

- జిల్లా అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయి పర్యటనలు, పర్యవేక్షణ
- ఇప్పటి దాకా 16,511 మంది రైతుల నుంచి 1,33,125 మెట్రిక్ టన్నుల సేకరణ
- దాదాపు 44 శాతం సేకరణ లక్ష్యం పూర్తి
- రైతులకు రూ.188 కోట్ల 37 లక్షలు చెల్లింపు
- వాహనాల కొరత అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- కొనుగోళ్లు, తరలింపు, అన్ లోడింగ్ పర్యవేక్షణకు అధికారుల నియామకం



**రాజన్న సిరిసిల్ల బ్యూరో,మే 17 (జనం సాక్షి) :**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుంది.ఇప్పటి దాకా 1,33,125 లక్షల మెట్రిక్ టన్నుల సేకరించగా, 44 శాతం పూర్తి అయింది. ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారి, కొనుగోలు కేంద్రాలకు, మిల్లులకు, గోడౌన్లకు ప్రత్యేక అధికారులను నియమించి కొనుగోళ్ళు, తరలింపు, అన్ లోడింగ్ సాఫీగా ముందుకు సాగేలా పక్కా ప్రణాళిక ప్రకారం అధికార యంత్రాంగం ముందుకు సాగుతున్నది.రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, ప్యాక్స్, మెప్మా, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 236 కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించడానికి, రైతులకు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, ప్రక్రియ సజావుగా సాగేలా చూస్తున్నారు. అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు అందిస్తున్నారు.సంబంధిత శాఖల జిల్లా అధికారులతో పాటు, జిల్లాలోని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఇతర సిబ్బంది తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, క్షేత్ర స్థాయిలో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచనలు చేస్తూ, కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం అయ్యేలా దృష్టి సారిస్తున్నారు.ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నారు.

### వాహనాలు అందుబాటులో ఉండేలా..

రైతుల నుంచి తూకం వేసి సేకరించిన ధాన్యం మిల్లులకు తరలించేందుకు వాహనాలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేస్తున్నారు. ఈసారి ధాన్యం తరలింపులో లారీలు, వ్యాన్లు, ట్రాక్టర్లకు అనుమతి ఇచ్చి, ధాన్యం తరలింపులో ఇబ్బందులు రాకుండా చూస్తున్నారు. ధాన్యం నిల్వలో ఇబ్బందులు దూరం చేసేందుకు.. ధాన్యం నిల్వలో ఇబ్బందులు దూరం చేసేందుకు జిల్లాలోని మార్కెట్ యార్డ్ గోదాములు, అపరల్ పార్క్ కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అక్కడ ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూస్తూ, వారికి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం సౌకర్యాలు కల్పిస్తున్నది.

### ఇప్పటికే 44 శాతం పూర్తి..

జిల్లాలో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటిదాకా 16,511 మంది రైతుల నుంచి 1,33,125 మెట్రిక్ టన్నులు సేకరించారు. దాదాపు 44 శాతం సేకరణ లక్ష్యం పూర్తి అయింది. రైతులకు ఇబ్బందులు కలగకుండా రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేస్తున్నారు.ఇప్పటిదాకా రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.188 కోట్ల 37 లక్షలు జమ చేశారు.

# ఈ రోడ్డు ఎవరి ప్రయోజనం కోసమో.!?

## ఇళ్లే లేని చోట రూ.24 లక్షలతో రోడ్డు

- రెండు ఇళ్ల కోసం 250 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం
- ఇంటి యజమానులతోనూ ఖర్చు పెట్టించి రూ.24 లక్షలు ఏం చేశారో?
- ఖమ్మం 13వ డివిజన్ లో కేఎంసీ అధికారుల నిర్వాకం



**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) :**

ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేస్తున్నారంటే అది ఖచ్చితంగా ప్రజా ప్రయోజనం కోసమే అయి ఉండాలి. ప్రజలు తమ కష్టాన్ని పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించిన ధనాన్ని తిరిగి అధిక సంఖ్యాకుల ప్రయోజనం కోసమే ఖర్చు చేయడం సర్వసాధారణం. అయితే ఒకరిద్దరి ప్రయోజనం కోసం లక్షల ప్రజా ధనాన్ని ఖర్చు పెడితే దానికి ఏ పేరు పెట్టాలి.? ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ లో అచ్చం ఇదే జరిగింది. 250 మీటర్ల బీటీ రోడ్డు కోసం అక్షరాలా రూ.24 లక్షలు నేల మీద పోశారు. ఇదెక్కడో కాదండోయ్.! సాక్షాత్తు రాష్ట్ర రెవెన్యూ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటికి కూతవేటు దూరంలో చోటుచేసుకున్న విడ్డూరమే మరి.!

ఆ రోడ్డులో రెండే రెండు ఇళ్లు ఉన్నాయి. అవి కూడా గరీబోళ్ల ఇళ్ళు కానేకావు. బడాబాబుల ఇళ్లు అవి. అయినా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ 250 మీటర్ల విస్తీర్ణం కలిగిన ఆ రోడ్డుకు బీటీ వేసేందుకు రూ.24 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ రోడ్డు వేసే క్రమంలో చోటుచేసుకున్న విచిత్రం మరొకటి ఉంది. ఈ రోడ్డు ద్వారా ప్రయోజనం పొందే ఒక అపార్ట్మెంట్ యజమాని రూ. లక్ష ఖర్చు పెట్టి తన అపార్ట్మెంట్ ముందు రోడ్డును ఎత్తు లేపుకున్నాడు. అలాగే మరో ఇంటి యజమాని రూ.60 వేలు ఖర్చు చేసి తన ఇంటి ముందు కంకర పోసి ఎత్తు లేపుకున్నాడు. ఒక దశలో ఈ రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్, మున్సిపల్ డీఈలు ఈ రోడ్డును మీరే వేయించుకోండని వారికి చెప్పడం గమనార్హం. చివరికి ఇంటి యజమానులతో ఖర్చు చేయించి, రూ.24 లక్షల ప్రజా ధనాన్ని ఖర్చు పెట్టి నిర్మించిన ఈ రోడ్డు సొగసు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. ఎత్తు పల్లాలు, వంకర టింకరలతో ఈ రోడ్డు చూపరులకు విస్మయం కలిగిస్తోంది. అయితే ఆ రోడ్డు నిర్మాణానికి రూ.24 లక్షలు ఖర్చు చేసింది వాస్తవమేనని, వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఒకసారి ఫీల్డ్ విజిట్ చేస్తానని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ శాఖ డీఈ నవ్యజ్యోతి “జనం సాక్షి” ప్రతినిధికి సెలవిచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
18 మే 2026

# ఫోరెన్సిక్ సైబర్ సెక్యూరిటీలో మాస్టర్స్ పట్టా

## న్యూ జెర్సీ సెయింట్ పీటర్స్ యూనివర్సిటీలో ప్రజ్వల ప్రతిభ



నర్సంపేట, మే 17 (జనంసాక్షి) : నర్సంపేట పట్టణానికి చెందిన పెద్దారపు ప్రజ్వల అమెరికాలోని న్యూ జెర్సీలో గల ప్రఖ్యాత సెయింట్ పీటర్స్ యూనివర్సిటీలో ఫోరెన్సిక్ సైన్స్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో ప్రతిభ కనబరిచి మాస్టర్స్ పట్టా సాధించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా పట్టాను ఇచ్చి ఘనంగా సత్కరించారు. దీంతో ప్రజ్వల తల్లిదండ్రులు పెద్దారపు రమేష్, రాధ ఇతర కుటుంబ సభ్యులు హర్షాన్ని వ్యక్తం చేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. విదేశాల్లో ఫోరెన్సిక్ సైన్స్ లో మాస్టర్స్ పట్టా సాధించిన అది కొద్ది మందిలో ప్రజ్వల ఒకరు. ప్రజ్వల ఏడవ తరగతి వరకు నర్సంపేటలో, ఇంటర్ వరకు వరంగల్ లో, ఫోరెన్సిక్ గ్రాడ్యుయేషన్ మధుర ఉత్తర ప్రదేశ్ లో అభ్యసించింది అనంతరం ఫోరెన్సిక్ లో ఉన్నత విద్య అభ్యసించడానికి అమెరికాలోని న్యూ జెర్సీ లో గల సెయింట్ పీటర్స్ యూనివర్సిటీ అడ్మిషన్ ఇవ్వగ ప్రతిభ కనబరిచి మాస్టర్స్ పట్టా పొందడం గర్వించదగింది.

# పట్టుబడుతున్న మందుబాబులు

- వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 300 మందిపై కేసులు



శేరిలింగంపల్లి, మే 17 (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మందుబాబులు మళ్లీ చచ్చిపోయారు. విచ్చలవిడిగా మద్యం సేవించి యదేచ్ఛగా డ్రైవింగ్ చేస్తూ పోలీస్ అధికారులకు పట్టుబడ్డారు. శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ ను సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం ఏడిసిపి జి. హనుమంతరావు పర్యవేక్షణలో సంబంధిత పోలీస్ అధికారులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మొత్తం 300 మందిపై కేసులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం ఏడిసిపి హనుమంతరావు ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడిస్తూ శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విభాగం పోలీసుల వీకెండ్ స్పెషల్ డ్రైవ్‌ను విస్తృతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాల నడుపుతున్న వ్యక్తులు మొత్తం 300 మంది వాహనదారులు, వ్యక్తులు మోతాదుకు మించి మద్యాన్ని సేవించి పట్టుబడగా ఇందులో 253 మంది ద్విచక్ర వాహనాల డ్రైవర్లు, 09 మంది ఆటో రిక్షా డ్రైవర్లు, త్రీ వీలర్ వాహనదారులు కాగా 38 మంది కార్లను, ఇతర ఫోర్ వీలర్ లను నడుపుతూ పట్టుబడినట్లు ఏడిసిపి తెలిపారు. ఇందులో 232 మంది బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ తో పట్టుబడడం జరిగిందని, దీనిని కనిష్టంగా 36ఎంజి/100 ఎంఎల్ నుండి 200 ఎంజి/100 ఎమ్మెల్ వరకు, 35 మంది 201 ఎంజి/100 ఎమ్ఎల్ నుండి 300 ఎంజి/100 ఎం ఎల్ మద్యం సేవించడం జరిగిందని, అలాగే 33 మంది 301 ఎంజి/100 ఎమ్మెల్ నుండి 500 ఎంజి/100 ఎమ్మెల్ వరకు మద్యాన్ని సేవించి పట్టు బడడం జరిగిందని ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు వివరించారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరు పరచనున్నట్లు అధికారులు తెలుపగా, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఈ నేరానికి గరిష్ట శిక్ష పది సంవత్సరాల జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు. గత వారం( మే 11 నుండి మే 16 వరకు)మొత్తం 96 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోర్టు్ల పరిష్కరించడం జరిగిందని వీరిలో 07 గురికి జరిమానా, మరో (02) ఇద్దరికి జైలు శిక్ష, 87 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# ఈపీసెట్ - 2026 ఫలితాల్లో 'అల్ఫోర్స్' చారిత్రాత్మక విజయం

## విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి వెల్లడి






కరీంనగర్ బ్యూరో, మే 17 (జనంసాక్షి) : ఆదివారం ప్రకటించిన ఈపీసెట్ – 2026 ఇంజనీరింగ్, అగ్రికల్చర్, పార్మసి ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి కరీంనగర్ చరిత్రలో కనివిని ఎరుగని ర్యాంకులు సాధించారని అల్ఫోర్స్" విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. అల్ఫోర్స్ ఈపీసెట్ – 2026 ఇంజనీరింగ్, అగ్రికల్చర్, పార్మసి ఫలితాలలో డి.రిత్విక్ (ఆగ్రీకల్చర్, ఫార్మసి విభాగములో) 11వ ర్యాంకుతో అత్యున్నత స్థానంలో నిలవగా, పి.చరణ్ (ఇంజనీరింగ్ విభాగంలో) 22 వ ర్యాంకుతో ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. అలాగే సి. హెచ్. లక్ష్మీహసిని (ఇంజనీరింగ్ విభాగంలో 74, నిదా (అ,ఫా) 157, పి.అక్షయ (ఇ) 251, ఎల్. అర్యనావు (ఇ)252, మహ్మద్ హూసేన్ (అ, ఫా) 272, వి. రుచిత (ఆ,ఫా) 293, ఏ. నాగసింధు (ఇ) 330, బి. అభిఘ్న (ఇ) 430, వి సుహాసిని(ఇ) 439, వి శ్రేయస్ రెడ్డి (ఇ) 487, జై. నయన్ (అ,ఫా) 505, జి చైత్ర (ఇ) 506, బి.లిఖిత్సాయి (ఇ) 538, ఎల్. అనంతసాయి (అ,ఫా) 543, కె.అక్షిత (ఆ,ఫా) 555, జి. లాస్యరెడ్డి (ఇ) 614, జి హర్షిత (అ డ ఫా) 637, టి .హర్షిత (అ డ ఫా) 697, టీ .సహస్ర (ఇ)739, జె.జస్రిత్స సాయి (ఇ)745, డి. విశ్వతేజ (ఇ) 772, యమ్. సిరిమణి (అడఫా) 814, సయ్యద్ మలాజోద్దిన్ (అ,ఫా) 836, షరిన్ఫాతిమా (అ,ఫా) 898, కె. ధనుష్ (ఇ) 904, పి.చంధన(ఆ,ఫా) 905, యన్. జస్వంత్సాయి (అ,ఫా) 921, కె. అక్షయ (ఇ) 951, ఎల్. ప్రణయని(ఇ) 954, ఏన్. రత్నప్రకాశ్ (ఇ) 961, ర్యాంకులతో అల్ఫోర్స్కు అఖండ విజయం అందించారని తెలిపారు. 32 మంది విద్యార్థులు 1,000 లోపు ర్యాంకు సాధించడం విశేషం, 57 మంది విద్యార్థులు 2,000ల లోపు ర్యాంకులు, 88 మంది విద్యార్థులు 3,000ల లోపు ర్యాంకులు, 127 మంది విద్యార్థులు 4000 ల లోపు, 169 మంది విద్యార్థులు 5,000ల లోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్ కీర్తి ప్రతిష్టలను దశదిశలా చాటారని తెలిపారు. ఈ మధ్య ప్రకటించబడిన ఐఐటీ (మెయిన్) ఫలితాలలో కూడా 'అల్ఫోర్స్' చారిత్రాత్మక విజయం సాదించింది. 450 మంది విద్యార్థులు ఐఐటీ (అడ్వాన్స్)కు అర్హత సాదించడం "అల్ఫోర్స్" మరో సంచలనం. పటిష్ట ప్రణాళికతో విద్యాబోదన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషివల్ల 'అల్ఫోర్స్' ఇంతటి ఘనవిజయాలు సాదించగలుగుతుందన్నారు. రాబోయే ఐఐటీ (అడ్వాన్స్), నీట్ ఫలితాలలో కూడా 'అల్ఫోర్స్' మహట్నన్నత ర్యాంకులతో ముందంజలో ఉంటుందని విశ్వసిస్తున్నానని ఈపీసెట్ – 2026 ఫలితాల్లో ర్యాంకులు సాదించిన మా 'అల్ఫోర్స్' చిన్నారులను, వారి తల్లిదండ్రులను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని, ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు.

# గడువు ఇచ్చినా ఖాళీ చేయరేం

- 17 రోజులు దాటినా గుడిసెలను ఖాళీ చేయించని రియల్టర్లు
- మరోసారి ఖాళీ చేయించమని చెప్పిన అధికారులు
- ముష్కిన్ చెరువు అభివృద్ధికి ఆటంకాలు లేకుండా హైడ్రా చర్యలు



హైదరాబాద్, మే 17 (జనంసాక్షి) : గడువు ఇచ్చినా రియల్టర్లు గుడిసెలు ఖాళీ చేయకపోవడంపై హైడ్రా హెచ్చరించింది. 17 రోజులు దాటినా గుడిసెలను ఖాళీ చేయించని రియల్టర్లను హైడ్రా హెచ్చరించింది. 'మీరంతా ముష్కిన్ చెరువు ఎఫ్ టీ ఎల్ (ఫుల్ ట్యాంక్) పరిధిలో ఉన్నారు. తాత్కాలిక షెడ్లుల్లో మిమ్ములను ఉంచి చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న భూములను కొట్టేయాలని రియల్టర్లు చూస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలు, మట్టి పోసి.. చెరువు స్వరూపాన్ని మార్చేశారు. ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్తను తెచ్చి చెరువు పరిధిలో వేస్తున్నారు. వ్యర్థాలు చెరువులోకి వదిలేస్తున్నారు. చెత్తను తగులబెట్టి చెరువును కలుషితం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న తాత్కాలిక షెడ్డులు(నివాసాలు), దుకాణాలను పెట్టించి.. వారి ఆక్రమణలకు అడ్డుగా మిమ్ములను ముందుంచుతున్నారు. చెరువు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఏప్రిల్ 29న ఇక్కడకు వచ్చాం.. 10 రోజుల్లో మీరంతా ఖాళీ చేయాలని సూచించాం. ఈ రోజు మే 16వ తేదీ అంటే 17 రోజులయ్యింది. ఇందులో 10 శాతం మంది మాత్రమే ఖాళీ చేశారు. మీరు కూడా ఖాళీ చేస్తే ముష్కిన్ చెరువును అభివృద్ధి చేయాలి. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నారని గుడిసెలను ఖాళీ చేయించాలని ఈ భూమి తమదిగా చెబుతున్నవారికి కూడా 6 నెలల క్రితం చెప్పాం. మీకు ఆ సమాచారం వాళ్లు ఇవ్వడంలేదనే నేరుగా మీకు చెబుతున్నాం. 17 రోజులైనా మీరు ఖాళీ చేయడంలేదు. కోర్టు కూడా ఈ విషయంలో డ్యూ ప్రోసెస్ పాటించాలని సూచించింది. ఈ క్రమంలోనే ముందుగా మీకు కూడా తగినంత సమయం ఇచ్చాం.. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న తాత్కాలిక షెడ్డులను ఎప్పుడైనా తొలగిస్తాం. ఈ భూమి తమదిగా చెబుతున్న వారు టీడీఆర్ కింద నష్టపరిహారం పొందే అవకాశం ఉంది. మీరే అనవసరంగా నష్టపోతారు ఖాళీ చేయాలి" అని హైడ్రా అధికారుల బృందం (హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్) తెలిపింది. పనులకు వెళ్లినవారిని దృష్టిలో ఉంచుకుని శనివారం సాయంత్రం అక్కడ తాత్కాలిక షెడ్డులు వేసుకున్నవారిని కలిసి ఈ విషయాన్ని స్పష్టం చేసింది. గతంలో వచ్చి 10 రోజులు గడువు ఇచ్చినా.. మరో వారం రోజులు పెంచాం. కాని ఏమాత్రం మార్పు రాలేదు.. ఇప్పటికైనా ఖాళీ చేయండి.. ఒకటి రెండు రోజుల్లో ఎప్పుడైనా వచ్చి వాటిని తొలగిస్తామని అధికారులు వారికి చెప్పారు.

### 52.20 ఎకరాలు ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్

చుట్టూ వేలాది నివాసాలు.. లక్షలాది మంది తిరిగాడే ప్రాంతంలో ఉన్న ఒక్కగానొక్క ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధిని హెచ్ ఎం డీ ఏ 52.20 ఎకరాలుగా గతంలోనే నిర్ణయించింది. బఫర్‌తో కలిపితే 62 ఎకరాల వరకూ ఉంటుందని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. నిర్మాణ వ్యర్థాలు, మట్టి, చెత్త పోయడంతో కుంచించుకు పోయింది. ఇందులో పయనీర్స్ సంస్థ 18 ఎకరాల వరకూ తమదంటూ వాధిస్తూ వస్తోంది. రైతులకు చెందినది 12 ఎకరాల వరకూ ఉంది. వీటికి తోడు.. మరో 4.20 ఎకరాలు వేర్వేరు వ్యక్తులు క్లైమ్ చేస్తున్నారు. ఇలా మొత్తం 34.20 ఎకరాలు చెరువు ఎఫ్టీఎల్ పరిధిలోనిదే అని హెచ్ ఎం డీఏ లెక్కల ప్రకారం తేలుతుంది. శిఖం సర్కారీ ల్యాండ్ 21 ఎకరాల మేర ఉంది. గతంలో బఫర్ జోన్లో నిర్మించిన ప్రహరీని రెవెన్యూ అధికారులు కూల్చేశారు కూడా. అయినా పట్టించుకోకుండా.. చెరువులో మట్టిని నింపుతూ ఎఫ్టీఎల్ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టడానికి బడా నిర్మాణ సంస్థ సిద్ధమౌతోంది. వరద నీరు రాకుండా కాలువలను మూసేసి నిర్మించిన ప్రహరీని అక్కడి స్థానికులు చూపించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో శిఖం పట్టా భూములుంటే అందులో వ్యవసాయం మాత్రమే చేసుకునే వెసులుబాటు ఉంది. అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని.. భూమి స్వరూపాన్ని మార్చకూడదనే నిబంధనలున్నాయి. ఇవేవీ పట్టించుకోకుండా మట్టి పోయడంతో చెరువు కుంచించుకుపోయింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో భూములకు నష్టపరిహారం పొందే అవకాశం ఉన్నా.. ఆ దిశగా అక్కడి రైతులు, రియల్టర్లు ప్రయత్నించకుండా చెరువులో నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్నారు. చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే ఇక్కడి పరిసరాలు ఆహ్లాదంగా మారుతాయి. భూగర్భ జలాలు పెరుగుతాయని అధికారులు చెప్పారు.

# స్పేర్ పార్ట్స్ ధరల నియంత్రణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

- అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్(ఏఎస్ఆర్‌టీయూ) చైర్మన్ వై.నాగిరెడ్డి
- జాతీయ వేదికపై తెలంగాణ ఆర్టీసీ ముద్ర
- ఆర్టీసీల పురోగతికి సరికొత్త వ్యూహాలు
- టీజీఎస్ ఆర్టీసీ విద్యుత్ బస్సుల నిర్వహణ దేశానికే ఆదర్శం
- మహాలక్ష్మి పథకం విజయవంతంపై ఇతర రాష్ట్రాల ఆర్టీసీల ప్రశంసలు



డెహ్రాడూన్ (జనంసాక్షి) : స్పేర్ పార్ట్స్ ధరల నియంత్రణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్(ఏఎస్ఆర్‌టీయూ) చైర్మన్ వై.నాగిరెడ్డి తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీ వేదికగా అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్ టీయూ) అఖిల భారత సమావేశం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సమావేశానికి అసోసియేషన్ చైర్మన్, టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అధ్యక్షత వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల ఆర్టీసీల చైర్మన్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఙణలు), మరియు ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొని రవాణా రంగ పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఆర్టీసీ సంస్థలకు స్పేర్ పార్ట్స్ సరఫరా చేసే వెండర్స్ తో కీలక భేటీ జరిగింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా విపరీతంగా పెరుగుతున్న స్పేర్ పార్ట్స్ ధరలను ఎలా అధిగమించాలనే అంశంపై అసోసియేషన్ చైర్మన్ వై. నాగిరెడ్డి కీలక సూచనలు చేశారు. పెరిగిపోతున్న ధరల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు, ఆర్టీసీలపై ఆర్థిక భారం పడకుండా చూసేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు.

సమావేశంలో వై.నాగిరెడ్డి మాట్లాడుతూ... దేశంలోనే మొట్టమొదటి సారిగా కాలుష్య నివరణకు తెలంగాణలో విద్యుత్ (ఎలక్ట్రికల్) బస్సులను విజయవంతంగా నడుపుతున్నట్లు వివరించారు. విద్యుత్ బస్సుల సమర్థవంతమైన నిర్వహణలో టీజీఎస్ ఆర్టీసీ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని పర్యావరణ అనుకూల విద్యుత్ బస్సులను తీసుకువచ్చి, హైదరాబాద్ నగరాన్ని పూర్తి కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజా రవాణా రంగంలో సమాచార సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో టీజీఎస్ ఆర్టీసీ అగ్రగామిగా నిలుస్తోందని ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా, అంతర్గత నిర్వహణను సైతం డిజిటలైజ్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ముఖ్యంగా సంస్థకు గుండెకాయ లాంటి ఆర్టీసీ గ్యారేజీల నిర్వహణలో అధునాతన సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనాల ఫిట్‌నెస్, విడిభాగాల లభ్యత, మెయింటెనెన్స్ షెడ్యూళ్లను పూర్తి డిజిటల్ పద్ధతిలో పర్యవేక్షించడం ద్వారా బస్సుల సామర్థ్యం పెరగడమే కాకుండా, ప్రయాణీకులకు మరింత సురక్షితమైన, నమ్మకమైన సేవలు అందుబాటులోకి వస్తున్నాయని ఆయన వెల్లడించారు.

తెలంగాణలో మహిళల కోసం విజయవంతంగా అమలవుతున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం గురించి చైర్మన్ సదస్సులో ఆయాన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ పథకం ద్వారా అనతికాలంలోనే రికార్డు స్థాయిలో 10 వేల కోట్ల ప్రయాణాలనుపూర్తి చేసి, రవాణా రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించిన తెలంగాణ ఆర్టీసీని సమావేశంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, అధికారులు అభినందించారు. ఈ సమావేశంలో టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.హెచ్. వెంకన్నతో పాటు ఉత్తరాఖండ్, కర్ణాటక, ఒరిస్సా, ఇతర రాష్ట్రాల ఆర్టీసీ చైర్మన్లు, వివిధ రాష్ట్రాల రవాణా రంగ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం

- వారి సేవల గుర్తింపునకు అధికారిక కమిటీ
- భవిష్యత్ కార్యాచరణపై కేశవరావు సమావేశం



హైదరాబాద్, మే 17 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలు, త్యాగాలను అధికారికంగా గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు శనివారం బంజారాహిల్స్‌లో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు నివాసంలో తొలిసారిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిటీ భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ, అమలు చేయాల్సిన విధివిధానాలపై సమగ్ర చర్చ జరిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు, త్యాగాలకు ప్రభుత్వ స్థాయిలో గౌరవం కల్పించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర సాధన కోసం జరిగిన దీర్ఘకాల పోరాటంలో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు కీలక పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో అనేక మంది ప్రాణత్యాగాలు చేయగా, మరికొందరు శారీరక వైకల్యాలకు గురయ్యారు. పలువురు ఉద్యమకారులపై కేసులు నమోదై జైలు జీవితం గడపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తెలంగాణ ఆవిర్భావానికి తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులకు గుర్తింపు కల్పించాలని చాలాకాలంగా వివిధ వర్గాల నుంచి డిమాండ్లు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉద్యమ చరిత్రను సంరక్షిస్తూ, ఉద్యమకారుల త్యాగాలను భావితరాలకు చాటిచెప్పే దిశగా ఈ కమిటీ పనిచేయనుంది. ఈ కమిటీకి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యే-విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాములు నాయక్, ఉద్యమకారుడు మోతే శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ రాజకీయ విభాగం కార్యదర్శి కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

కమిటీ ప్రధాన బాధ్యతలలో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం, ఆయా ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల సమగ్ర జాబితాను సిద్ధం చేయడం, వారికి అందించాల్సిన గౌరవాలు, గుర్తింపులు, సంక్షేమ సౌకర్యాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయడం వంటి అంశాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడి సేవలను గుర్తించి, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# బ్రౌన్ షుగర్ అమ్మేందుకు యత్నించిన ఇద్దరు అరెస్టు

- యాదాద్రి భువనగిరిలో కలకలం..

భువనగిరి (జనంసాక్షి) : యాదాద్రి భువనగిరి జిల్లాలో డ్రగ్స్ కలకలం రేపింది. భువనగిరి పట్టణంలోని ఓ జూనియర్ కాలేజీలో డ్రగ్స్ అమ్మేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాలేజీ ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా తనిఖీ చేసిన పోలీసులు వారి దగ్గర డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. వనగిరి పట్టణంలోని ఓ జూనియర్ కాలేజీ ఆవరణలో డ్రగ్స్ అమ్మేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం(మే15, 2026) పోలీసులు అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్ కు చెందిన హబీబ్ బుర్రన్ రెహ్మాన్, ఖదీర్ అనే ఇద్దరు యువకులు కాలేజీలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 50 గ్రాముల బ్రౌన్ షుగర్ పట్టుబడటంతో కేసు నమోదు చేశారు. అనంతరం రిమాండ్ కు తరలించారు. కాలేజీ ఆవరణలో డ్రగ్స్ కలకలంతో విద్యార్థులు, కాలేజీ స్టాఫ్ ఒక్కసారిగా ఉలిక్కపడ్డారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370